- ✓ పోలండ్ ప్రధాన మంత్రి మాథ్యూస్ మొరావెస్కీ ప్రభుత్వం కుప్పకూలింది. పార్లమెంటులో జరిగిన అవిశ్వాస పరీక్షలో ఓడిపోవడంతో నేషనల్ కన్జర్వేటివ్ పార్టీ ఎనిమిదేళ్ల పాలన ముగిసిపోయింది. ఐరోపా యూనియన్ మాజీ నేత డొనాల్డ్ టస్క్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడనుంది. టస్క్ 2007 – 2014 మధ్య కాలంలోనూ పోలండ్ ప్రధాని మంత్రిగా ఉన్నారు. పోలండ్ దిగువసభలో మొత్తం 460 మంది సభ్యులుండగా మొరావిస్కీ ప్రభుత్వానికి అనుకూలంగా 190 ఓట్లు, వ్యతిరేకంగా 266 ఓట్లు వచ్చాయి. దీంతో మొరావెస్కీ ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోక తప్పలేదు.



## 2024ని అంతర్జాతీయ ఒంటెల సంవత్సరంగా ప్రకటించిన ఐక్యరాజ్యసమితి

- ✓ 2024ను అంతర్జాతీయ ఒంటెల సంవత్సరం (ఐవైసి 2024)గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవితాల్లో అల్పాకాస్, బాక్ట్రియన్ ఒంటెలు, డ్రోమెడరీలు, గ్వానాకోస్, లామాస్ వికునాస్ వంటి ఒంటెల ప్రాముఖ్యతను నొక్కి చెప్పడానికి ఐక్యరాజ్యసమితి ఈ నిర్ణయం ప్రకటించింది.




- ✓ 90కి పైగా దేశాల్లోని మిలియన్ల మంది కుటుంబాల జీవనోపాధికి ఒంటెలు ఎలా కీలకంగా ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి నివేదించింది. ఒంటెలు ఈ కమ్యూనిటీల ఆహార భద్రత, పోషణ మరియు ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్నాయి, అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్నఈ కమ్యూనిటీలకు బలమైన సాంస్కృతిక ప్రాముఖ్యతను అందిస్తున్నాయి.

## హాలీవుడ్ చిహ్నానికి వందేళ్లు

- ✓ ప్రపంచంలో అత్యంత గుర్తింపు పొందిన చిహ్నాల్లో లాస్ ఏంజలీస్ లోని హాలీవుడ్ చిహ్నం ఒకటి. తాజాగా అది ఏర్పాటు చేసి వందేళ్లు విజయవంతంగా పూర్తయ్యాయి. ఆ సంకేతం మొదట 1923 డిసెంబరు 8న 'హాలీవుడ్ ల్యాండ్' అనే పేరుతో రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం ఏర్పాటు చేశారు. 13 అక్షరాలతో 30 అడుగుల వెడల్పు, సుమారు 43 అడుగుల పొడవుతో, 3 నుంచి 9 అడుగుల మెటల్‌తో భారీ స్తంభాలతో దానిని నిర్మించారు. రాత్రి సమయంలో రంగురంగుల లైట్లతో కనువిందు చేస్తూ, ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. 1939లో తొలిసారి ఆ హాలీవుడ్ సంకేతానికి మరమ్మతులు చేశారు. ఐదేళ్ల తర్వాత దాన్ని లాస్ ఏంజలీస్ నగరానికి విరాళంగా ఇచ్చారు. 1947లో మరోసారి మరమ్మతులు చేసి 'ల్యాండ్' అనే పదాన్ని తొలగించారు. అప్పటి నుంచి ఆ నగరంలోని వినోద పరిశ్రమకి చిహ్నంగా మారింది. 100వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ కాలంలో మెరిసిన 'హాలీవుడ్ ల్యాండ్'ను తలపించేలా 'హాలీవుడ్' పదాన్ని లైట్లతో ప్రకాశింపజేశారు.



## మాలిలో ముగిసిన 10 ఏళ్ళ యూఎన్ శాంతి పరిరక్షక మిషన్

- ✓ మాలిలో గత పదేళ్లుగా ఐక్యరాజ్యసమితి నిర్వహించిన మల్టీడైమెన్షనల్ ఇంటిగ్రేటెడ్ స్టెబిలైజేషన్ మిషన్ (MINUSMA) అధికారికంగా ముగించింది. 2012 ఇస్లామిస్ట్ తిరుగుబాటు తర్వాత మాలిని స్థిరీకరించడంలో సహాయపడటానికి 2013లో ఈ మిషన్ స్థాపించబడింది. అయితే ఇటీవలి సంవత్సరాలలో ఈ మిషన్ యందు పెరుగుతున్న విమర్శల కారణంగా, చివరికి మాలియన్ ప్రభుత్వం దాని ఉపసంహరణను అభ్యర్థించింది.



- ✓ మాలి సైనిక ప్రభుత్వం జూన్ 2020లో అధికారాన్ని చేజిక్కించుకున్నప్పటికీ నుండి ఈ మిషన్‌ను నిష్క్రమించాలని డిమాండ్ చేస్తుంది. ఈ మిషన్ గత దశాబ్ద కాలంగా మాలిలో సుమారు 15,000 మంది సైనికులు,పోలీసుల ద్వారా నిర్వహించబడింది. అయితే గత పదేళ్లుగా ఈ మిషన్ భారీ నష్టాలను చవిచూసింది, 300 మందికి పైగా శాంతి పరిరక్షకులు ఈ సమయంలో మరణించారు.

## చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్ట్ నుండి అధికారికంగా వైదొలిగిన ఇటలీ

- ✓ చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్ట్ నుండి ఇటలీ అధికారికంగా వైదొలిగింది. 2019లో ఇటలీ బీఆర్ఐ ప్రాజెక్టులో చేరిన ఏకైక G7 దేశంగా నిలిచింది. ఈ ప్రాజెక్టు ద్వారా చైనాకు సున్నితమైన సాంకేతికత, కీలకమైన మౌలిక సదుపాయాలపై నియంత్రణ పొందే వీలుంటుందని అమెరికా నుంచి వచ్చిన ఆదేశాలను తోసిపుచ్చుతూ ఈ ప్రాజెక్టులో భాగమైంది. అయితే, గతేడాది ఇటలీలో జార్జియా మెలోని అధికారంలోకి వచ్చిన తర్వాత చైనాను, వెస్ట్రన్ దేశాలతో అనుసంధానించే ఈ ఒప్పందం నుంచి విరమించుకోవాలని ఆమె కోరింది. ఈ ప్రాజెక్టు ఇటలీకి పెద్దగా లాభాలు తీసుకురాలేదని ఆమె పేర్కొంది. 2019 ఒప్పందం మార్చి 2024లో ముగుస్తోంది. దీని నుంచి ఉపసంహరించుకున్నట్లు ఇటలీ కనీస మూడు నెలల ముందు రాతపూర్వక వార్నింగ్ ఇవ్వకపోతే ఆటోమెటిక్‌గా పునరుద్ధరించబడుతుంది.



- ✓ దీంతో ఇటలీ ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించడం లేదని చైనా ప్రభుత్వానికి తెలియజేస్తూ.. ఇటీవల బీజింగ్‌కి లేఖ అందించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇకపై మేము బీఆర్ఐలో భాగం కానప్పటికీ.. చైనాతో అద్భుతమైన సంబంధాలు కొనసాగించాలనే ఉద్దేశం మాకు ఉందని ఇటలీ చెప్పినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇతర జీ-7 దేశాలు చైనాతో ఇటలీ కన్నా ఎక్కువ సన్నిహిత సంబంధాలు కలిగి ఉంది, అయినప్పటికీ అవి బీఆర్ఐలో భాగంగా లేవని ప్రభుత్వం వెల్లడించింది. 2024లో ఇటలీ జీ7 అధ్యక్ష పదవిని చేపట్టబోతోంది.
- ✓ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2013లో బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ)ను తెరపైకి తెచ్చారు. వివిధ దేశాల మధ్య అనుసంధాన వ్యవస్థను, ఆర్థిక సంబంధాలను, వాణిజ్యాన్ని పెంపొందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యాలని.. ఇందులో పాల్గొనే ప్రతి దేశానికి అనేక ప్రయోజనాలుంటాయని చైనా పేర్కొంది. ఈ ప్రాజెక్టులో దాదాపు 150 దేశాలు, 30 అంతర్జాతీయ సంస్థలు భాగమయ్యాయి .చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2019లో రోమ్ పర్యటన సందర్భంలో ఇటలీ బీఆర్ఐలో చేరింది. దీనిపై అప్పట్లో అమెరికా, ఐరోపా దేశాలు ఆశ్చర్యం వ్యక్తం చేశాయి.

## వివాదాస్పద ఇమ్మిగ్రేషన్ బిల్లును ఆమోదించిన ఫ్రాన్స్ పార్లమెంట్

- ✓ అవాంఛనీయమని భావించిన విదేశీయులను బహిష్కరించి, ఫ్రాన్స్ సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి ఉద్దేశించిన విభజన ఇమ్మిగ్రేషన్ బిల్లును ఫ్రెంచ్ పార్లమెంట్ ఆమోదించింది, అయితే ఈ బిల్లుకు మెరైన్ లే పెన్ నేతృత్వంలోని తీవ్రవాద జాతీయ ర్యాలీ (RN) మద్దతు ఇవ్వడంతో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ బిల్లు 349-186 ఓట్లతో పార్లమెంట్ దిగువ సభ, నేషనల్ అసెంబ్లీలో ఆమోదం పొందింది.



- ✓ ఈ ఇమ్మిగ్రేషన్ బిల్లు ఆమోదించిన సమయంలో అధ్యక్షుడు మాక్రాన్ సొంత పార్టీ నుండే తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నారు.
- ✓ ప్రధానమంత్రి ఎలిసబెత్ బోర్న్ పార్లమెంటులో ఈ బిల్లును సమర్థించారు, ఇది ఆశ్రయం దరఖాస్తు విధానాలను సులభతరం చేయడం ద్వారా మరియు నేరస్థులు లేదా రాడికలైజ్డ్ విదేశీయులను త్వరగా బహిష్కరించడం ద్వారా వ్యవస్థ యొక్క సామర్థ్యాన్ని పెంచుతుందని పేర్కొంది.
- ✓ ఈ చట్టం ద్వారా కఠినతరమైన ఇమ్మిగ్రేషన్ చర్యలు చేపట్టనున్నారు తద్వారా నిరుద్యోగులైన యూరోపియన్ యూనియన్ కాని వలసదారులకు గృహ ప్రయోజనాలను పొందాలంటే కనీసం ఐదు సంవత్సరాలు సమయం పడుతుంది మరియు, వలసదారుల పిల్లలు ఫ్రెంచ్ పౌరులుగా మారడం కఠినతరం కానుంది. పోలీసులకు వ్యతిరేకంగా తీవ్రమైన నేరాలకు పాల్పడిన ద్వంద్వ జాతీయులు ఫ్రెంచ్ పౌరసత్వాన్ని కోల్పోయే ప్రమాదం కూడా ఉంది.




## ఉల్ఫాతో కేంద్రం శాంతి ఒప్పందం

- అస్సాంలో సాయుధ వేర్పాటువాద ఉద్యమానికి తెరదించి, పూర్తిస్థాయిలో శాంతిని స్థాపించే దిశగా కీలక అడుగు పడింది. యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం (ఉల్ఫా)లోని చర్చలకు అనుకూల వర్గంతో కేంద్రం, అస్సాం రాష్ట్ర ప్రభుత్వం త్రైపాక్షిక శాంతి ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో హింసకు స్వస్తి చెప్పేందుకు, ఉల్ఫాను రద్దు చేసి సంస్థలోని సభ్యులంతా ప్రజాస్వామ్య పథంలో ప్రయాణించేందుకు అంగీకారం కుదిరింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తరపున కేంద్ర హోం మంత్రి అమిత్ షా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఉల్ఫా తరపున ఆ సంస్థకు చెందిన 16 మంది, పౌర సమాజంలోని 13 మంది సభ్యులు కలిసి మొత్తం 29 మంది దిల్లీలో ఈ ఒడంబడికపై సంతకాలు చేశారు.



- అరబింద రాజ్‌ఖోవా నేతృత్వంలోని ఉల్ఫా వర్గంతో 12 ఏళ్లుగా ప్రభుత్వం జరుపుతున్న బేషరతు చర్చల ఫలితమే తాజా ఒప్పందమని అధికారులు తెలిపారు. 'సార్వభౌమ అస్సాం' డిమాండ్‌తో 1979లో ఉల్ఫా ఏర్పాటైంది. అప్పటి నుంచి విధ్వంసక చర్యలకు పాల్పడుతుండటంతో 1990లో కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థను నిషేధించింది. 2011లో ఆ సంస్థ రెండు వర్గాలుగా విడిపోయింది. 2011, సెప్టెంబరు 3 నుంచి రాజ్‌ఖోవా వర్గం ప్రభుత్వంతో శాంతి చర్చలు జరుపుతోంది.

## ముస్లింలీగ్ జమ్మూకశ్మీర్‌పై నిషేధం

- ముస్లింలీగ్ జమ్మూకశ్మీర్ (మసరత్ ఆలం భట్ వర్గం) సంస్థపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. దేశ వ్యతిరేక, వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడటంతో పాటు ఉగ్రవాదానికి సహకారం అందిస్తున్నందుకు గానూ వేటు వేస్తున్నట్లు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు.
- కేంద్ర హోం శాఖ దీనిపై ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సంస్థ పాక్ అనుకూల ప్రచారం చేస్తోందని, ఆ సంస్థ ఛైర్మన్ మసరత్ ఆలం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని పేర్కొంది. అందువల్ల ఈ సంస్థపై ఉపా చట్టం కింద ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది.
- ముస్లిం లీగ్ జమ్మూ కశ్మీర్ (మసరత్ ఆలం వర్గం) సంస్థకు మసరత్ ఆలం భట్ నేతృత్వం వహిస్తున్నాడు. ఆలం భట్ అతివాద 'ఆల్ ఇండియా హురియత్ కాన్ఫరెన్స్' తాత్కాలిక అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నాడు. 2010 నాటి జమ్మూ కశ్మీర్ అల్లర్లతో మసరత్ పేరు వెలుగులోకి వచ్చింది. ఇదే కేసులో అతడిని పోలీసులు అరెస్టు చేశారు. ఉగ్రవాద సంస్థలకు ఆర్థిక సాయం చేశాడన్న అభియోగంతో 2019లో ఎన్ఐఏ అతడిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ప్రస్తుతం అతడు తిహార్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు.

## మూడు కొత్త నేర బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

- బ్రిటిష్ వలస పాలన నాటి నేర న్యాయ వ్యవస్థను ప్రక్షాళించేలా భారత పార్లమెంటు గత వారం ఆమోద ముద్ర వేసిన మూడు కొత్త నేర బిల్లులపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతకం చేశారు. దీంతో అవి చట్టరూపం దాల్చాయి. ఇకపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య (బీఎస్) చట్టాలుగా వాటిని పిలవనున్నారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), భారత సాక్ష్యాధార చట్టం – 1872ల స్థానంలో బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్‌లను



వర్తింపజేయనున్నారు. కేంద్రం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేశాక ఇవి అమల్లోకి వస్తాయి.

## మూడు క్రిమినల్ బిల్లులస్వరూపం

### భారతీయ న్యాయ సంహిత (Bharatiya Nyaya Sanhita)

✓ ఇండియన్ పినల్ కోడ్ (IPC)లో ఉండే 511 సెక్షన్లు ఉండేవి. దాని స్థానంలో వచ్చిన భారతీయ న్యాయ సంహిత (Bharatiya Nyaya Sanhita)లో ఇప్పుడు 358 సెక్షన్లు ఉంటాయి. సవరించిన ఈ చట్టంలో మొత్తం 20 వరకూ అదనంగా నేరాలను చేర్చారు. వాటిలో 33 సెక్షన్లకు జైలు శిక్షను పెంచారు. 83 నేరాలకు భారీ మొత్తంలో జరిమానా విధించే విధంగా మార్చారు. ఆరు నేరాలకు ఇక కమ్యూనిటీ సర్వీస్ పనిష్మెంట్ ఉంది.

### భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (Nagarik Suraksha Sanhita)

✓ క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ (CrPC) లోని 484 సెక్షన్లు ఉండేవి. దాని స్థానంలో వచ్చిన భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (Nagarik Suraksha Sanhita)లో 531 సెక్షన్లు ఉంటాయి. చట్టాన్ని మొత్తం 177 సెక్షన్లలో మార్పులు చేసి 9 సెక్షన్లు అదనంగా చేర్చారు. 39 సబ్ సెక్షన్లు, 44 నూతన ప్రొవిజన్లు యాడ్ చేశారు. చట్టంలో అవసరం లేని మొత్తం 14 సెక్షన్‌లు తొలగించారు.

### భారతీయ సాక్ష్య అధినియం (Bharatiya Sakshya Adhiniyam)

✓ ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ లో 167 ప్రొవిషన్స్ ఉండేవి. దాని స్థానంలో వచ్చిన భారతీయ సాక్ష్య అధినియం (Bharatiya Sakshya Adhiniyam)లో 170 ప్రొవిషన్స్ ఉంటాయి. మొత్తం 24 సెక్షన్లు సవరించారు. చట్టంలో రెండు కొత్త ప్రొవిషన్స్, ఆరు సబ్ ప్రొవిషన్స్ ప్రవేశపెట్టారు. 6 ప్రొవిషన్స్ ను తొలగించారు.

## బిల్లుల్లోని కీలక అంశాలు

✓ ఈ చట్టాల ప్రకారం 90 రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేయాలి. పరిస్థితిని బట్టి మరో 90 రోజుల గడువును కోర్టు ఇవ్వొచ్చు. 180 రోజుల్లో దర్యాప్తును పూర్తి చేసి విచారణకు పంపాలి. ట్రయల్ తర్వాత 30 రోజుల్లో తీర్పు ఇవ్వాలి.

✓ వివాహం, ఉద్యోగం, ప్రమోషన్ల సాకుతో లేదా గుర్తింపును దాచిపెట్టి మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే నేరంగా పరిగణిస్తారు.

✓ సామూహిక అత్యాచారానికి పాల్పడితే 20 ఏళ్ల జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధిస్తారు. మైనర్‌పై అత్యాచారం చేస్తే గరిష్ఠంగా మరణశిక్ష.

✓ మూక దాడులకు పాల్పడితే ఏడేండ్ల జైలు శిక్ష విధిస్తారు. జీవిత ఖైదు, గరిష్ఠంగా మరణ శిక్షలు కూడా విధించేలా నిబంధనలు పెట్టారు.

✓ ఖైదీలకు క్షమాభిక్ష అంశాన్ని రాజకీయంగా ఉపయోగించడాన్ని ఆపేందుకు కొన్ని నిబంధనలు పెట్టారు. మరణశిక్షలను జీవిత ఖైదుగా మాత్రమే మార్చగలరు. జీవిత ఖైదును ఏడేళ్ల వరకు మాత్రమే తగ్గించేలా ప్రొవిజన్స్ పెట్టారు. తీర్పుల రేటును 90 శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యం.

✓ ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కేసు డైరీ, చార్జిషీట్, జడ్జిమెంట్ దాకా ప్రొసీజర్ మొత్తాన్ని డిజిటలైజ్ చేస్తారు.

✓ ఏడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడే కేసుల్లో క్రైమ్ సీన్‌కు ఫోరెన్సిక్ టీమ్ వెళ్లి పరిశీలించడం తప్పనిసరి.

✓ 2027 నాటికల్లా దేశంలోని అన్ని కోర్టులు కంప్యూటరైజ్. త్వరలో ఈఎఫ్ఐఆర్‌లకు అవకాశం.

✓ ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు. 15 రోజుల్లో సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు వెళ్తుంది.

✓ అరెస్టు అయిన వ్యక్తి బాధ్యత తమదేనని చెబుతూ. సంబంధిత కుటుంబానికి సర్టిఫికెట్ ఇచ్చేందుకు ప్రతి జిల్లాలో ఓ పోలీసు అధికారి ఏర్పాటు.

✓ వారికి ఆన్‌లైన్‌లో, వ్యక్తిగతంగా సమాచారం ఇవ్వాలి.

✓ లైంగిక హింస కేసులో బాధితుల స్టేట్‌మెంట్, వీడియో రికార్డింగ్ తప్పనిసరి.

✓ ఏదైనా కేసు స్టేటస్‌ను 90 రోజుల్లోగా పోలీసులు ఇవ్వాలి

✓ ఏడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ రోజులు శిక్ష పడే కేసులను వెనక్కి తీసుకునేందుకు ఏ ప్రభుత్వానికీ అవకాశం ఉండదు.

✓ సివిల్ సర్వెంట్లపై ఫిర్యాదు చేసేందుకు పర్మిషన్ ఇవ్వాలా వద్దా అనేది సంబంధిత అధికారులు 120 రోజుల్లోగా వెల్లడించాలి. ఒకవేళ ఆ లోగా స్పందన లేకపోతే పర్మిషన్ ఇచ్చినట్లుగానే భావించాలి.

✓ నేరస్థుడిగా తేలిన వ్యక్తి ఆస్తుల నుంచి బాధితులకు పరిహారం ఇచ్చేలా నిబంధన.

✓ చిన్నారులపై జరిగే నేరాల్లో 10 ఏండ్ల జైలు శిక్ష విధించవచ్చు. విధించాల్సిన జరిమానా మొత్తం కూడా పెంపు.

✓ రాజద్రోహ చట్టం124 ఏ ప్రకారం అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు ఎందరినో బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. బ్రిటీష్ అవశేష చట్టమైన రాజద్రోహాన్ని స్వాతంత్ర్యం తర్వాత కూడా భారత ప్రభుత్వాలు కొనసాగించాయి. ఈ రాజద్రోహ చట్టం పూర్తిగా రద్దు చేయడంతో ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి మాట్లాడే హక్కును కల్పించినట్లయింది.

✓ క్రిమినల్స్ పరారీలో ఉన్నప్పటికీ విచారణను కొనసాగించవచ్చు. తద్వారా దావూద్ ఇబ్రహీం వంటి నేరస్థులపై విచారణ చేపట్టేందుకు అవకాశం కలుగుతుంది.

## ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

- ✓ పార్లమెంటులోని ఉభయ సభలు అంగీకరించిన 'ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల (నియామకాలు, సర్వీసు నిబంధనల) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేశారు. న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ఆగస్టు 10న ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టగా డిసెంబరు 12న ఎగువసభ, 21న లోక్‌సభ సమ్మతి తెలిపాయి. ఇప్పుడు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయడంతో అది చట్టరూపం దాల్చింది. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ అధికారిక ప్రకటనను జారీ చేసింది. ఇక మీదట కేంద్ర ప్రభుత్వంలో కార్యదర్శి స్థాయిలో పనిచేసిన అధికారులు మాత్రమే ఈ పదవులకు అర్హులు. ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ పోస్టులకు తొలుత న్యాయ శాఖ మంత్రి ఆధ్వర్యంలోని సెర్చ్ కమిటీ అయిదుగురు సభ్యుల జాబితాను రూపొందిస్తుంది. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసిన కేంద్ర మంత్రితో కూడిన ఎంపిక కమిటీ, సెర్చ్ కమిటీ సిఫార్సు చేసిన జాబితా నుంచి ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ పోస్టులకు వ్యక్తులను ఎంపిక చేస్తుంది. వారి నియామక ఉత్తర్వులను రాష్ట్రపతి జారీ చేస్తారు.



## రూ.525 మీరాబాయి స్మారక నాణెం విడుదల చేసిన మోదీ

- ✓ శ్రీకృష్ణ భక్తురాలు, కవయిత్రి మీరాబాయి (1498 – 1547) 525వ జయంతి సందర్భంగా కోల్‌కతా టంకశాల రూ.525 స్మారక నాణెం ముద్రించింది. దీన్ని ప్రధాని మోదీ మధురలో విడుదల చేశారు. కాకినాడకు చెందిన నాణేల సేకర్త మార్ని జానకిరామ్ చౌదరి దీనిని తెప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణేన్ని వెండి, రాగి, నికెల్, జింక్ మిశ్రమంతో రూపొందించినట్లు తెలిపారు. నాణేనికి ఒకవైపు మీరాబాయి చిత్రం, మరోవైపు నాలుగు సింహాలతో పాటు నాణెం విలువ ముద్రించారు.




## జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ అధ్యక్షుడి వయోపరిమితి పెంపు బిల్లుకు ఆమోదం

- ✓ జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ (జీఎస్‌టీఏటీ) అధ్యక్షుడు, సభ్యుల వయోపరిమితి పెంపు ప్రతిపాదిత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీని ప్రకారం ఇప్పటి వరకూ అధ్యక్షుడు, సభ్యులకు 67, 65 ఏళ్లుగా ఉన్న వయోపరిమితి 70, 67 ఏళ్లకు పెరుగుతుంది. బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ జీఎస్‌టీఏటీ ధర్మాసనాల కార్యకలాపాలు మొదలైతే జీఎస్టీకి సంబంధించి హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించిన పలువురు తమ పిటిషన్లను ఉపసంహరించుకునే స్వేచ్ఛను పొందుతారని పేర్కొన్నారు.

## పార్లమెంటుపై ఉగ్రదాడి ఘటనకు 22 ఏళ్లు

- ✓ 2001 డిసెంబరు 13, పార్లమెంటు భవనంలో శీతాకాల సమావేశాలు జరుగుతున్నాయి. ఉగ్రవాదులు ఒక పథకం ప్రకారం ప్రాంగణంలో చొరబడి, అడ్డువచ్చిన వారిని కాల్చుకుంటూ బీభత్సం సృష్టించారు. యావద్దేశం దిగ్భ్రాంతి చెందిన ఆ ఘటనకు 22 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ విషాద ఘటనలో ప్రాణత్యాగం చేసినవారిని పార్లమెంటు స్మరించుకుని నివాళులర్పించింది.



- ✓ 2001 డిసెంబరు 13, ఉదయం 11.40 గంటలకు అయిదుగురు సభ్యుల ఉగ్రమూక పార్లమెంటు ప్రాంగణంలోకి చొరబడింది. హోం శాఖ అనుమతి స్టిక్కర్ అంటించిన ఎరుపు రంగు అంబాసిడర్ బుగ్గకారు లోపలికి వచ్చింది. గేటు నంబరు 12 వైపు అది రాగానే అక్కడి భద్రతా సిబ్బందిలో ఒకరు అనుమానించారు. దూసుకొచ్చిన కారు అక్కడున్న ఉపరాష్ట్రపతి వాహనాన్ని ఢీకొట్టింది. ముష్కరులు బయటకు వచ్చి కాల్పులు మొదలుపెట్టారు. భద్రతా సిబ్బంది గేట్లన్నీ మూసివేశారు. దాదాపు అరగంట పాటు కాల్పులు, ఎదురుకాల్పులు కొనసాగాయి. అయిదుగురు ఉగ్రవాదులనూ భద్రతా దళాలు విజయవంతంగా హతమార్చాయి. తొమ్మిది మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. 18 మంది గాయాలపాలయ్యారు.
- ✓ దాడికి వచ్చిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రసంస్థల ఆత్మాహుతి దళాలేనని దర్యాప్తులో తేలింది. ఈ దాడికి కుట్రపన్నిన మహ్మద్ అఫ్జల్ గురు, అతడి సమీప బంధువు షౌకత్ హుసేన్ గురు, షౌకత్ భార్య అఫ్సాన్‌తో పాటు గిలానీ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అఫ్సాన్‌ను న్యాయస్థానం నిర్దోషిగా తేల్చింది. గిలానీ, షౌకత్‌తో పాటు అఫ్జల్ గురులకు మరణ శిక్ష విధించింది. అప్పీలుకు వెళ్లిన గిలానీ నిర్దోషిగా బయటకు రాగా, షౌకత్ మరణ శిక్షను పదేళ్ల కఠిన కారాగార శిక్షకు తగ్గిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అఫ్జల్ గురుకు ఉరి శిక్ష విధించాలంటూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. క్షమాభిక్ష అభ్యర్థనను అప్పటి రాష్ట్రపతి తిరస్కరించారు. 2013 ఫిబ్రవరి 9న తిహార్ జైలులో అఫ్జల్ గురు ఉరి శిక్ష అమలైంది.

## వారణాసిలో అతిపెద్ద ధ్యాన కేంద్రం స్వరవేద మహా మందిరాన్ని ప్రారంభించిన మోదీ

✓ ప్రపంచంలోనే అతి పెద్ద ధ్యాన కేంద్రమైన స్వరవేద మహా మందిరాన్ని ప్రధాని నరేంద్ర మోదీ వారణాసిలో ప్రారంభించారు. ఒకేసారి 20 వేల మంది ధ్యానం చేసుకునేందుకు వీలుగా దీనిని నిర్మించారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగించారు.



సాధువుల మార్గదర్శకత్వంలో జరిగిన నూతన నిర్మాణాలు, అభివృద్ధి విషయంలో కాశీ ప్రజలు సరికొత్త రికార్డులు సృష్టించారు. అందుకు ఈ మహా మందిరం ఓ నిదర్శనమని మోదీ వెల్లడించారు.

✓ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నవ సూత్రావళిని (9 సూత్రాలను) ఉద్బోధించి, వాటిని నెరవేర్చాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలకు వరుసగా ఆయన చేస్తున్న విజ్ఞప్తుల్లో ఇది నాలుగోది. ప్రతి దాంట్లో ఆయన ఈ నవ సూత్రావళిని సూచిస్తున్నారు.

### నవ సూత్రాలివే

1. ప్రతి నీటి చుక్కనూ పొదుపు చేయాలి. నీటి సంరక్షణపై మరింత మంది ప్రజలను చైతన్యవంతులను చేయాలి.
2. గ్రామ గ్రామానికీ వెళ్లి ప్రజలకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలి. ఆన్‌లైన్ చెల్లింపుల గురించి వివరించాలి.
3. మీ గ్రామం, మీ ప్రాంతం, మీ పట్టణం, మీ నగరాన్ని మరింత పరిశుభ్రంగా తయారు చేసేందుకు పని చేయాలి.
4. స్థానిక ఉత్పత్తులను వీలైనంత ఎక్కువగా ప్రోత్సహించాలి. భారత్‌లో తయారైన ఉత్పత్తులనే వాడాలి.
5. మొదట దేశంలోని ప్రాంతాలనే సందర్శించాలి. విదేశాలకు వెళ్లాలనే ఆలోచన వచ్చినప్పుడు ముందుగా నా దేశాన్ని సందర్శించాలనే దృక్పథం పెరగాలి.
6. రైతులకు సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలి. భూమాతను రక్షించుకోవడానికి ఇది ఎంతో అవసరం.
7. రోజూ తీసుకునే ఆహారంలో శ్రీఅన్నంగా చిరు ధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. సూపర్ ఫుడ్‌గా దానిని ప్రోత్సహించాలి.
8. శారీరక దృఢత్వాన్ని కలిగి ఉండాలి. యోగా, క్రీడలను జీవితంలో భాగంగా మార్చుకోవాలి.
9. కనీసం ఒక పేద కుటుంబానికి అండగా నిలవాలి. వారికి సహాయం చేయాలి. ఇది దేశంలో పేదరికం అంతం కావడానికి సహకరిస్తుంది.

## ఇండియా ఆర్ట్, ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ బినాలే (ఐఏఏడీబీ) 2023ను ప్రారంభించిన మోదీ

✓ దిల్లీలోని ఎర్రకోటలో తొలిసారి నిర్వహిస్తున్న ఇండియా ఆర్ట్, ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ బినాలే (ఐఏఏడీబీ) 2023ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించి అనంతరం ప్రసంగించారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రపంచ నగరాల్లో జరిగే కార్యక్రమాల్లాగే అంతర్జాతీయ గుర్తింపును పొందుతాయన్నారు.



భారతీయ కళలు, నిర్మాణశాస్త్రంతో ముడిపడి ఉన్న ప్రదేశాల అభివృద్ధికి ఎంతో కృషి జరుగుతోందన్నారు. ఇందుకు ఉదాహరణగా పుణ్యక్షేత్రాలైన కాశీ, కేదార్‌నాథ్, మహాకాల్ లోక్‌లో చేపట్టిన అభివృద్ధి, ఆధునికీకరణ చర్యలను మోదీ ప్రస్తావించారు.

✓ ప్రపంచ సాంస్కృతిక కార్యక్రమాలను మన దేశంలో సంస్థాగతం చేయడానికి కేంద్రం కృషి చేస్తోందని ప్రధాని మోదీ వెల్లడించారు. వెనీస్, లండన్, సావోపాలో వంటి నగరాల్లో జరిగే కార్యక్రమాల తరహాలో ఆధునిక వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

## ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

✓ జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ అధికరణాన్ని కాలగర్భంలో కలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేయగల అధికారం రాష్ట్రపతికి ఉందని ఉద్ఘాటించింది.




జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడమూ చెల్లుబాటవుతుందని పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు దేశ చరిత్రలో కీలక మైలురాయి వంటి తీర్పును వెలువరించింది. అదే సమయంలో సాధ్యమైనంత త్వరగా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని ఆదేశించింది. వచ్చే ఏడాది సెప్టెంబరు 30 కల్లా అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. ధర్మాసనంలో సీజేఐతో పాటు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా సభ్యులుగా ఉన్నారు. అధికరణం 370 రద్దు సబబేనంటూ వారంతా ఏకగ్రీవంగా అంగీకరించారు.

## రాష్ట్రపతికి ఆ అధికారం ఉంది: సుప్రీంకోర్టు

- ✓ ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ ఆర్టికల్ 370(3) కింద ఏకపక్షంగా నోటిఫికేషన్ జారీ చేసే అధికారం రాష్ట్రపతికి ఉందని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచిగానీ, రాష్ట్ర సర్కారు తరఫున కేంద్రం నుంచిగానీ రాష్ట్రపతి సమ్మతి పొందాల్సిన అవసరం లేదన్నారు. 1957లోనే జమ్మూకశ్మీర్ రాజ్యాంగ పరిషత్ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఆర్టికల్ 370లో ఇచ్చిన వివరణ ప్రకారం రాజ్యాంగ పరిషత్ మనుగడలో లేదు కాబట్టి ఆ అధికరణాన్ని ఎవరూ రద్దు చేయలేరంటూ పిటిషనర్లు చేసిన వాదనతో ఏకీభవిస్తే ఆర్టికల్ 370(3) వృథా అవుతుంది. అది దాని తాత్కాలిక ధర్మాన్ని కోల్పోతుందని ఆయన వివరించారు. భారత్‌లో జమ్మూకశ్మీర్ విలీనం తాత్కాలికమేనన్న వివరణలు ఆమోదయోగ్యం కావన్నారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కారుకు గొప్ప విజయంగా భావించొచ్చు.

## ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయ సముదాయం 'సూరత్ డైమండ్ బోర్స్' ను ప్రారంభించిన మోదీ

- ✓ 'సూరత్ డైమండ్ బోర్స్' (SDB) భవన సముదాయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. 67 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనాలను నిర్మించారు. 65 వేల మంది వ్యాపారాలు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. దీన్ని ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయ సముదాయంగా చెబుతున్నారు.



- ✓ ప్రపంచంలో ఇప్పటి వరకు అతిపెద్ద కార్యాలయ సముదాయంగా అమెరికా రక్షణ కార్యాలయం పెంటగాన్ ఉండేది. ఇది దాదాపు 66,73,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది.
- ✓ సూరత్ కేంద్రంగా ఉన్న వజ్రాల పరిశ్రమ ఎనిమిది లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని మోదీ ఈ సందర్భంగా తెలిపారు. తాజాగా అందుబాటులోకి వచ్చిన ఎస్‌డీబీతో మరో 1.5 లక్షల మందికి కొత్తగా ఉపాధి లభిస్తుందన్నారు. ఈ భవన సముదాయం నవీన భారత శక్తి, సంకల్పానికి చిహ్నంగా నిలుస్తుందన్నారు.
- ✓ వజ్రాలు, వజ్రాభరణాల అంతర్జాతీయ వ్యాపారానికి ఎస్‌డీబీ (Surat Diamond Bourse) కేంద్రంగా నిలవనుంది. అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దిన ఈ భవనాలను గుజరాత్‌లోని సూరత్ నగరానికి సమీపంలోని ఖాజోద్ గ్రామంలో నిర్మించారు. శుద్ధి చేసిన, ముడి వజ్రాల వ్యాపారానికి ఇది అంతర్జాతీయ కేంద్రంగా మారనుంది. అలాగే ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన కస్టమ్స్ క్లియరెన్స్ హౌస్ కూడా ఇందులోనే ఉంటుంది. ఆభరణాల రిటైల్ వ్యాపారులు తమ విక్రయ కేంద్రాలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసుకోవచ్చు. అంతర్జాతీయ బ్యాంకింగ్, సురక్షిత లాకర్ల సదుపాయం కూడా ఉంటుంది.
- ✓ ముంబయి కేంద్రంగా పనిచేస్తున్న అనేక మంది వజ్రాల వ్యాపారులు ఇప్పటికే ఎస్‌డీబీలో (Surat Diamond Bourse) కార్యాలయాలను దక్కించుకున్నారు. వేలం పద్ధతిలో వీటిని ఎస్‌డీబీ మేనేజ్‌మెంట్ వారికి కేటాయించింది. దీంట్లో దాదాపు 4,500 కార్యాలయాలు ఉన్నాయి. 'డైమండ్ రీసెర్చ్ అండ్ మర్కంటైల్ సిటీ ' లో (DREAM City) భాగంగానే ఎస్‌డీబీని నిర్మించారు. 2015 ఫిబ్రవరిలో నాటి గుజరాత్ ముఖ్యమంత్రి ఆనందీబెన్ పటేల్ దీనికి భూమిపూజ చేశారు.
- ✓ సూరత్ వజ్రాల వ్యాపారానికి ప్రసిద్ధి. ప్రపంచవ్యాప్తంగా వజ్రాలను సానబెట్టడం, పాలిష్ చేయడం వంటి 90 శాతం కార్యకలాపాలు ఇక్కడే జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో తాజాగా అందుబాటులోకి వచ్చిన ఎస్‌డీబీతో (Surat Diamond Bourse) వజ్రాల వ్యాపారం మరింత విస్తరించనుంది.

## వారణాసిలో 2వ కాశీ తమిళ సంగమం 2023

- ✓ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలోని నమో ఘాట్‌లో కాశీ తమిళ సంగమం రెండో ఎడిషన్ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకూ జరిగే ఈ వేడుకలో తమిళనాడు, పుదుచ్చేరి నుంచి 1,400 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధూ, కావేరి పేరిట పలు బృందాలుగా కాశీకి తరలివచ్చారు. వారణాసితోపాటు ప్రయాగ్‌రాజ్, అయోధ్యను వారు సందర్శించారు.
- ✓ తమిళనాడు, కాశీ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సాంస్కృతిక సంగమాన్ని మరింత బలోపేతం చేయడమే కాశీ తమిళ సంగమం ప్రధాన లక్ష్యం. పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలు అందులో పాలుపంచుకున్నాయి. ఈ సందర్భంగా వారణాసి-కన్యాకుమారి మధ్య నడిచే కాశీ తమిళ సంగమం ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రధాని మోదీ పచ్చజెండా ఊపారు.

## సూరత్ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా

- ✓ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం సమావేశమైన కేంద్ర మంత్రిమండలి సూరత్ ఎయిర్‌పోర్ట్‌కు అంతర్జాతీయ విమానాశ్రయం హోదా కల్పించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. వ్యూహాత్మకంగా తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచ వైమానిక రంగంలో సూరత్ కీలక పాత్ర పోషించేందుకు దోహదపడుతుందని ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది.



✓ కీలకమైన అధునాతన సాంకేతికతల అభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు అనువైన వాతావరణాన్ని కల్పించటానికి గాను భారత్, అమెరికా దేశాలు కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందానికి కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అంకుర సంస్థలను బలోపేతం చేసేందుకు రెండు దేశాలు కలిసి పనిచేస్తున్న విషయం విదితమే. ఆధునిక సాంకేతిక రంగంలో వ్యాపార అవకాశాలను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం ఉపకరిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి.

## ద్వారకలో జలాంతర్గామి పర్యాటకం

✓ ద్వారకా నగరాన్ని అన్వేషించడానికి నీటి అడుగున పర్యాటకం కోసం జలాంతర్గామిని నిర్మించేందుకు గుజరాత్ ప్రభుత్వం మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీనితో ఇది భారతదేశపు మొట్టమొదటి జలాంతర్గామి టూరిజం చొరవగా నిలవనుంది. ద్వారక తీరం నుండి దగ్గరలో ఉన్న బెట్ అనే ఒక చిన్న ద్వీపం చుట్టూరా ఈ పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నారు. పర్యాటకులు ప్రత్యేకంగా రూపొందించిన జలాంతర్గామిలో సముద్ర ఉపరితలం నుండి 100 మీటర్ల వరకు డైవ్ చేసి, ఆ ద్వీపం చుట్టూ ఉండే సముద్ర జీవులను వీక్షించనున్నారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రణాళికా దశలో ఉంది, 2024లో దీపావళికి ముందు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.




✓ ద్వారకా నగరం పురాణ కాలంలో ప్రస్తావించబడింది. పురాణాల ప్రకారం, కృష్ణుడు మధురలో తన మామ అయిన కంసుడిని ఓడించి చంపిన తర్వాత ఇక్కడే స్థిరపడ్డాడు. శ్రీకృష్ణుని రాజ్యం యొక్క రాజధానిగా భావించబడే ఈ పురాతన మరియు సంపన్న నగరం, ప్రపంచ నలుమూలల నుండి హిందువులను ఆకర్షిస్తుంది. ఈ పుణ్యక్షేత్రం గుజరాత్ పశ్చిమ తీరంలో, గోమతి నది ఒడ్డున ఉంది. ఈ నగరం గోమతి నది మరియు అరేబియా సముద్రం కలిసే కోట నగరంగా దాదాపు 84 కి.మీ.ల మేర విస్తరించి ఉంది.

## అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించిన మోదీ

✓ డిసెంబర్ 30, 2023న ప్రధాని నరేంద్ర మోదీ రెండు కొత్త అమృత్ భారత్ రైళ్లను ప్రారంభించారు.



✓ మొదటి సర్వీస్: దర్భంగా–ఆనంద్ విహార్ టెర్మినల్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (1,137 కిమీ/21 గంటలు 35 నిమిషాలు).

✓ రెండవ సర్వీస్: మాల్దా టౌన్–బెంగళూరు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (2,247 కిమీ/42 గంటలు 10 నిమిషాలు).

✓ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ అనేది భారతీయ రైల్వేలచే నిర్వహించబడే నూతన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు. ఇవి వందే భారత్ రైళ్లను పోలిఉన్నప్పటికి, ఇవి నాన్-ఏసి స్లీపర్ కమ్ అన్‌రిజర్వ్‌డ్ బోగీలను కలిగి ఉంటాయి. ఈ రైళ్లను 800 కిమీ కంటే ఎక్కువ దూరంలో ఉన్న భారతీయ నగరాలను కలిపే నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులుగా ఉపయోగించేందుకు ప్లాన్ చేస్తున్నారు. వీటిని భారతదేశంలోని అతిపెద్ద లోకోమోటివ్ తయారీ యూనిట్లలో ఒకటైన చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ యందు తయారు చేస్తున్నారు.

### మరో 6 వందేభారత్ రైళ్లు ప్రారంభం

✓ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డిసెంబర్ 30న మరో ఆరు కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించారు. కొత్తగా ప్రారంభించిన వాటిలో శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా–న్యూ ఢిల్లీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, అమృత్‌సర్–ఢిల్లీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, కోయంబత్తూరు–బెంగళూరు కాంట్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, మంగళూరు–మడ్గావ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, జల్నా–ముంబై వందే భారత్ ఎక్స్‌ప్రెస్ మరియు అయోధ్య–ఆనంద్ విహార్ టెర్మినల్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్లు ఉన్నాయి. దీనితో దేశంలో మొత్తం వందే భారత్ రైళ్ల సంఖ్య 41కి చేరుకుంది.

## అయోధ్యలో మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం

✓ నూతనంగా నిర్మించిన అయోధ్య విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డిసెంబర్ 30న ప్రారంభించారు. అయోధ్యలో అపారమైన సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉన్న రామాయణ పురాణ రచయిత మహర్షి వాల్మీకి పేరు మీద ఈ విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం అని పేరు పెట్టారు.



✓ ఈ అత్యాధునిక విమానాశ్రయం మొదటి దశ 1450 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేయబడింది. విమానాశ్రయం టెర్మినల్ భవనం 6500 చదరపు మీటర్ల విస్తీర్ణంతో, ఏటా 10 లక్షల మంది ప్రయాణికులకు సేవలను అందించే సామర్థ్యం కలిగిఉంది. ఈ టెర్మినల్ భవనం ముఖభాగం అయోధ్యలో శ్రీరామ మందిరం యొక్క ఆలయ నిర్మాణాన్ని పోలిఉంది. టెర్మినల్ బిల్డింగ్ లోపలి భాగాలను భగవాన్ శ్రీరాముడి జీవితాన్ని వర్ణించే స్థానిక కళ, పెయింటింగ్‌లు & కుడ్యచిత్రాలతో అలంకరించారు.

- ✓ అయోధ్య విమానాశ్రయం టెర్మినల్ భవనం ఇన్సులేటెడ్ రూఫింగ్ సిస్టమ్, ఎల్ఈడీ లైటింగ్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ఫౌంటైన్‌లతో ల్యాండ్‌స్కేపింగ్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, మురుగునీటి శుద్ధి కర్మాగారం, సోలార్ పవర్ ప్లాంట్ వంటి అత్యాధునిక సదుపాయాలతో రూపొందించబడింది.

### అయోధ్య రైల్వే స్టేషన్ పేరు మార్పు

- ✓ కొత్తగా పునఃనిర్మించిన ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య రైల్వే జంక్షన్ అధికారికంగా అయోధ్య ధామ్ జంక్షన్‌గా పేరు మార్చారు. వచ్చే జనవరిలో ప్రారంభం కానున్న అయోధ్య రామ మందిరంకు వచ్చే భక్తుల సౌలభ్యం కోసం ఈ రైల్వే స్టేషన్ ఆధునీకరించారు.

### నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్ ను ప్రారంభించిన భూపేందర్ యాదవ్

- ✓ కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ దేశవ్యాప్తంగా కలప, వెదురు మరియు ఇతర అటవీ ఉత్పత్తుల సులభతర రవాణా కోసం నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్ (ఎన్‌టిపిఎస్) అనే వన్ నేషన్-వన్ పాస్‌ను ప్రారంభించారు. ఈ చొరవ దేశవ్యాప్తంగా మొక్కల పెంపకందారులకు, రైతులకు ఏకీకృత ఆన్‌లైన్ మోడ్‌ను అందించడం ద్వారా కలప రవాణా అనుమతుల జారీని క్రమబద్ధీకరించడంతోపాటు సంబంధిత వ్యాపారాన్ని సులభతరం చేయడానికి దోహదపడుతుంది.



- ✓ ఎన్‌టిపిఎస్ ప్రవేశపెట్టడానికి ముందు అటవీ ఉత్పత్తుల రవాణా సమయంలో వివిధ రాష్ట్రాల నుండి ప్రత్యేక రవాణా అనుమతులను పొందాల్సి ఉండేది. దీని వలన అటవీ ఉత్పత్తులను రవాణా చేయడంలో అడ్డంకులు ఏర్పడేవి. ప్రతి రాష్ట్రం దాని స్వంత రవాణా నిబంధనలను కలిగి ఉండటం వలన, కలప లేదా అటవీ ఉత్పత్తులను రాష్ట్రాల అంతటా రవాణా చేయడానికి, ప్రతి రాష్ట్రంలో జారీ చేయబడిన ప్రత్యేక రవాణా పాస్‌ను పొందవలసి ఉండేది. ఈ వన్ నేషన్-వన్ పాస్ సదుపాయంతో ఈ ప్రక్రియను సులభతరం కానున్నది.

### కురుక్షేత్రలో అంతర్జాతీయ గీత మహోత్సవం

- ✓ హర్యానాలోని కురుక్షేత్రలో అంతర్జాతీయ గీత మహోత్సని డిసెంబర్ 19 నుండి వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ అంతర్జాతీయ గీత మహోత్సవంను బ్రహ్మ సరోవర్‌లో గీతా ఆరతితో ప్రారంభమైంది. దీనిని ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్, హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మరియు స్వామి జ్ఞానానంద మహారాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం వసుధైవ కుటుంబం: శ్రీమద్ భగవద్గీత మరియు సార్వత్రిక ఐక్యత అనే థీమ్‌తో జరిగింది. ఈ థీమ్ సార్వత్రిక సోదరభావం మరియు శాంతి గీత సందేశాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ కార్యక్రమాన్ని హర్యానా ప్రభుత్వం, కురుక్షేత్ర డెవలప్‌మెంట్ బోర్డ్ సంయుక్తంగా నిర్వహించాయి.

### పార్లమెంట్ శీతాకాల సమావేశాలు 2023

- ✓ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు 2023 డిసెంబర్ 4 నుండి 19 వరకు 18 రోజులలో 14 సమావేశాలు నిర్వహించారు. ఈ 14 సమావేశాల్లో 12 బిల్లులు లోక్ సభలో ప్రవేశపెట్టబడ్డాయి. పాతవి కలుపుకుని మొత్తం 18 బిల్లులను లోక్‌సభ ఆమోదించింది. మరో 3 బిల్లులు లోక్‌సభ ఉపసంహరించుకుంది. అలానే 17 బిల్లులను రాజ్యసభ ఆమోదించింది. ఒక బిల్లును ఉపసంహరించుకుంది. ఈ సెషన్‌లో పార్లమెంటు ఉభయ సభలు మొత్తం 19 బిల్లులకు ఆమోదం తెలిపాయి.




- ✓ లోక్‌సభలో ఉపసంహరించుకున్న బిల్లులు: భారతీయ న్యాయ సంహిత, 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, 2023, రిక్రూట్‌మెంట్ సాక్ష్యా బిల్లు, 2023.
- ✓ రాజ్యసభలోఉపసంహరించుకున్న బిల్లు: టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (సవరణ) బిల్లు, 2008.

### ది ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు 2023

- ✓ ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్ యాక్ట్, 1867ని రద్దు చేస్తూ ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు, 2023 ని లోక్ సభ డిసెంబర్ 21న ఆమోదించింది. ఈ బిల్లును ఇప్పటికే వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభ ఆమోదించింది. ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు, 2023 ఎలాంటి భౌతిక ఇంటర్‌ఫేస్ అవసరం లేకుండా ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా పీరియాడికల్స్ టైటిల్ మరియు రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళంగా మరియు ఏకకాలంలో పూర్తిచేసే అవకాశం కల్పిస్తుంది. ప్రచురణకర్తలు ఇకపై జిల్లా మేజిస్ట్రేట్‌లు లేదా స్థానిక అధికారుల వద్ద డిక్లరేషన్‌ను ఫైల్ చేయాల్సిన అవసరం ఉండదు. పబ్లిషర్లు తమ పీరియాడికల్‌లను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు, దీని వలన అవసరమైన సమయం మరియు శ్రమ గణనీయంగా తగ్గుతుంది.

### టెలి కమ్యూనికేషన్స్ బిల్లు 2023

- ✓ 1885 నాటి ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం, 1933 నాటి వైర్‌లెస్ టెలిగ్రాఫీ చట్టం మరియు 1950 నాటి టెలిగ్రాఫ్ వైర్లు (చట్టవిరుద్ధమైన స్వాధీనం) చట్టం వంటి వివిధ భారతీయ టెలికాం

చట్టాలని సంస్కరించడానికి భారత పార్లమెంటు టెలికమ్యూనికేషన్స్ బిల్లు, 2023ని ఆమోదించింది. ఈ బిల్లు స్పెక్ట్రమ్ కేటాయింపు కోసం నియమాలను రూపొందించడంతో పాటుగా ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్ సేవలకు వాయు తరంగాలను అందించడానికి వేలం రహిత మార్గాన్ని అందిస్తుంది.

- ✓ కొత్త బిల్లు ప్రకారం ఫోన్ నంబర్ స్పూఫింగ్, సిమ్ దుర్వినియోగం వంటి మోసాలకు పాల్పడే వారికీ మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు 50 లక్షల జరిమానా విధిస్తుంది.
- ✓ కొత్త బిల్లు ప్రకారం టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు నూతన సబ్‌స్క్రైబర్‌ల గుర్తింపును ఏదైనా ధృవీకరించదగిన బయోమెట్రిక్ ఆధారిత గుర్తింపు (ఆధార్ కార్డ్‌తో లింక్ చేయబడింది) ద్వారా మాత్రమే ధృవీకరించాలి. ఒక వ్యక్తి తొమ్మిది కంటే ఎక్కువ సిమ్‌లను కలిగి ఉంటే (ఆధార్ కార్డ్‌కు), మొదటి నేరానికి రూ. 50,000 మరియు తదుపరి ప్రతి నేరానికి రెండు లక్షల రూపాయల వరకు జరిమానా విధించబడుతుంది.
- ✓ కొత్త బిల్లు ప్రకారం కేంద్ర ప్రభుత్వం టెలికమ్యూనికేషన్ కంపెనీలకు వేలం ద్వారా మాత్రమే స్పెక్ట్రమ్‌ను కేటాయించాల్సి ఉంటుంది.
- ✓ ట్రాయ్ ఛైర్మన్ నియామకానికి, అభ్యర్థికి కనీసం 30 సంవత్సరాల వృత్తిపరమైన అనుభవం ఉండాలి మరియు సభ్యులుగా పనిచేయడానికి కనీసం 25 సంవత్సరాల వృత్తిపరమైన అనుభవం కలిగి ఉండాలి.

## సౌదీ అరేబియా ప్రభుత్వంతో ఎన్ఎస్‌డిసి అవగాహన ఒప్పందం

- ✓ నైపుణ్యం కలిగిన కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు సౌదీ అరేబియా ప్రభుత్వంతో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఏసీ మెకానిక్స్. కార్పెంటర్లతో సహా సహా నైపుణ్యం కలిగిన కార్మికులు దీని కోసం ఎన్ఎస్‌డిసి వెబ్ పోర్టల్ యందు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ ఒప్పందం నైపుణ్యం కలిగిన కార్మికులకు సురక్షితమైన మరియు గౌరవప్రదమైన పని పరిస్థితులను, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమయ్యే మార్గదర్శకాలు మరియు ప్రమాణాలను ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం చేస్తుంది.

## కృషి ఉడాన్ పథకం 2.0 కింద 58 విమానాశ్రయాలు

- ✓ దేశంలోని 58 విమానాశ్రయాలను కృషి ఉడాన్ పథకం 2.0 పరిధిలో కవర్ చేస్తున్నట్లు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జనరల్ వీకే సింగ్, రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం అందించారు. వీటిలో ఈశాన్య, కొండ ప్రాంతాలు మరియు గిరిజన ప్రాంతాల్లోని 25 విమానాశ్రయాలతో పాటుగా ఇతర ప్రాంతాల్లోని 33 విమానాశ్రయాలు ఉన్నట్లు వెల్లడించారు. కృషి ఉడాన్ స్కీమ్ 2.0, ఈశాన్య రాష్ట్రాలు మరియు గిరిజన ప్రాంతాల నుండి పాడైపోయే ఆహార ఉత్పత్తులను త్వరితగత రవాణా చేయడంపై దృష్టి సారిస్తుంది. కృషి ఉడాన్ పథకం 2021లో ప్రకటించబడింది.

## ఉత్తరాఖండ్ కి చెందిన 18 ఉత్పత్తులకు జిఐ ట్యాగ్

- ✓ ఉత్తరాఖండ్ ఒక్క రోజులో అత్యధిక సంఖ్యలో జియోగ్రాఫికల్ ఇండికేషన్ సర్టిఫికెట్‌లను పొందిన దేశంలోనే తొలి రాష్ట్రంగా అవతరించింది. రాష్ట్రానికి చెందిన 18 స్థానిక ఉత్పత్తులకు ఒకే రోజు జిఐ ట్యాగ్‌ని పొందినట్లు ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ వెల్లడించారు. దీనితో జిఐ ట్యాగ్‌లు పొందిన ఉత్తరాఖండ్ ఉత్పత్తుల సంఖ్య 27కి చేరుకుంది. వన్ డిస్ట్రిక్ట్, టూ ప్రొడక్ట్స్ కార్యక్రమంలో భాగంగా ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఈ ఘనత సాధించింది. రాష్ట్రంలోని మొత్తం 13 జిల్లాల నుండి మొత్తం 27 ఉత్పత్తులు ప్రస్తుతం జిఐ ట్యాగ్ పొంది ఉన్నాయి.



- ✓ తాజాగా జిఐ గుర్తింపు పొందిన ఉత్పత్తుల జాబితాలో ఉత్తరాఖండ్ చౌలై, ఝుంగోరా, మండువ, రెడ్ రైస్, అల్మోరా లఖోరి మిరపకాయ, బెరినాగ్ టీ, బురాన్స్ షర్బత్, రామ్‌నగర్ నైనిటాల్ లిచ్చి, రామ్‌గఢ్ పీచ్, మాల్టా, పహారీ టోర్, గహత్, కాలా భట్, బిచ్చుబూటీ, నైనిటాల్ కొవ్వొత్తి, కుమావోని రంగు పిచ్చోడా, చమోలి రమ్మన్ మాస్క్ మరియు లిఖాయ్ చెక్క చెక్కడం వంటి ఉత్పత్తులు ఉన్నాయి.

## మేఘాలయ లకడోంగ్ పసుపు మరియు ఇతర ఉత్పత్తులకు జిఐ ట్యాగ్

- ✓ మేఘాలయలోని లకడాంగ్ పసుపుకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జిఐ) ట్యాగ్ లభించిందని ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అంపారీన్ లింగ్డోహ్ తెలిపారు. లకడాంగ్ పసుపుతో పాటుగా, ఆ రాష్ట్రానికి చెందిన గారోదక్మండ (సాంప్రదాయ దుస్తులు), లార్నై కుండలు మరియు గారో చుబిట్చీ (మద్యపానం) కూడా జిఐ ట్యాగ్ లభించింది.
- ✓ మేఘాలయలోని జైంతియా కొండల పశ్చిమ పాదాలలో ఉన్న ఒక మాల్ గ్రామంలో లకడాంగ్ పసుపును పండిస్తారు. లకడాంగ్ పసుపు 6.8– 9% కర్కుమిన్ ఇండెక్స్‌తో ప్రపంచంలోనే అత్యుత్తమమైనది. జైంతియా హిల్స్‌లోని ఒక గ్రామం పేరు మీదుగా దీనికి ఆ పేరు పెట్టారు.
- ✓ గారో దక్మండ అనేది మేఘాలయలోని గారో తెగకు చెందిన మహిళలు ధరించే సాంప్రదాయ గారో దుస్తులు.

- లార్నై కుండలు మేఘాలయలోని జైంతియా హిల్స్‌లోని లార్నై గ్రామంలో తయారు చేస్తారు. ఈ నల్ల కుండలు స్థానిక సాంస్కృతిక ప్రాముఖ్యతకు ప్రసిద్ధి చెందాయి.
- చుబిట్సి లేదా చుబోక్ అనేది భారతదేశంలోని మేఘాలయలోని గారో తెగ వారు తయారుచేసే ఒక ప్రసిద్ధ సాంప్రదాయ మద్య పానీయం.

## జమ్మూ కాశ్మీర్ రిజర్వేషన్ సవరణ బిల్లు 2023

- జమ్మూ కాశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు 2023 మరియు జమ్మూ & కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2023 రాజ్యసభలో ఆమోదం పొందాయి. ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారంలో లోక్ సభలో ఈ బిల్లు ఆమోదం పొందిన తర్వాత రాజ్యసభలో ప్రవేశపెట్టబడింది. ఈ బిల్లు జమ్మూ మరియు కాశ్మీర్ రిజర్వేషన్ చట్టం 2004ను సవరించాలని కోరుతోంది. ఈ చట్టం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు ఓబీసీ సభ్యులకు ఉద్యోగాలు మరియు వృత్తిపరమైన సంస్థల్లో ప్రవేశాలను అందిస్తుంది.
- జమ్మూ మరియు కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2023, జమ్మూ మరియు కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019ని సవరించింది. ఈ బిల్లు జమ్మూ మరియు కాశ్మీర్ శాసనసభలోని మొత్తం సీట్ల సంఖ్యను పెంచేందుకు 1950 చట్టంలోని రెండవ షెడ్యూల్‌ను సవరించింది. దీనితో ప్రస్తుతం జమ్మూ మరియు కాశ్మీర్ అసెంబ్లీలో ఉన్న 107 సీట్ల సంఖ్యను 114కి పెంచింది. వీటిలో షెడ్యూల్డ్ కులాలకు ఏడు సీట్లు, షెడ్యూల్డ్ తెగలకు తొమ్మిది స్థానాలను రిజర్వ్ చేసింది.
- అలానే లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా 1989 తర్వాత వచ్చిన కాశ్మీరీ వలస సమూహం నుండి ఇద్దరు సభ్యులను శాసనసభకు నామినేట్ చేసేఅవకాశాన్ని కల్పించింది. ఈ నామినేట్ చేయబడిన సభ్యులలో ఒకరు తప్పనిసరిగా మహిళ అయి ఉండాలని సూచించింది. ఈ సవరణ తర్వాత జమ్మూలో గతంలో 37 సీట్లు ఉండగా ఇప్పుడు కొత్త డీలిమిటేషన్ కమిషన్ తర్వాత 43 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో కశ్మీర్‌లో 46 సీట్లు ఉండగా ఇప్పుడు 47 సీట్లకు చేరుకున్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 24 సీట్లు కూడా రిజర్వ్ చేయబడ్డాయి. దీనితో పాక్ ఆక్రమిత కాశ్మీర్ భారత్ యందు భాగంగా పరిగణించబడింది.
- జమ్మూ మరియు కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019, జమ్మూ & కాశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూ కాశ్మీర్ మరియు లడఖ్ అని పిలువబడే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. ఈ బిల్లును హోం వ్యవహారాల మంత్రి అమిత్ షా 5 ఆగస్టు 2019 న రాజ్యసభలో ప్రవేశపెట్టారు, అదే రోజు ఆమోదించారు. 9 ఆగస్టు 2019న రాష్ట్రపతి ఆమోదం పొందింది. ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి ముందు రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని పరోక్షంగా సవరించింది. దీని ద్వారా జమ్మూ మరియు కాశ్మీర్ యొక్క ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసింది.

## మేరా గావ్, మేరీ ధరోహర్ ప్రాజెక్టు ప్రారంభం

- కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, దేశ వ్యాప్తంగా గ్రామాల సాంస్కృతిక మ్యాపింగ్ మరియు డాక్యుమెంటేషన్ చేయడం కోసం మేరా గావ్ మేరీ ధరోహర్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా భారతదేశంలోని విభిన్న కమ్యూనిటీల సాంస్కృతిక వారసత్వ గుర్తింపును, ప్రత్యేకతను మ్యాపింగ్ చేయనుంది. భారతీయ గ్రామీణ జీవితం, చరిత్ర మరియు నైతికతలతో కూడిన సమగ్ర సమాచారాన్ని డిజిటిలైజ్ చేస్తూ వర్చువల్ మరియు నిజ-సమయ సందర్శకులకు అందుబాటులో ఉంచుతుంది.
- ఈ ప్రాజెక్ట్ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మరియు ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ భాగస్వామ్యంతో అమలు చేయబడుతోంది. ఇందులో భాగంగా గ్రామీణ చరిత్ర, సంప్రదాయాలు, ఆచారాలు, పండుగలు, కళ మరియు సంస్కృతితో సహా వారి సాంస్కృతిక వారసత్వ సమాచారాన్ని సేకరించడానికి గ్రామాల స్థాయిలో సర్వేలను నిర్వహిస్తోంది. సేకరించిన సమాచారాన్ని టెక్స్ట్, ఇమేజ్‌లు మరియు వీడియోలతో సహా వివిధ ఫార్మాట్‌లలో డాక్యుమెంట్ చేస్తోంది.
- ఈ ప్రాజెక్ట్ దశలవారీగా అమలు చేయబడుతోంది, మొదటి దశ భారతదేశంలోని 28 రాష్ట్రాలు మరియు ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలలో 100 గ్రామాలను కవర్ చేస్తుంది. రెండవ దశ ప్రతి రాష్ట్రం మరియు కేంద్రపాలిత ప్రాంతంలో అదనంగా 100 గ్రామాలను కవర్ చేస్తుంది మరియు మూడవ దశ దేశంలోని మిగిలిన అన్ని గ్రామాలను కవర్ చేస్తుంది. ఈ సమాచారాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి డిసెంబర్ 7న రాజ్యసభలో తెలిపారు. దీని కోసం మేరా గావ్, మేరీ ధరోహర్ (MGMD) వెబ్ పోర్టల్ కూడా ఈ ఏడాది జూలై 27న ప్రారంభించబడింది.

## 561 కోట్లతో చెన్నై ఫ్లడ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్

- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డిసెంబర్ 7, 2023న, పట్టణ ప్రాంతాల్లో వరదల నివారణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన భారతదేశంలో మొట్టమొదటి అర్బన్ ఫ్లడ్ మిటిగేషన్ ప్రాజెక్ట్‌ను (చెన్నై బేసిన్ ప్రాజెక్ట్) ఆమోదించారు. మైచాంగ్ తుపాను కారణంగా ప్రభావితమైన చెన్నై నగరాన్ని వరదల ముప్పు నుంచి కాపాడే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో రూ. 561.29 కోట్లు కేటాయించారు. ఈ నిధులను నేషనల్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ నుండి విడుదల చేశారు.




## ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచిత ట్యాబ్స్ పంపిణీ

- ✓ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బైజూస్ ప్రీలోడెడ్ కంటెంట్ గల 4,34,185 ట్యాబ్స్‌ను 9,424 పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ డిసెంబర్ 21న ఈ పంపిణీని ప్రారంభించారు. వీటిల్లో ఎనిమిదో తరగతితో పాటు, 9, 10 తరగతుల బైజూస్ కంటెంట్‌ను కూడా లోడ్ చేయడంతో పాటు ఇంటర్మీడియట్ కంటెంట్ కూడా అప్‌లోడ్ చేసేందుకు వీలుగా ట్యాబ్ సామర్థ్యాన్ని 256 జీబీకి పెంచి అందిస్తున్నారు. గత ఏడాది విద్యార్థులు, ఉపాధ్యాయులకు 5,18,740 ట్యాబ్స్‌ను పంపిణీ చేశారు.




## ఏపీఎస్ఎస్డీసీ ద్వారా 1.35 లక్షల మంది యువతకు సాధికారిత

- ✓ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గత నాలుగేళ్లలో 12.5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చినట్లు నివేదించింది. దీని ఫలితంగా ఇప్పటివరకు 1.35 లక్షల మందికి ఉపాధి కల్పించామని తెలిపింది. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా 26 స్కిల్ కాలేజీలు, 192 స్కిల్ హబ్‌ల ఏర్పాటు చేసినట్లు తెలిపింది.
- ✓ ఇవి నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించడం లేదా స్వయం ఉపాధి అందించడం ద్వారా వారి జీవితాలను మార్చేందుకు సహాయం చేసినట్లు పేర్కొంది. అకడమిక్ డిపార్ట్‌మెంట్ పరిధిలో 2,40,979 శిక్షణా సమావేశాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. దీని ద్వారా 1,35,184 మంది వ్యక్తులు ప్రయోజనం పొందారని, అదనంగా, 10,81,927 మంది విద్యార్థులు అకడమిక్స్ కోసం నమోదు చేసుకున్నట్లు వెల్లడించింది.
- ✓ ఇటీవలే విడుదల అయిన ఇండియా స్కిల్స్ రిపోర్ట్ కూడా అత్యధిక ఉపాధి యోగ్యమైన వనరుల సేకరణలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉన్నట్లు పేర్కొంది. ఐటి, ఫైనాన్స్, హెల్త్‌కేర్, ఆటోమోటివ్ మరియు తయారీ రంగాల్లో విజృంభిస్తున్న డిమాండ్‌ను తక్షణమే తీర్చగల అద్భుతమైన టాలెంట్ పూల్ ఆంధ్రప్రదేశ్‌లో ఉందని నివేదిక పేర్కొంది.

## వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పరిమితిని 25 లక్షలకు పెంపు

- ✓ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య చికిత్స పరిమితిని ₹25 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. డిసెంబర్ 18న దీనికి సంబంధించి అధికారిక ప్రకటనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విడుదల చేశారు. ఈ పునరుద్ధరించిన పథకం ఇప్పుడు రాష్ట్రంలోని సుమారు 4.25 కోట్ల మందికి కవరేజీని విస్తరింపజేస్తుండగా, ₹25 లక్షల వరకు ఉచిత చికిత్సను అందజేస్తుంది.
- ✓ ఈ పథకం కింద ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 2,513 ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీనితో పాటుగా లబ్దిదారులకు ఈ కొత్త ఫీచర్లతో కూడిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేసేందుకు సిద్ధమవుతుంది. అలానే చికిత్స అనంతరం నెలకు 5,000 సహాయం అందించే అనుబంధ పథకం, ఆరోగ్య ఆసరా కూడా దీనితో పాటుగా అమలు చేయబడుతోంది. ఈ పథకం కింద కూడా 25 నుండి 27 లక్షలకు కవర్ చేయబడుతుంది. ఇప్పటివరకు ఈ పథకం కోసం 1,300 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.
- ✓ గుండె మార్పిడి, క్యాన్సర్ మరియు స్టెమ్ సెల్ థెరపీతో సహా మరెన్నో పెద్ద వ్యాధులనుఆరోగ్యశ్రీ కిందకు తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని గ్రామ ఆరోగ్య క్లినిక్‌ల నుంచి 105 రకాల మందులు పంపిణీ చేయడంతో పాటుగా, 14 రకాల రోగనిర్ధారణ పరీక్షలను కూడా అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈ కొత్త ఫీచర్లు డిసెంబర్ 19 నుండి, అప్‌గ్రేడ్ చేసిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అమలు చేయనున్నారు.

IACE

- జనవరి 1, 2024 నుండి, అర్హులైన వ్యక్తులకు ఉచిత మందులు కూడా నేరుగా సరఫరా చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీని కోసం ప్రభుత్వం తపాలా శాఖతో కలిసి పని చేసేందుకు సిద్ధమవుతుంది. ఆరోగ్య పథకం సురక్ష 2వ దశ కూడా జనవరి 1 నుండి ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రతి మండలంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు, ఇది ప్రతి ఆరు నెలలకు ఒకసారి పునరావృతమవుతుంది.

## వ్యవసాయ మార్కెటింగ్ సంస్కరణల్లో ఆంధ్ర ప్రదేశ్ అగ్రస్థానం

- నీతి ఆయోగ్ వ్యవసాయ మార్కెటింగ్ మరియు రైతు స్నేహపూర్వక సంస్కరణల సూచిక (ఏఎంఎఫ్ఎఫ్ఐ) లో 94 స్కోరుతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం దక్కించుకుంది. ఆ తర్వాత స్థానాలలో ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ మరియు అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. ఈ ర్యాంకింగ్ అగ్రి-మార్కెటింగ్, ఇ-ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్, సింగిల్ యూనిఫైడ్ లైసెన్స్, మార్కెట్ ఫీజుల హేతుబద్ధీకరణ, వ్యవసాయ రాతీయలు, ఇ-నామ్ మాడ్యూల్స్ వంటి కీలక అంశాల ఆధారంగా నిర్ణయిస్తుంది.
- వ్యవసాయ మార్కెటింగ్ మరియు రైతు స్నేహపూర్వక సంస్కరణల సూచిక అనేది వ్యవసాయ రంగంలో మార్కెట్ ఆధారిత సంస్కరణల అమలుపై భారతీయ రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలను అంచనా వేయడానికి 2016లో నీతి ఆయోగ్ ప్రారంభించింది. భారతదేశంలోని వ్యవసాయ రంగాన్ని అతలాకుతలం చేస్తున్న ఉత్పాదకత, వృద్ధి మరియు తక్కువ వ్యవసాయ రాబడి వంటి సంక్షోభాలను నివారించేందుకు సమూల సంస్కరణలు చేపట్టే దిశగా దీనిని ప్రారంభించింది.
- వ్యవసాయాన్ని మార్చడం మరియు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం అసాధ్యం. అయినప్పటికీ, వ్యవసాయాన్ని ఆధునీకరించడానికి మరియు రైతులకు అనుకూలమైన విధానాన్ని మరియు మార్కెట్ వాతావరణాన్ని సృష్టించడానికి అవసరమైన సంస్కరణలను అమలు చేయడంలో ప్రోత్సహాయించే దిశగా దీనిని ప్రారంభించింది.

## జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల

- జగనన్న విద్యాదీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో భాగంగా 2023–24 విద్యా సంవత్సరంలో జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి అర్హులైన 8,09,039 మంది విద్యార్థులకు రూ.584 కోట్లు జమ చేశారు. ఈ మొత్తంతో కలిపి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.18,576 కోట్లు ఖర్చు చేసింది.

## 8వ విడత జగనన్న తోడు పథకం నిధులు విడుదల

- పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ 3,95,000 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చెప్పున్న 8వ విడత జగనన్న తోడు పథకం కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేశారు.



- నిరుపేదలైన చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారు వారి కాళ్ల మీద వారు నిలదొక్కు-కొనేలా జగనన్న తోడు పథకం కింద ఆర్థిక చేయూతనిస్తున్నారు. ఒక్కొక్కరికి ఏటా రూ.10 వేల రుణం సున్నా వడ్డీకే అందిస్తున్నారు. రుణాలను సకాలంలో చెల్లించినవారికి ఏడాదికి మరో రూ.1,000 చొప్పున జోడిస్తూ రూ.13,000 వరకు వడ్డీలేని రుణం అందిస్తున్నారు.

## ఏపీకి మూడు ఎనర్టియా పురస్కారాలు

- పునరుత్పాదక విద్యుత్తు, ఇంధన రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రోత్సహించేలా ఫాల్కన్ మీడియా, ఎనర్టియా ఫౌండేషన్ అందించే '16వ ఎనర్టియా అవార్డుల్లో' ఏపీ రాష్ట్ర విద్యుత్తు సంస్థలు మూడు పురస్కారాలు దక్కించుకున్నాయి. హరిత ఇంధనం, పునరుత్పాదక రంగాల్లో 'రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ' (నెడ్‌క్యాప్), మౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో ఏపీ ట్రాన్స్‌కో పురస్కారాలు సాధించాయి.



## 'ఆడుదాం ఆంధ్రా'క్రీడా పోటీలు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు' డిసెంబర్ 26న గుంటూరు జిల్లాలోని నల్లపాడు వద్ద ఉన్న లయోలా పబ్లిక్ స్కూల్ లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.




- క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో నిర్వహించే ఈ పోటీలను డిసెంబర్ 26 నుంచి ఫిబ్రవరి 10 వరకు 47 రోజులపాటు గ్రామ, వార్డు సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పోటీపడేలా తీర్చిదిద్దడం వీటి ప్రధాన లక్ష్యం.




## తెలంగాణ అడ్వొకేట్ జనరల్‌గా ఎ.సుదర్శన్‌రెడ్డి

✓ తెలంగాణ రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌గా సీనియర్ న్యాయవాది ఎ.సుదర్శన్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి ఆర్ .తిరుపతి జీవో 636 జారీ చేశారు.



సుదర్శన్‌రెడ్డి 1985లో బార్ కౌన్సిల్‌లో నమోదయి న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించారు. రాజ్యాంగ నిపుణుడిగా, సివిల్, క్రిమినల్ కేసుల్లో వాదనలు వినిపించారు. 2011 – 2014 మధ్య కాలంలో ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు చివరి అడ్వొకేట్ జనరల్‌గా సేవలందించారు. 2009 – 2010 మధ్య ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగానూ పనిచేశారు.

✓ జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి సుదర్శన్‌రెడ్డి స్వగ్రామం. వ్యవసాయ కుటుంబంలో జగపతిరెడ్డి, బుచ్చమ్మ దంపతులకు 1959 జులై 25న జన్మించారు. పాఠశాల విద్య హైదరాబాద్ సెయింట్ పాల్స్ స్కూలులో పూర్తిచేశారు. నిజాం కాలేజీలో డిగ్రీ చదివారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1984 – 85 మధ్య యూనివర్సిటీలో స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడిగా కొనసాగారు.

## తెలంగాణలో తొలిసారి క్యూఆర్ మినీ ఏటీఎం

✓ డిజిటల్ మనీ ట్రాన్సాక్షన్‌లో భాగంగా ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్ తో క్షణాల్లో డబ్బులు విత్ డ్రా చేసుకునే సౌకర్యాన్ని దేశంలోనే తొలిసారి సిద్దిపేటలో అందుబాటులోకి తెచ్చారు. క్యూటీఎం



ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట మాడల్ బస్టాండ్ లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌తో డబ్బులు విత్ డ్రా చేసుకునే ATM మిషన్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ మినీ ఏటీఎం మాదిరిగానే క్యూఆర్ మినీ ఏటీఎం పనిచేస్తుందని తెలిపారు. ఆధార్ కార్డు, వేలిముద్ర, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, క్యూఆర్ కోడ్ స్కానింగ్, యూపీఐ సర్వీసెస్ ద్వారా నగదు విత్ డ్రా చేసుకునే సౌకర్యం ఉంటుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో టీహబ్ ద్వారా రూపొందించిన ఈ టెక్నాలజీని సిద్దిపేటలో తొలిసారి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. క్యూటీఎం ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తుందని హరీశ్‌రావు తెలిపారు.

## సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయం బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం

✓ తెలంగాణలోని ములుగులో ఏర్పాటు చేస్తున్న సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయం బిల్లుకు చట్టబద్ధత లభించింది. కేంద్ర విశ్వవిద్యాలయాల చట్టం–2009లో తెలంగాణలోని ములుగు జిల్లాలో ఏర్పాట చేస్తున్న సమక్క సారక్క కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం పేరును చేరుస్తూ విద్యాశాఖ ప్రవేశపెట్టింది. ఇప్పటివరకు ఉన్న కేంద్ర విశ్వవిద్యాలయాల జాబితాలో సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయం పేరును చేరుస్తూ ప్రవేశపెట్టిన సెంట్రల్ యూనివర్సిటీస్ (అమెండ్మెంట్) బిల్లు 2023 లోక్‌సభలో ఈనెల 7న, 13న రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదముద్ర వేసింది. ఆ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో అది చట్టరూపం దాల్చింది. ఈ మేరకు న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

✓ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీని నిర్మాణం కోసం ఏడేళ్లలో రెండు దశల్లో రూ.889.07 కోట్లు ఖర్చు చేస్తారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం–2014లో హామీ ఇచ్చిన ప్రకారం ఈ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ప్రాంతీయ ఆకాంక్షలను ఈ వర్సిటీ నెరవేర్చనుంది. ఈ యూనివర్సిటీ ఉన్నత విద్య అందుబాటును, నాణ్యతను, తెలంగాణ ప్రజల పరిశోధనా సౌకర్యాలను పెంపొందిస్తుందని బిల్లులో పేర్కొన్నారు. భారతదేశ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలపై ఈ యూనివర్సిటీలో పరిశోధనలు చేసే అవకాశం లభించనుంది.

## నీతి ఆయోగ్ డెల్టా ర్యాంకింగ్‌లో తిర్యాణి బ్లాక్‌కి తొలి స్థానం

✓ నీతి ఆయోగ్ ప్రకటించిన యాస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం డెల్టా ర్యాంకుల్లో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి బ్లాక్ తొలి స్థానాన్ని కైవసం చేసుకొంది. ఉత్తర్ ప్రదేశ్‌లోని కౌసాంబి జిల్లాలోని కౌసాంబి బ్లాక్ రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన కార్యక్రమంలో నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు సుమన్‌బేరి ఈ ర్యాంకులను విడుదల చేశారు. నీతి ఆయోగ్ నిర్దేశించిన మేరకు దేశంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో విద్య, వైద్యం, వ్యవసాయం, నీటి వసతి, చిన్నపిల్లలకు పోషకాహారం పంపిణీ తదితరాల్లో సాధించిన పురోగతి ఆధారంగా ఈ ర్యాంకులు ప్రకటించారు.




## ఇంధన పొదుపులో తెలంగాణకు జాతీయ అవార్డు

✓ ఇంధన పొదుపులో తెలంగాణకు 2023 ఏడాదికి ద్వితీయ అవార్డు లభించింది. జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. – జాతీయ ఇంధన పొదుపు అవార్డుల ప్రదాన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర పునరుత్పాద ఇంధన అభివృద్ధి సంస్థ (టీఎస్‌రెడ్కో) ఎండీ నీలంజానయ్య, డీజీఎం టి.శ్రీనివాసులు అవార్డు అందుకున్నారు. ఇంధన పొదుపు సూచీలో రాష్ట్రం 78 పాయింట్లు సాధించిందని, 2022 తో పోలిస్తే 15.4 శాతం అదనపు అభివృద్ధి నమోదు చేసిందని వివరించారు.

## తెలంగాణలో గంజాయి వ్యసనపరులు 2 లక్షల మంది!

✓ తెలంగాణలో గంజాయి వ్యసనపరులు 2 లక్షల మంది ఉన్నారని కేంద్ర నివేదిక వెల్లడించింది. నల్లమందుకు బానిసలుగా మారిన వారు దాదాపు 6.5 లక్షలు, మత్తుమందుల్ని పీల్చేవారు సుమారు 2.3 లక్షల మంది ఉన్నారని సామాజిక న్యాయం – సాధికారత మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక తెలిపింది. నివేదికలోని వివరాల మేరకు.. దేశవ్యాప్తంగా 18–75 ఏళ్లలోపు వారిలో 15.01 కోట్ల మంది మద్యం సేవిస్తున్నారు. గంజాయి వ్యసనపరులు 2.9 కోట్లు. నల్లమందు తీసుకునేవారు 1.86 కోట్లు. మత్తుమందుల్ని పీల్చేవారు (ఇన్‌హెలంట్స్) 51.25 లక్షలు. కొకైన్ బాధితులు 9.4 లక్షలు. అంపెటమైన్ తరహా స్టిమ్యులెంట్లు తీసుకునేవారు 15.47 లక్షలు ఉన్నారు. మాదకద్రవ్యాల బారిన పడినవారిలో అత్యధికులు ఉత్తర్ ప్రదేశ్‌లో ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తర్వాతి స్థానాల్లో పంజాబ్, మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాలున్నాయి. గంజాయి వ్యసనపరులు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఏకంగా 1.2 కోట్ల మంది ఉండటం గమనార్హం.




## తెలంగాణ గిగ్ వర్కర్లకు 5 లక్షల ప్రమాద బీమా

✓ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహార పంపిణీ, క్యాబ్‌లు మరియు ఆటోరిక్షాలు నడిపే గిగ్ కార్మికులకు 5 లక్షల ప్రమాద బీమా మరియు 10 లక్షల ఆరోగ్య రక్షణ హామీని ప్రకటించారు. ఇటీవలే క్యాబ్, ఆటోరిక్షా డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ ఎగ్జిక్యూటివ్‌ల సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి, అసంఘటిత రంగాల్లోని కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత కల్పిస్తుందని ప్రకటించారు.

✓ రాజస్థాన్‌లో గిగ్ వర్కర్ల కోసం ప్రస్తుతం ఉన్న విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తుందని, తదుపరి రాష్ట్ర బడ్జెట్ సెషన్‌లో సమర్థవంతమైన చట్టాన్ని ప్రవేశపెడుతుందని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించే గ్రామసభల్లో క్యాబ్, ఆటోరిక్షా డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ అధికారులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో లేదా ఫిజికల్‌గా సమర్పించాలని ముఖ్యమంత్రి సూచించారు.

## తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం

✓ తెలంగాణ ప్రభుత్వం మహిళలు, బాలికలు మరియు ట్రాన్స్‌జెండర్ల కోసం టిఎస్ఆర్‌టిసిలో ఉచిత బస్సు ప్రయాణ సేవను డిసెంబర్ 9న ప్రారంభించింది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇటీవలే తెలంగాణాలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ, తమ ఎన్నికల హామీలో భాగంగా దీనిని అందుబాటులోకి తెచ్చింది.



✓ మహాలక్ష్మి జీరో–టికెట్ పేరుతో అమలు చేస్తున్న ఈ పథకం కింద తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహించే నాన్–లగ్జరీ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. దీని కోసం మహిళలు కేవలం ఆధార్ కార్డు చూపిస్తే సరిపోతుంది. వారికి సంబంధిత జీరో–టికెట్ జారీ చేయబడుతుంది.

✓ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో మహాలక్ష్మి పథకం ప్రధానమైనది. ఇది మహిళా

సాధికారిత లక్ష్యంతో రూపొందించబడింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని కుటుంబ పెద్దలైన మహిళలకు నెలకు 2500 రూపాయల ఆర్థిక సహాయం అందించడంతో పాటుగా 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ మరియు తెలంగాణ అంతటా ఉచిత టిఎస్ఆర్టిసి బస్సు ప్రయాణం కల్పించేందుకు ఇది హామీ ఇచ్చింది.

## తెలంగాణాలో చేయూత పథకం ప్రారంభం

- ✓ తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేందుకు చేయూత పథకాన్నిఅందుబాటులోకి తెచ్చింది. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 9న దీనిని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అన్ని ఎంపానెల్డ్ ఆసుపత్రుల్లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించబడుతుంది.
- ✓ ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి వైద్య చికిత్స కోసం 10 లక్షల ఆర్థిక కవరేజీ కల్పించబడుతుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 90.10 లక్షల కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతాయని అంచనా. శారీరక రుగ్మతలతో బాధపడుతున్న రోగులకు 21 ప్రత్యేక సేవలతో పాటుగా 1,672 విభిన్న వైద్య ప్యాకేజీలు కూడా ఈ పథకం కింద అందుబాటులో ఉన్నాయి.

## ఆహార కల్తీ కేసుల్లో హైదరాబాద్ అగ్రస్థానం

- ✓ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సిఆర్బి) విడుదల చేసిన తాజా డేటా ప్రకారం, ఆహార కల్తీ కేసులలో హైదరాబాద్ (తెలంగాణ) దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. అలానే మరో తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఈ జాబితాలో రెండవ స్థానంలో ఉంది. 2022 ఏడాదికి సంబంధించి భారతదేశంలోని 19 ప్రధాన నగరాల్లో ఆహార కల్తీకి సంబంధించి మొత్తం 291 కేసులు నమోదు అవ్వగా, ఆశ్చర్యకరంగా, హైదరాబాద్‌లోనే 246 కేసులు నమోదయ్యాయి. ఇది ఈ నగరంలో ఆహార భద్రతలో ఆందోళనకరమైన ధోరణిని హైలైట్ చేస్తుంది.



- ✓ ఆహార కల్తీ అనేది సాధారణ ప్రజలకు గణనీయమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగించే తీవ్రమైన సమస్య. కలుషితమైన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఆహారం ద్వారా వచ్చే అంటువ్యాధులు, అలెర్జీలు మరియు మరణం కూడా సంభవించవచ్చు.

## భారతదేశ అత్యుత్తమ నగరాల జాబితాలో హైదరాబాద్

- ✓ గ్లోబల్ కన్సల్టెంట్ అయిన మెర్సర్ విడుదల చేసిన 2023 జీవన నాణ్యత (క్వాలిటీ ఆఫ్ లివింగ్ సిటీ) ర్యాంకింగ్‌లో భారతదేశం నుండి హైదరాబాదు అగ్రస్థానంలో నిలిచింది. ఈ జాబితాలో ఉన్న భారతీయ నగరాల జాబితాలో హైదరాబాద్ 153వ స్థానంలో నిలవగా, పూణె (154), బెంగళూరు (156), చెన్నై (161), ముంబై (164), కోల్‌కతా (170), మరియు న్యూఢిల్లీ (172) ఉన్నాయి.




- ✓ ఈ సంవత్సరం అత్యంత నాణ్యమైన జీవనాన్ని అందించే టాప్ 10 నగరాలలో పశ్చిమ ఐరోపా నుండి 7 నగరాలు, పసిఫిక్ నుండి 2 మరియు ఉత్తర అమెరికా నుండి ఒక నగరం ఉన్నాయి. ఈ జాబితాలో వియన్నా (ఆస్ట్రియా) ర్యాంకింగ్‌లో అగ్రస్థానం దక్కించుకోగా, ఆ తర్వాత జ్యూరిచ్ (స్విట్జర్లాండ్) మరియు న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ వరుసగా రెండు మరియు మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ జాబితాలో జీవన నాణ్యత తక్కువగా ఉన్న ప్రదేశాలలో అత్యధికం ఆఫ్రికన్ నగరాలు ఉన్నాయి. పోర్ట్ లూయిస్ (మారిషస్) ఆఫ్రికా నుండి అత్యంత సురక్షితమైన నగరంగా ప్రపంచవ్యాప్తంగా 88వ స్థానంలో నిలిచింది.
- ✓ మెర్సర్స్ క్వాలిటీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్ అనేది ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా నగరాల్లోని జీవన పరిస్థితులను అంచనా వేసే వార్షిక నివేదిక. ఈ ర్యాంకింగ్ 10 వర్గాలుగా వారీగా దాదాపు 39 అంశాల యొక్క వివరణాత్మక అంచనాపై ర్యాంకింగ్ అందిస్తుంది. వీటిలో ఆయా నగరాల రాజకీయ స్థిరత్వం, సామాజిక స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, జాబ్ మార్కెట్, మరియు జీవన వ్యయాలు వంటి అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటుంది.

## కొత్తగా 27 వాయు నాణ్యత నమోదు స్టేషన్లు

- ✓ వాయు కాలుష్యం సమస్య రాజధాని హైదరాబాద్ నగరంలో తీవ్రంగా ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 27 వాయు నాణ్యత నమోదు కేంద్రాలు (ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్లు) ఏర్పాటు చేయాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిర్ణయించింది. లక్ష జనాభా పైబడిన జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో ఈ కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పీసీబీ వర్గాలు తెలియజేశాయి. జాతీయ పథకం కింద ఏర్పాటు చేయనున్న ఈ స్టేషన్లకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నుంచి నిధులు రానున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 22 వాయు నాణ్యత నమోదు కేంద్రాలు ఉన్నాయి.




## కెన్యాకు రూ.2,084 కోట్ల రుణం

✓ వ్యవసాయరంగ ఆధునికీకరణకుగాను కెన్యాకు రూ.2,084కోట్లు (250 మిలియన్ డాలర్లు) సమకూర్చాలని భారత్ నిర్ణయం తీసుకొన్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ముందుగా నిర్ణయించిన రుణ పరిమితి (లైన్ ఆఫ్ క్రెడిట్) కింద ఈ మొత్తాన్ని ఇస్తున్నట్లు వివరించారు. భారత పర్యటనలో ఉన్న కెన్యా అధ్యక్షుడు విలియం సమోయి రూటోతో జరిపిన విస్తృత చర్చల అనంతరం ప్రధాని ఈ ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాల విస్తరణ లక్ష్యంతో మూడు రోజుల పర్యటన నిమిత్తం రూటో భారత్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇరుపక్షాలు అయిదు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. క్రీడలు, విద్య, డిజిటల్ పరిష్కారం తదితర రంగాల్లో సహకారంతో పాటు హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్రయాన ఒడంబడికపై సంయుక్త దార్శనిక పత్రాన్ని ఆవిష్కరించారు.

## రూ.58 వేల కోట్ల అదనపు వ్యయానికి పార్లమెంటు ఆమోదం

✓ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.58,378 కోట్ల అదనపు వ్యయానికి పార్లమెంటు ఆమోదం తెలిపింది. స్థూల అదనపు వ్యయం రూ.1.29 లక్షల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఇందులో రూ.70,968 కోట్లను కేంద్ర ప్రభుత్వం సేవింగ్స్, రిసీప్ట్స్ ద్వారా సమకూర్చుకోనుంది. మిగిలిన మొత్తానికి పార్లమెంటు అనుమతి తీసుకుంది.

## యూనికార్న్ సంస్థగా ఇన్‌క్రెడ్

✓ కొత్త, ప్రస్తుత మదుపర్ల నుంచి 6 కోట్ల డాలర్ల (సుమారు రూ.500 కోట్ల) సమీకరణ ద్వారా యూనికార్న్ సంస్థగా ఇన్‌క్రెడ్ అవతరించింది. 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8300 కోట్ల) విలువున్న సంస్థను యూనికార్న్‌గా వ్యవహరిస్తారు. తాజా నిధుల సమీకరణ కోసం ఇన్‌క్రెడ్ విలువను 1.04 బిలియన్ డాలర్లుగా పరిగణించారు. తద్వారా ఈ ఏడాది యూనికార్న్ జాబితాలోకి చేరిన రెండో సంస్థగా ఈ ఫిన్‌టెక్ కంపెనీ నిలిచింది.

## ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా 16% పైగానే: ఐఎంఎఫ్

✓ డిజిటలీకరణ, మౌలిక వసతుల లాంటి ప్రధాన రంగాల్లో ఆర్థిక సంస్కరణల అండతో ఆకర్షణీయ వృద్ధి రేటును నమోదు చేస్తూ, అద్భుత పనితీరు కనబర్చిన దేశంగా భారత్ నిలిచిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తెలిపింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో భారత్ వాటా 16 శాతానికి మించి ఉండే అవకాశం ఉందని ఐఎంఎఫ్‌కు చెందిన నాడా చౌహరి తెలిపారు. ఈ ఏడాది ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన దేశాల్లో ఒకటిగా భారత్ నిలవనుందని ఐఎంఎఫ్ తెలిపింది. యువ జనాభా ఎక్కువ సంఖ్యలో ఉండటమూ భారత్‌కు మరో సానుకూలాంశమని పేర్కొన్నారు. పెట్టుబడులు, వృద్ధికి రాజకీయ స్థిరత్వం అత్యంత ముఖ్యమని చౌహరి తెలిపారు. కార్మిక సంస్కరణలు కూడా చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## భారత వృద్ధి రేటు 6.7%: ఏడీబీ అంచనా

✓ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023 – 24) భారత ఆర్థిక వ్యవస్థ 6.7% వృద్ధి రేటును నమోదు చేసే అవకాశం ఉందని ఏషియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) అంచనా వేసింది. సెప్టెంబరులో అంచనా వేసిన 6.3 శాతంతో పోలిస్తే ఇది ఎక్కువ కావడం గమనార్హం. రెండో త్రైమాసికంలో (జులై – సెప్టెంబరు) భారత వృద్ధి రేటు అంచనాలకు మించి 7.6 శాతంగా నమోదుకావడం వల్లే, పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు అంచనాలను పెంచినట్లు ఏడీబీ తెలిపింది. తయారీ, గనులు, నిర్మాణం, యుటిలిటీస్ రంగాలు రెండంకెల వృద్ధిని నమోదు చేయడాన్నీ పరిగణనలోకి తీసుకున్నట్లు పేర్కొంది. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి రేటు అంచనాలను ఏడీబీ యథాతథంగా 6.7 శాతంగానే కొనసాగించింది.

## 2024 - 25లో 8% వృద్ధి: ఫిక్కీ అంచనా

✓ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023 – 24)లో దేశ వృద్ధి రేటు 7.5–8 శాతంగా నమోదు కావొచ్చని ఫిక్కీ (ఫెడరేషన్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2024 – 25)లో ఇది 8 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. గత రెండు త్రైమాసికాల్లో 7.8 శాతం, 7.6 శాతం చొప్పున వృద్ధిని చూశాం. బలమైన వృద్ధి కొనసాగుతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 7.5–8 శాతం, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 8 శాతం లేదా అంతకంటే ఎక్కువ వృద్ధి రేటును అంచనా వేస్తున్నామని అనీశ్ షా పేర్కొన్నారు. ఈయన మహీంద్రా అండ్ మహీంద్రా ఎండీ, గ్రూప్ సీఈఓగా ఉన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ 2023 – 24 తొలి అర్ధ భాగం (ఏప్రిల్ – సెప్టెంబరు)లో 7.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది.

## ప్రవాసుల నిధుల ప్రవాహంలో భారత్‌దే అగ్రస్థానం

✓ ప్రవాసులు తమ స్వదేశానికి అత్యధికంగా నిధులు పంపిన దేశాల్లో భారత్ అగ్రస్థానంలో ఉందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది. 2023లో భారతదేశానికి 125 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10.37 లక్షల కోట్ల)ను ప్రవాసులు పంపించారని పేర్కొంది. ద్వైపాక్షిక వాణిజ్యం కోసం రూపాయి, దిర్హామ్‌ను ఉపయోగించడాన్ని ప్రోత్సహించేందుకు యూఏఈతో భారత్ కుదుర్చుకున్న ఒప్పందం లాంటి పలు అంశాలు ఇందుకు దోహదం చేశాయని నివేదిక తెలిపింది. అయితే భారత్‌కు ప్రవాసులు పంపించిన నిధులు పెరగడం మాత్రం 2022తో పోలిస్తే సగానికి తగ్గిందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది. 2021తో పోలిస్తే, 2022లో రికార్డు స్థాయిలో 24.4 శాతం వృద్ధి ఉండగా 2022తో పోలిస్తే 2023లో వృద్ధి 12.4 శాతానికి పరిమితం కావొచ్చని పేర్కొంది. భారత్ తర్వాత ప్రవాసులు తమ స్వదేశానికి అత్యధికంగా నిధులు పంపిన దేశాల్లో మెక్సికో రెండో స్థానంలో (67 బిలియన్ డాలర్లు) ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో చైనా (50 బిలియన్ డాలర్లు), ఫిలిప్పీన్స్ (40 బిలియన్ డాలర్లు), ఈజిప్ట్ (24 బిలియన్ డాలర్లు) ఉన్నాయి. భారత్‌కు అత్యధికంగా యూఏఈ నుంచి ప్రవాసులు నిధులు పంపిస్తున్నారు. ప్రవాసులు పంపిస్తున్న మొత్తం నిధుల్లో ఈ దేశం వాటా 18 శాతం. ఆ తర్వాతి స్థానంలో అమెరికా ఉంది.




## ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.10.64 లక్షల కోట్లు

✓ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో (ఏప్రిల్– నవంబరు) ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.10.64 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

✓ ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల్లో ఈ విలువ 58.34 శాతంగా నమోదైంది. 2022–23 ఏప్రిల్– నవంబరు వసూళ్లతో పోలిస్తే 23.4 శాతం అధికమని ఆర్థిక శాఖ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల కింద రూ.18.23 లక్షల కోట్లు, పరోక్ష పన్నుల రూపంలో రూ.15.38 లక్షల కోట్లు రావొచ్చని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది.

## ఐడీఎఫ్‌సీ - ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ విలీనానికి ఆర్‌బీఐ ఆమోదం

✓ ఐడీఎఫ్‌సీ, తన బ్యాంకింగ్ అనుబంధ సంస్థ అయిన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో విలీనం కావడానికి (రివర్స్ మెర్జర్) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆమోదముద్ర వేసింది. ఈ విలీన ప్రతిపాదనను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ బోర్డులు జులైలో అంగీకరించాయి.

✓ ఐడీఎఫ్‌సీ లిమిటెడ్, ఐడీఎఫ్‌సీ ఫైనాన్షియల్ హోల్డింగ్ కంపెనీ (ఐడీఎఫ్‌ఈ ఎఫ్‌హెచ్‌సీఎల్)లకు ఆర్‌బీఐ నుంచి ఈ విలీనానికి 'నిరభ్యంతర పత్రం' లభించినట్లు ఎక్స్ఛేంజీలకు ఐడీఎఫ్‌సీ తెలిపింది. ఈ విలీనం కింద తొలుత ఐడీఎఫ్‌సీలో ఐడీఎఫ్‌సీ ఎఫ్‌హెచ్‌సీఎల్ విలీనం అవుతుంది. ఆ తర్వాత ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనం అవుతుంది.

✓ జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వంటి ఇతర నియంత్రణ సంస్థల అనుమతులు ఇంకా లభించాల్సి ఉంది. ప్రతిపాదిత విలీన పథకం ప్రకారం.. ఐడీఎఫ్‌సీ వాటాదార్లకు ప్రతి 100 షేర్లకు, 155 ఐడీఎఫ్‌సీ బ్యాంకు షేర్లు లభిస్తాయి. విలీనానంతరం బ్యాంకు స్టాండలోన్ పుస్తక విలువ ఒక్కో షేరుకు 4.9% పెరుగుతుందని తెలుస్తోంది.

✓ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తరహాలోనే ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌కు కూడా ప్రమోటరు సంస్థ అంటూ ఉండదు. పూర్తిగా సంస్థాగత, పబ్లిక్ వాటాదార్ల యాజమాన్యంలో ఉంటుంది.

## భారతదేశ క్రిప్టో హబ్‌గా ఢిల్లీకి అగ్రస్థానం

✓ ఢిల్లీ, దేశంలోనే అత్యధిక శాతం క్రిప్టోకరెన్సీ పెట్టుబడిదారులను కలిగి ఉన్నట్లు ప్రముఖ భారతీయ క్రిప్టోకరెన్సీ ట్రేడింగ్ యాప్ కాయిన్ స్విచ్ వెల్లడించింది. ఇది దేశంలో 8.8 శాతం వాటాను క్లెయిమ్ చేస్తూ, ముంబై కంటే ఆధిక్యంలో ఉందని ఈ సంస్థ

వెల్లడించింది. దేశంలో వచ్చిన మొత్తం క్రిప్టో పెట్టుబడులలో 20 శాతం ఢిల్లీ, బెంగుళూరు మరియు ముంబైలలో కేంద్రీకృతమైనట్లు ఈ క్రిప్టో ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్ నివేదించింది.

- ✓ కాయిన్‌స్విచ్ నివేదిక ప్రకారం, ఈ ఏడాది భారతదేశం యొక్క క్రిప్టోకరెన్సీ పెట్టుబడిదారుల సంఖ్య 1.9 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం భారతదేశంలో క్రిప్టో మార్కెట్‌లో మహిళల భాగస్వామ్యం 9% ఉన్నట్లు తెలిపింది. ఢిల్లీ మరియు హైదరాబాద్‌లలో అత్యధిక మహిళా పెట్టుబడిదారులు ఉన్నట్లు తెలిపింది. అలానే మొత్తం పెట్టుబడిదారులలో దాదాపు 75% పెట్టుబడిదారులు 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారు. 34.27% పెట్టుబడిదారులు 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారు ఉన్నట్లు పేర్కొంది.

## యూఏఈ చమురు దిగుమతులకు రూపాయిల్లో చెల్లింపు

- ✓ ప్రపంచ మూడవ అతిపెద్ద ఇంధన వినియోగదారు అయిన భారతదేశం మొదటిసారి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ముడి చమురు కొనుగోలు కోసం రూపాయల్లో చెల్లించింది. అంతర్జాతీయ వాణిజ్య పద్ధతి ప్రకారం ముడి చమురు దిగుమతికి సంబంధించిన అన్ని ఒప్పందాలకు డిఫాల్ట్ చెల్లింపు కరెన్సీ యూఎస్ డాలర్ ఉంటుంది. అయితే ఈ ఏడాది జూలైలో భారతదేశం రూపాయి సెటిల్‌మెంట్ల కోసం యూఏఈతో ఒప్పందం చేసుకుంది.
- ✓ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ నుండి భారతీయ రూపాయలలో ఒక మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేయడానికి చెల్లింపులు చేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా స్థానిక కరెన్సీని ప్రోత్సహించడానికి వ్యూహాత్మక ఆరంభంగా నిలవనుంది. సూచిస్తుంది. రూపాయిని ఆచరణీయ వాణిజ్య పరిష్కార కరెన్సీగా స్థాపించడానికి భారతదేశం యొక్క విస్తృత ప్రయత్నాలలో ఈ చర్య ఒక భాగం.
- ✓ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఈ ఏడాది జులై 11, 2022 నుండి యూఏఈ యొక్క దిగుమతిదారులు రూపాయిలలో చెల్లించడానికి మరియు ఎగుమతిదారులు స్థానిక కరెన్సీలో చెల్లింపులను స్వీకరించడానికి అనుమతిస్తుంది. భారత్ యొక్క చమురు అవసరాలలో 85 శాతానికి పైగా దిగుమతులపై ఆధారపడి ఉండటంతో భారత ప్రభుత్వం ఈ బహుముఖ వ్యూహాన్ని అవలంబిస్తుంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలో కూడా భారత్ ఇదే వ్యూహాన్ని అమలు చేసి రష్యా నుండి చమురు కొనుగోలు చేసి బిలియన్ల డాలర్లను ఆదా చేసింది.
- ✓ 2022-23 ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్ 2022 నుండి మార్చి 2023 వరకు), భారతదేశం మొత్తం 232.7 మిలియన్ టన్నుల ముడి చమురును దిగుమతి చేసుకోవడానికి $157.5 బిలియన్లను ఖర్చు చేసింది. ఈ చమురు కొనుగోలు చేసిన ప్రధాన సరఫరాదారులలో ఇరాక్, సౌదీ అరేబియా, రష్యా మరియు యూఏఈలు ఉన్నాయి. భారత్ పశ్చిమ ఆసియా మొత్తం సరఫరాలలో 58 శాతం వాటాను కలిగి ఉంది. దేశీయ సరఫరా డిమాండ్‌లో ఇది 15 శాతం కంటే తక్కువగా ఉంది.

## దేశ జిడిపిలో 15 శాతానికి తగ్గిన వ్యవసాయం వాటా

- ✓ భారతదేశపు జిడిపిలో వ్యవసాయం వాటా 1990-91లో 35 శాతం నుండి గత ఆర్థిక సంవత్సరంలో 15 శాతానికి క్షీణించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. అయితే భారతదేశంలో పారిశ్రామిక మరియు సేవా రంగాల వేగవంతమైన వృద్ధి కారణంగా ఈ క్షీణత నమోదు అయినట్లు వెల్లడించింది. వ్యవసాయ రంగం కూడా అభివృద్ధి చెందినప్పటికీ, దాని వృద్ధి ఇతర రంగాలతో సమానంగా లేకపోవడంతో జిడిపిలో దాని వాటా తగ్గినట్లు తెలిపింది. ఈ వివరాలు కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.
- ✓ వృద్ధి పరంగా వ్యవసాయం మరియు దాని అనుబంధ రంగం గత ఐదేళ్లలో సగటు వార్షిక వృద్ధిని 4 శాతం నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రపంచ అనుభవానికి సంబంధించినంతవరకు, ప్రపంచ జిడిపిలో వ్యవసాయం వాటా దశాబ్దాలుగా క్షీణిస్తూ వస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

## దేశంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మహారాష్ట్ర

- ✓ భారతదేశ జీడీపీలో 15.7% వాటాతో మహారాష్ట్ర దేశంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఈ జాబితాలో 9.2 శాతంలో ఉత్తరప్రదేశ్ రెండవ స్థానంలో ఉండగా, 9.1 శాతంతో తమిళనాడు మూడవ స్థానంలో ఉంది. 8.2 శాతంతో గుజరాత్ నాల్గవ స్థానంలో ఉండగా, 7.5 శాతంతో వెస్ట్ బెంగాల్ ఐదవ స్థానంలో నిలిచింది. దేశంలో పెట్టుబడులు, స్టాక్ మార్కెట్‌ను ట్రాక్ చేసే ప్రముఖ ఆన్‌లైన్ బ్లాగింగ్ ప్లాట్‌ఫాం సోయిక్ (Soic.in) ఈ నివేదిక విడుదల చేసింది.

## 604 బిలియన్ డాలర్ల మార్కు చేరుకున్న భారతదేశ ఫారెక్స్ నిల్వలు

- ✓ భారతదేశ విదేశీ మారక నిల్వలు డిసెంబర్ 1 నాటికి $604 బిలియన్లకు చేరుకున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. దాదాపు నాలుగు నెలల తర్వాత ఈ $600 బిలియన్ల మార్కును అధిగమించినట్లు పేర్కొన్నారు. దేశంలోకి పెరిగిన ఎఫ్‌డిఐ ప్రవాహాలు, ఐటీ, ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాల్లో ఎగుమతి ఆదాయాలు పెరగడం కూడా ఈ పెరుగుదలకు దోహదపడినట్లు తెలుస్తుంది




## 'ఇస్రో' పీఎస్ఎల్వీ-సీ58 ప్రయోగం విజయవంతం

✓ పీఎస్ఎల్వీ–సీ58 ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో ప్రకటించింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ఎక్స్‌రే పొలారిమీటర్ శాటిలైట్ (ఎక్స్ పోశాట్)ను తీసుకుని పీఎస్ఎల్వీ వాహకనౌక నింగిలోకి దూసుకెళ్లింది. 22 నిమిషాల తర్వాత 650 కి.మీ. ఎత్తున ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. అనంతరం పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యుల్–3 (పీఓఈఎం– 3) ప్రయోగం నిర్వహించేందుకు వీలుగా రాకెట్ నాలుగో ఇంజిన్‌ను మండించి దాని కక్ష్యను 350 కి.మీ.కు తగ్గించారు.




✓ ఈ మాడ్యుల్‌లో కేరళకు చెందిన ఎల్‌బీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ వుమెన్ విద్యార్థినులు తయారు చేసిన వియ్‌శాట్‌తో పాటు ఫ్యూయల్ సెల్, సిలికాన్ ఆధారిత అత్యంత శక్తిమంతమైన బ్యాటరీ, రేడియో శాటిలైట్ సర్వీస్ వంటి నూతన సాంకేతికత ఆధారంగా పనిచేసే పది పరికరాలు ఉంటాయి. ఇవి సమాచారాన్ని సేకరించడంతో పాటు వివిధ ప్రయోగాలు నిర్వహిస్తాయి. వీటిల్లో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ అభివృద్ధి చేసిన ఫ్యూయల్ సెల్ కీలకమైనది. సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్న భారత్‌కు రోదసిలో సమర్థవంతమైన సుస్థిర శక్తి వనరు అవసరం. ఆ అవసరాన్ని ఫ్యూయల్ సెల్ తీరుస్తుందని ఇస్రో భావిస్తోంది.

✓ ఖగోళంలో వ్యాప్తి చెందే ఎక్స్‌రే తరంగాల జననస్థానాన్ని గుర్తించే లక్ష్యంతో ఇస్రో ఎక్స్‌పోశాట్‌ను ప్రయోగించింది. 2021లో నాసా ఎక్స్‌రే పొలారిమెట్రీ ఎక్స్‌ప్లోరర్ మిషన్ పేరుతో ఓ ప్రయోగాన్ని నిర్వహించింది. తర్వాత ఈ లక్ష్యంతో ఉపగ్రహాన్ని ప్రయోగించిన రెండో దేశం భారత్ కావడం విశేషం. అబ్జర్వేటరీగా పనిచేసే ఎక్స్ పోశాట్, బ్లాక్‌హోల్స్, న్యూట్రాన్ నక్షత్రాలను అధ్యయనం చేయనుంది.

## హైస్పీడ్ ఫ్లయింగ్ వింగ్ యూఏవీ పరీక్ష విజయవంతం

✓ భవిష్యత్‌తరం మానవరహిత పోరాట విమానాలను రూపొందించే దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన హైస్పీడ్ ఫ్లయింగ్ వింగ్ మానవరహిత విమానా (యూఏవీ)న్ని విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో ఈ తరహా సంక్లిష్ట పరిజ్ఞానం కలిగిన అతికొద్ది దేశాల సరసన భారత చేరినట్లయింది. కర్ణాటకలోని చిత్రదుర్గలో ఈ పరీక్ష జరిగింది. ఈ అటానమస్ లోహ విహంగాన్ని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) రూపొందించింది. ఇది బాణం మొన ఆకృతిలో ఉంటుంది. దీనికి తోక భాగం ఉండదు. నేల మీద నుంచి రాడార్లు, మౌలిక వసతులు, పైలట్ సాయం లేకుండా ఈ యూఏవీ సొంతంగా ల్యాండింగ్ నిర్వహించగలిగింది. దీని సెన్సర్ డేటాను స్వదేశీ ఉపగ్రహ ఆధారిత దిక్సూచి వ్యవస్థ రిసీవర్లతో అనుసంధానించడం వల్ల ఇది సాధ్యమైంది.

## లేజర్ కమ్యూనికేషన్‌తో అంతరిక్షం నుంచి వీడియో ప్రసారం

✓ కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా అంతరిక్షం నుంచి తొలి అల్ట్రా హెచ్‌డీ వీడియోను భూమికి పంపింది. సుమారు 3.1 కోట్ల కిలోమీటర్ల దూరం నుంచి ఈ వీడియో ప్రసారం కావడం విశేషం. ఇది భూమి, చంద్రుడి మధ్య దూరం కంటే 80 రెట్లు ఎక్కువ. 15 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోలో టాటర్స్ అనే పిల్లి లేజర్ లైట్‌ను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుంది. డీప్ స్పేస్ ఆప్టికల్ కమ్యూనికేషన్ ప్రయోగంలో భాగంగా ఈ వీడియోను ప్రసారం చేసినట్లు నాసా పేర్కొంది. ఈ సాంకేతికత ద్వారా భవిష్యత్తులో అంతరిక్షం నుంచి భూమి మీదకు డేటా, ఫొటో/వీడియోలను పంపేందుకు, మానవుల అంగారక యాత్రకు ఉపయోగపడుతుందని తెలిపింది. అంతరిక్షంలో అంగారక – గురు



గ్రహాల మధ్య ఉంటూ సూర్యుని కక్ష్యలో తిరుగుతున్న గ్రహశకలంపైకి ఈ ఏడాది అక్టోబరులో నాసా 'సైకీ' అనే వ్యోమనౌకను పంపింది. కొద్ది రోజుల క్రితం దీనిలో 'ట్రాన్సీవర్' భూమి మీదకు విజయవంతంగా లేజర్ సంకేతాన్ని పంపింది. ఈ మేరకు వ్యోమనౌక నుంచి ఎన్‌కోడెడ్ ఇన్‌ఫ్రారెడ్ సిగ్నల్‌ను అమెరికాలోని శాన్ డియాగో కౌంటీలో ఉన్న 'కాల్‌టెక్ పలోమర్ అబ్జర్వేటరీ' కేంద్రంలోని 'హాలే టెలిస్కోప్' అందుకుంది. ఆ తర్వాత దానిని దక్షిణ కాలిఫోర్నియాలోని నాసా జెట్ ప్రొపల్షన్ పరిశోధనాశాలకు పంపింది. అక్కడ వీడియోను డీకోడ్ చేసినట్లు జేపీఎల్ ప్రాజెక్ట్ మేనేజర్ బిల్ క్లిప్‌స్టెయిన్ తెలిపారు. దీంతో 10 లక్షల మైళ్ల దూరం నుంచి బ్రాడ్‌బ్యాండ్ వీడియోలను ప్రసారం చేయాలన్న తమ లక్ష్యం నెరవేరిందని వెల్లడించారు.

## జీవం ఉనికిని చెప్పే కార్బన్ డైఆక్సైడ్

✓ ఒక గ్రహ వాతావరణంలో కార్బన్ డైఆక్సైడ్ (సీవో2) పాళ్లు తక్కువగా ఉంటే అక్కడ నీరు, జీవం ఉండే అవకాశాలు ఎక్కువని అమెరికాలోని ఎంఐటీ, బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు కనుగొన్నారు. కార్బన్ డైఆక్సైడ్ తక్కువగా ఉండే గ్రహాలు జీవ నివాసయోగ్యమైనవి అవుతాయి. సాధారణంగా ప్రతి నక్షత్రం చుట్టూ గ్రహాలు ఏర్పడతాయి, వాటిలో కొన్ని నక్షత్రానికి దగ్గరగా ఉండి అత్యధిక ఉష్ణంతో జ్వలిస్తుంటాయి. మరికొన్ని బాగా దూరంగా ఉండి అతిశీతలంగా ఉంటాయి. ఈ రెండు రకాల గ్రహాలు జీవులకు నివాస యోగ్యం కావు. ఉదాహరణకు భూమి, శుక్రుడు దాదాపు ఒకే పరిమాణంలో ఉంటాయి. శుక్ర గ్రహం సూర్యునికి దగ్గరగా ఉన్నందున అక్కడి అత్యధిక ఉష్ణ వాతావరణంలో జీవులు మనుగడ సాగించలేవు. పైగా శుక్ర గ్రహ వాతావరణంలో బొగ్గుపులుసు వాయువు విపరీతంగా ఉంటుంది. భూమిపై కూడా ఒకప్పుడు ఈ వాయువు చాలా దట్టంగా ఉండేది. అయితే సరైన స్థాయిలో ఉష్ణోగ్రత ఉండి సముద్రాలు ఏర్పడటంతో ఆ సముద్రాలు వాతావరణంలోని కార్బన్ డైఆక్సైడ్‌ను పీల్చుకున్నాయి. నీటి వల్ల భూమిపై జీవం పుట్టుకొచ్చింది. బొగ్గుపులుసు వాయువును పీల్చుకుని వృక్షాలు వదిలే ఆమ్లజని జీవులకు ప్రాణాధారమైంది.

## పాకిస్థాన్ స్వదేశీ క్షిపణి పరీక్ష విజయవంతం

✓ దేశీయంగా అభివృద్ధి చేసిన బహుళ ప్రయోగ క్షిపణి (రాకెట్) వ్యవస్థ ఫతా-2ను పాకిస్థాన్ విజయవంతంగా పరీక్షించింది. ఇది 400 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. ఫతా-II మునుపటి ఫతా-1 వ్యవస్థ (250 కిలోమీటర్లు) తో పోలిస్తే గణనీయంగా విస్తరించింది. ఫతా-II అత్యాధునిక ఏవియానిక్స్, అధునాతన నావిగేషన్ సిస్టమ్‌లు మరియు ప్రత్యేకమైన విమాన పథాన్ని కలిగి ఉంది. ఇది నిర్దేశిత లక్ష్యాన్ని అత్యంత ఖచ్చితత్వంతో చేదిస్తుంది. ఫతా-II, భారత్ కు చెందిన S-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌కు సమర్థవంతంగా తిప్పికొట్టగలదని చెబుతున్నారు

## అధునాతన యుద్ధవిమానం తయారీకి జపాన్, బ్రిటన్, ఇటలీ ఒప్పందం

✓ అధునాతన యుద్ధ విమానం తయారీకి జపాన్, బ్రిటన్, ఇటలీ చేతులు కలిపాయి. దీనికి సంబంధించి ఉమ్మడి సంస్థ ఏర్పాటు ఒప్పందంపై ఈ మూడు దేశాల రక్షణ మంత్రులు టోక్యోలో సంతకాలు చేశారు. ప్రధానంగా చైనా, రష్యా, ఉత్తర కొరియా దేశాల నుంచి పెరుగుతున్న ముప్పును ఎదుర్కొనేందుకు ఈ చర్యలు చేపట్టాయి. మిత్సుబిషి ఎఫ్-ఎక్స్ యుద్ధ విమానాలను మూడు దేశాలు సంయుక్తంగా అభివృద్ధి చేయనున్నాయి. 2035 నాటికి ఎఫ్-2ఎస్ యుద్ధ విమానాల స్థానంలో కొత్తవాటిని ప్రవేశపెట్టాలని యోచిస్తున్నాయి.



## చైనా లాంగ్ మార్చ్-11 రాకెట్ ప్రయోగం విజయవంతం

✓ చైనా లాంగ్ మార్చ్-11 క్యారియర్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. మూడు ఉపగ్రహాలతో దక్షిణ చైనాలోని గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్‌లోని తైయువాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుండి ఈ రాకెట్‌ను ప్రయోగించింది. ఈ ఉపగ్రహాలను ప్రధానంగా అంతరిక్ష శాస్త్ర సాంకేతిక ప్రయోగాల కోసం వినియోగించనున్నారు. ఇది లాంగ్ మార్చ్ క్యారియర్ రాకెట్ సిరీస్ లో 503వ మిషన్.

✓ లాంగ్ మార్చ్ 11 రాకెట్‌ను చైనా అకాడమీ ఆఫ్ లాంచ్ వెహికల్ టెక్నాలజీ అభివృద్ధి చేసింది. ఇది 20.8 మీటర్ల పొడవు, 58 మెట్రిక్ టన్నుల లిఫ్ట్‌ఆఫ్ బరువు మరియు 2 మీటర్ల వ్యాసంతో ఉంటుంది. ఇది తక్కువ-భూమి కక్ష్యలోకి ఉపగ్రహాలను రవాణా చేయడానికి ఉపయోగపడుతుంది.

## రవీంద్రనాథ్ ఠాగూర్ పేరుతో పాంటోయా టాగోరీ

✓ విశ్వభారతి విశ్వవిద్యాలయంకు చెందిన వృక్షశాస్త్ర పరిశోధకులు మొక్కల పెరుగుదలను పెంపొందించే అద్భుతమైన సంభావ్యత కలిగిన బ్యాక్టీరియాను కనుగొన్నారు. దీనికి నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ గౌరవార్థం 'పాంటోయా టాగోరీ'గా నామకరణం చేశారు. ఈ బాక్టీరియాను జార్ఖండ్ మరియు సోనాజురిలోని మట్టి నమూనాల నుండి వేరుచేసారు.

✓ పాంటోయా టాగోరీ మొక్కల పెరుగుదలను పెంపొందించే జీవన విధానం కలిగివున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఇవి సేంద్రీయ వ్యవసాయంలో ఉపయోగపడనున్నట్లు పేర్కొన్నారు. ఇది

పొటాషియంను కరిగించడంతో పాటుగా నత్రజని స్థాపన చేస్తున్నట్లు వెల్లడించారు.

- ✓ ఈ బాక్టీరియా ఆవిష్కరణ వ్యవసాయ పద్ధతులను విప్లవాత్మకంగా మార్చే అవకాశం ఉంది. పాంటోయా టాగోరీను బయోఫెర్టిలైజర్ గా ఉపయోగించడం ద్వారా, రైతులు రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు, ఇది పర్యావరణం మరియు నేల ఆరోగ్యానికి మేలు కలిగిస్తుంది. అదనంగా ఈ బ్యాక్టీరియా పంట దిగుబడిని మెరుగుపరచడానికి మరియు ఆహార భద్రతకు ఉపయోగపడుతుంది.

## అరుణాచల్ ప్రదేశ్‌లో నామ్‌దఫా ఫ్లయింగ్ స్క్విరెల్ జాడ

- ✓ అరుణాచల్ ప్రదేశ్‌లో 42 ఏళ్లుగా అదృశ్యమైన రాత్రిపూట ఎగిరే ఉడుత మళ్లీ వెలుగులోకి వచ్చింది. నామ్‌దఫా ఫ్లయింగ్ స్క్విరెల్ (బిస్వామోయోప్టెరస్ బిస్వాసి) అని పిలవబడే ఈ ఉడుత ఇటీవలే అరుణాచల్ ప్రదేశ్ అడవుల్లో కనిపించింది. ఈ అరుదైన జాతి చివరిగా 1981లో నమోదు చేయబడింది. అస్సాంకు చెందిన జీవవైవిధ్య పరిరక్షణ సమూహం అయిన ఆరణ్యక్‌కి చెందిన పది సాహసయాత్ర బృందాలలో ఒకటి దీనిని గుర్తించింది.



- ✓ నమ్‌దఫా ఫ్లయింగ్ స్క్విరెల్ ( బిస్వామోయోప్టెరస్ బిస్వాసి ) అనేది ఈశాన్య భారతదేశంలోని అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఒక ఎగిరే ఉడుత. దీనిని 1981 లో నమ్‌దఫా నేషనల్ పార్క్‌లో సేకరించిన ఒక జంతుశాస్త్ర నమూనా ద్వారా ఎగిరే ఉడుతగా గుర్తించారు. దీని శాస్త్రీయ నామం మాజీ జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బిస్వామోయ్ బిస్వాస్ పేరున పెట్టబడింది. ఇది పొడవైన మెసువా ఫెర్రియా అరణ్యాలలో నివసిస్తుంది, తరచుగా దిహాంగ్ నది పరివాహక ప్రాంతంలోని కొండ వాలులలో కూడా కనిపిస్తుంది.

## ఈజిప్ట్ & చైనా మిస్సాట్-2 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం

- ✓ చైనా మరియు ఈజిప్ట్‌లు డిసెంబర్ 4, 2023న మిస్రోశాట్-2 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి విజయవంతంగా ప్రయోగించాయి. ఈ ప్రయోగం వాయువ్య చైనాలోని జియుక్వాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుండి లాంగ్ మార్చ్-2C క్యారియర్ రాకెట్ ద్వారా నిర్వహించబడింది. మిస్రోశాట్ - 2 ఉపగ్రహ ప్రాజెక్ట్‌ను చేపట్టేందుకు 2019లో ఈజిప్ట్ మరియు చైనా $ 72 మిలియన్ల ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ ప్రాజెక్టు యందు ఈజిప్షియన్ స్పేస్ ఏజెన్సీ మరియు చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ ఉమ్మడిగా పనిచేసాయి.
- ✓ ఈ ఉమ్మడి అభివృద్ధిలో చైనా, ఈజిప్టు సిబ్బందికి మొత్తం ఉపగ్రహ రూపకల్పన, అసెంబ్లీ మరియు పరీక్షలను కవర్ చేసే శిక్షణా కార్యక్రమాలను అందించింది. మిస్సాట్ అనేది అధునాతన ఆప్టికల్ ఇమేజింగ్ టెక్నాలజీతో కూడిన భూమి పరిశీలన ఉపగ్రహం. ఇది ఈజిప్ట్ భూమి మరియు నీటి వనరుల యొక్క అధిక-రిజల్యూషన్ చిత్రాలను అందిస్తుంది. ఈ ఉపగ్రహం వ్యవసాయం, జాతీయ వనరులు, పట్టణ ప్రణాళిక మరియు తీరప్రాంత మార్పు పర్యవేక్షణతో సహా వివిధ రంగాలలో కీలక పాత్ర పోషించనుంది.

## ప్రపంచ తొలి లిక్విడ్ మీథేన్ రాకెట్ ప్రయోగాన్ని నిర్వహించిన చైనా

- ✓ చైనాకు చెందిన ఒక ప్రైవేట్ ఏరోస్పేస్ స్పేస్ కంపెనీ ప్రపంచంలోనే మొట్టమొదటి మీథేన్-ఇంధన అంతరిక్ష రాకెట్ "జుక్-2" ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ల్యాండ్‌స్పేస్ టెక్నాలజీ కార్పొరేషన్ అనే ఈ ప్రైవేట్ స్పేస్ టెక్నాలజీ సంస్థ జియుక్వాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుండి డిసెంబర్ 9న ఈ ప్రయోగం నిర్వహించింది. ఇది విజయవంతం అయిన మొదటి మీథేన్-ఆధారిత రాకెట్‌గా నిలిచింది.
- ✓ జుక్-2 వై-3 రాకెట్ అనేది ల్యాండ్‌స్పేస్ కంపెనీచే అభివృద్ధి చేయబడిన ఒక చిన్న, మూడు-దశల లాంచర్. ఇది 50 కిలోల బరువున్న రెండు టెస్ట్ శాటిలైట్‌లను కక్ష్యలోకి విజయవంతంగా తీసుకువెళ్లింది. మీథేన్-లిక్విడ్ ఆక్సిజన్ రాకెట్ తక్కువ కాలుష్యం, సురక్షిత మరియు చౌకైనది. ఇవి పునర్వినియోగ రాకెట్‌కు తగిన ప్రొపెల్లెంట్‌గా కూడా పరిగణించబడుతుంది.

## చైనాలో నాల్గవ తరం న్యూక్లియర్ రియాక్టర్ ప్రారంభం

- ✓ చైనా ప్రపంచంలోని మొట్టమొదటి నాల్గవ తరం, గ్యాస్-కూల్డ్ న్యూక్లియర్ రియాక్టర్ పవర్ ప్లాంట్ వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించినట్లు పేర్కొంది. దీనికి సంబదించిన షిడోవాన్ అణు విద్యుత్ ప్లాంట్ వాణిజ్య కార్యకలాపాలను డిసెంబర్ 6 న ప్రారంభించింది. దీనిని చైనా నేషనల్ న్యూక్లియర్ కార్పొరేషన్ నిర్మించింది.
- ✓ ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ఎమర్జెన్సీ కోర్ కూలింగ్ సిస్టమ్‌లు లేకుండా వాణిజ్య-స్థాయి రియాక్టర్‌లను సహజంగా చల్లబరచవచ్చని ఈ ప్లాంట్ నిరూపించింది. హెచ్‌టిఆర్-పిఎమ్ వంటి నాల్గవ తరం రియాక్టర్‌లు సాంప్రదాయ డిజైన్‌లతో పోలిస్తే తక్కువ ఇంధనం నుండి ఎక్కువ శక్తిని ఉత్పత్తి చేస్తాయి. ఇది శక్తి ఉత్పత్తి నుండి గ్రీన్హౌస్ వాయు ఉద్గారాలను గణనీయంగా

తగ్గిస్తుంది. ఈ రియాక్టర్లలో అధునాతన ఇంధన చక్రాలు అణు వ్యర్థాల వాల్యూమ్ మరియు రేడియోధార్మికతను గణనీయంగా తగ్గించగలవు.

## జపాన్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రయోగాత్మక న్యూక్లియర్ ఫ్యూజన్ రియాక్టర్ JT-60SA

- ✓ JT-60SA అని పిలువబడే ప్రపంచంలోనే అతిపెద్ద మరియు అత్యంత అధునాతనమైన టోకామాక్-రకం ఫ్యూజన్ రియాక్టర్ జపాన్‌లోని ఇబారకి ప్రిఫెక్చర్‌లో తన కార్యకలాపాలను ప్రారంభించింది.
- ✓ యురోపియన్ యూనియన్ (EU) , జపాన్ (Japan) సంయుక్తంగా జేటీ-60ఎస్ఏ అనే ఈ రియాక్టర్‌ను త యారుచేశాయి. ఎంతో ఆధునిక పరిజ్ఞానంతో రూపొందొంచిన ఈ ఫ్యూజన్ (Fusion) రియాక్టర్ భవిష్యత్తు విద్యుత్ అవసరాలను తీరుస్తుందని, గ్రీన్ ఎనర్జీలో కీలక పాత్ర పోషిస్తుందని చాలా మంది భావిస్తున్నారు. ఏడు అంతస్తుల ఎత్తు ఉండే ఈ భారీ రియాక్టర్.. 200 మిలియన్ డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను వెలువరిస్తుంది. ఫ్యూజన్ (సంలీనం) ఆధారంగా పనిచేసే ఈ రియాక్టర్‌లో తేలికైన హైడ్రోజన్ అణువులు కలిసి భారమైన హీలియం ఏర్పడుతుంది. ఈ ప్రక్రియలో ఉత్పత్తి అయ్యే శక్తి నుంచే విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు.
- ✓ మరోవైపు యూరప్‌లోనూ ఒక ఫ్యూజన్ రియాక్టర్ నిర్మాణంలో ఉంది. జేటీ-60ఎస్ఏకు సోదరుడిలా భావించే ఈ రియాక్టర్‌ను ఇంటర్నేషనల్ థర్మోన్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్ (ఐటీఈఆర్) అని పిలుస్తున్నారు. ఇదే ముందు కార్యకలాపాలు మొదలు పెట్టాల్సి ఉన్నప్పటికీ.. శాస్త్రవేత్తలు డెడ్‌లైన్‌ను అందుకోలేక పోయారు. ఇది కూడా ఫ్యూజన్ ప్రక్రియ ద్వారానే శక్తిని ఉత్పత్తి చేస్తుంది.


## స్వదేశీ సోడియం-అయాన్ బ్యాటరీ సాంకేతికతను ఆవిష్కరించిన KPIT

- ✓ KPIT టెక్నాలజీస్ లిమిటెడ్ భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ సోడియం-అయాన్ బ్యాటరీ సాంకేతికతను అత్యంత ఖరీదైన లిథియం-అయాన్ కణాలకు ప్రత్యామ్నాయంగా ఆవిష్కరించింది. పూణేలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సహకారంతో దాదాపు ఒక దశాబ్దం పాటు అభివృద్ధి చేయబడిన సోడియం-అయాన్ బ్యాటరీ లిథియం-అయాన్ కణాల కంటే ఎక్కువ మన్నికైనది, ఎక్కువ కాలం మన్నుతుంది మరియు సురక్షితమైనది. ఇది అధిక ఉష్ణ నిరోధకతతో కూడా వేగంగా ఛార్జ్ అవుతుంది. కిలోకు 100-170 వాట్-గంట శక్తి సాంద్రతతో, సాంకేతికత లిథియం బ్యాటరీలను పట్టుకుంటుంది.

## నిర్లక్ష్యం చేయబడిన ఉష్ణమండల వ్యాధిగా నోమా: WHO

- ✓ డిసెంబర్ 15, 2023న, ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) అధికారికంగా నోమా, నోటి మరియు ముఖం యొక్క తీవ్రమైన గ్యాంగ్రేనస్ వ్యాధిని నిర్లక్ష్యం చేయబడిన ఉష్ణమండల వ్యాధుల (NTDలు) జాబితాలో చేర్చింది. దీనిని కాన్క్రం ఓరిస్ అని కూడా పిలుస్తారు, నోమా మరణాల రేటు సుమారుగా 90% ఎక్కువగా ఉంటుంది మరియు ఇది తీవ్ర పేదరికం, పోషకాహార లోపం మరియు పేలవమైన పారిశుధ్యంతో సంబంధం కలిగి ఉంటుంది.
- ✓ ప్రపంచవ్యాప్తంగా అవగాహనను పెంపొందించడం, పరిశోధనను ఉత్ప్రేరకపరచడం, నిధులను ప్రేరేపించడం మరియు వ్యాధిని నియంత్రించే ప్రయత్నాలను పెంచడమే లక్ష్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ(WHO) అధికారికంగా ఈ జాబితాలో చేర్చింది.

## ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన AI మోడల్ "గూగుల్ జెమిని"




- ✓ కృత్రిమ మేధ (AI) రంగంలో గూగుల్ కొత్త అంకానికి తెరలేపింది. గూగుల్ జెమిని (Google Gemini) పేరుతో అత్యంత అడ్వాన్స్‌డ్ వెర్షన్ ఏఐ మోడల్‌ను ప్రపంచానికి పరిచయం చేసింది. ఇది టెక్స్ట్, ఫొటో, ఆడియో, వీడియో, కోడింగ్ వంటి వివిధ రకాల సమాచారాన్ని 90 శాతం కచ్చితత్వంతో యూజర్లకు అందిస్తుందని తెలిపింది. జెమిని 1.0 వెర్షన్‌ను మూడు వేరియంట్లలో తీసుకొచ్చారు. జెమిని అల్ట్రా (Gemini Ultra), జెమిని ప్రో (Gemini Pro), జెమిని నానో (Gemini Pro). ఇది డేటా సెంటర్ల నుంచి మొబైల్ డివైజ్‌ల వరకు అన్నింటిలో పనిచేస్తుందని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తెలిపారు.

### జెమిని ప్రత్యేకతలు

- ✓ శాస్త్రీయ పరిశోధనలకు సంబంధించిన పరిశోధన పత్రాల్లో గ్రాఫ్‌లు, గణాంకాలను రూపొందించగలదు. విద్యార్థుల హోంవర్క్‌లో సాయపడుతుంది. ఉదాహరణకు మ్యాథ్స్ హోంవర్క్‌ను ఫొటో తీసి జెమినిలో అప్‌లోడ్ చేస్తే.. దానికి కచ్చితమైన సమాధానం ఇస్తుంది. దీనికి సంబంధించిన వీడియోను గూగుల్ షేర్ చేసింది. దాంతోపాటు ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లను రాయడంతోపాటు యూజర్లకు సులభమైన పద్ధతిలో వివరిస్తుంది.
- ✓ జెమిని ప్రస్తుతం ఆంగ్ల భాషలో మాత్రమే అందుబాటులో ఉంది. భవిష్యత్తులో ప్రపంచంలోని అన్ని భాషల్లో పరిచయం చేస్తామని గూగుల్ తెలిపింది. గూగుల్ సెర్చ్ ఇంజిన్, క్రోమ్ బ్రౌజర్ సహా ఇతర గూగుల్ సర్వీసుల్లో జెమిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు సుందర్ పిచాయ్ చెప్పారు.




## భారత నౌకాదళం అమ్ములపొదిలోకి 'ఐఎన్ఎస్ ఇంఫాల్'

- ✓ భారత నౌకాదళ శక్తిసామర్థ్యాలు మరింత పెరిగాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన స్టెల్త్ గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ యుద్ధనౌక 'ఐఎన్ఎస్ ఇంఫాల్'ను రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నౌకాదళంలో ప్రవేశపెట్టారు. ముంబయిలోని నేవల్ డాక్ యార్డ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. దేశ భద్రత విషయంలో ప్రభుత్వ నిబద్ధత, రక్షణ రంగంలో భారత స్వావలంబనకు 'ఐఎన్ ఎస్ ఇంఫాల్' నిదర్శనమని రాజ్‌నాథ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. హిందూ మహాసముద్రంలో చైనా నేవీ కదలికలు పెరుగుతున్న వేళ.. మన దేశ రక్షణ సామర్థ్యానికి ఈ యుద్ధనౌక మరింత పదును పెట్టనుంది.



- ✓ 'ఐఎన్ఎస్ ఇంఫాల్' పొడవు 163 మీటర్లు, బరువు 7,400 టన్నులు. రెండో ప్రపంచ యుద్ధంలో భాగంగా 'ఇంఫాల్ యుద్ధం' లో పోరాడిన భారత సైనికుల త్యాగాలకు గుర్తింపుగా నౌకకు పేరు ఈ పెట్టారు. ఈశాన్య రాష్ట్రంలోని ఒక నగరం పేరును ఓ యుద్ధనౌకకు పెట్టడం ఇదే తొలిసారి.
- ✓ భారత నౌకాదళానికి చెందిన 'వార్‌షిప్ డిజైన్ బ్యూరో' దేశీయంగా రూపొందించిన నాలుగు 'విశాఖపట్నం' క్లాస్ డెస్ట్రాయర్‌లలో ఇది మూడోది. ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగావ్ డాక్ లిమిటెడ్ నిర్మించింది.
- ✓ 2017 మేలో ఈ యుద్ధనౌక నిర్మాణ పనులు మొదలయ్యాయి. 2019 ఏప్రిల్‌లో జలప్రవేశం చేయించారు. 2023 ఏప్రిల్ 28 నుంచి పూర్తిస్థాయి ట్రయల్స్ నిర్వహించారు. ఆరు నెలల్లోనే అక్టోబరులో నౌకాదళానికి అప్పగించారు. నిర్మాణం, పరీక్షలను అతి తక్కువ వ్యవధిలో పూర్తి చేసుకున్న స్వదేశీ నౌక ఇదే కావడం విశేషం.
- ✓ ఇందులో అధునాతన ఆయుధాలు, సెన్సర్లు ఉన్నాయి. ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల క్షిపణులు, నౌకా విధ్వంసక అస్త్రాలు, టోర్పిడోలను ఈ యుద్ధనౌకలో మోహరిస్తారు. బ్రహ్మోస్ క్షిపణులూ ఇందులో ఉంటాయి.

## కార్గిల్ వైమానికతలంపై వాయుసేన విన్యాసం

- ✓ భారత వాయుసేన మరో ఘనత సాధించింది. పాకిస్థాన్‌తో ఉన్న నియంత్రణ రేఖకు సమీపంలోని కార్గిల్ వైమానికతలంపై (ఎయిర్ స్ట్రిప్) తొలిసారి సి-130జె రవాణా విమానాన్ని రాత్రివేళ దించింది. సముద్రమట్టానికి 10,500 మీటర్ల ఎత్తులో ప్రతికూల భౌగోళిక, వాతావరణ పరిస్థితుల మధ్య ఈ వైమానిక స్థావరం ఉంది. అక్కడ దిగిన సి-130జె విమానంలో వాయుసేనకు చెందిన గరుడ్ కమాండోలు ప్రయాణించారు.
- ✓ ఈ ప్రాంతంలో ఈ విన్యాసాన్ని నిర్వహించడం ద్వారా వాయుసేన తన పోరాట సామర్థ్యాన్ని చాటింది. గతంలో ఇక్కడి నుంచి యుద్ధవిమానాలు రాకపోకలు సాగించాయి. అయితే, భారీ రవాణా విమానం రాత్రివేళ దిగడం ఇదే మొదటిసారి. ఇందుకోసం సి-130జె 'టెరైన్ మాస్కింగ్' విధానాన్ని కూడా ఉపయోగించింది.

## ఎం.వి.లీలా నార్‌ఫోక్ నౌకను రక్షించిన భారత నౌకాదళ కమాండోలు

- ✓ అరేబియా సముద్రంలో వాణిజ్య నౌక ఎం.వి.లీలా నార్‌ఫోక్ హైజాక్ అయినట్లు జనవరి 4న యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ నుంచి నౌకాదళానికి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో భారత నౌకాదళానికి చెందిన మెరైన్ కమాండోలు జనవరి 5న ఆ నౌకను రక్షించి సముద్రపు దొంగల ఆట కట్టించారు. అందులో చిక్కుకున్న 21 మంది సిబ్బందిని కాపాడారు. ఇందులో 15 మంది భారతీయులు ఉన్నారు.

## నేవీ అధికారులకు కొత్త బ్యాడ్జీలు

- ✓ భారత నౌకాదళం అడ్మిరల్ స్థాయి అధికారుల కోసం కొత్తగా రూపొందించిన బ్యాడ్జీలను తాజాగా విడుదల చేసింది. మరాఠా సామ్రాజ్యాధినేత ఛత్రపతి శివాజీ మహారాజ్ వారసత్వాన్ని



ఇవి ప్రతిబింబిస్తాయని నౌకాదళ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. అడ్మిరల్, వైస్ అడ్మిరల్, రియర్ అడ్మిరల్ లకు సంబంధించి మొత్తం అయిదు బ్యాడ్జీలను నౌకాదళం ఆవిష్కరించింది. భుజానికి ధరించే ఈ బ్యాడ్జీ అధికారి స్థాయిని సూచిస్తుంది. బ్యాడ్జీపై ఎరుపు రంగులో అష్టభుజి ఆకారంలోని చిహ్నం ఎనిమిది దిక్కుల్లో నౌకాదళ దార్శనికతకు ప్రతీక. ఛత్రపతి శివాజీ మహారాజ్ రాజముద్ర నుంచి స్ఫూర్తి పొంది దీన్ని రూపొందించారు. అష్టభుజాకారం మీద 'నౌకాదళ చిహ్నం' తో కూడిన బంగారు గుండీ పొందుపర్చారు. బానిస మనస్తత్వాన్ని వదిలించుకోవాలనే సంకల్పాన్ని ఇది చాటుతుంది. కింద ఖడ్గం, టెలిస్కోపు ఉన్నాయి. భారత సరికొత్త శక్తిసామర్థ్యాలను, యుద్ధాల్లో ఆధిపత్యాన్ని ఖడ్గం సూచిస్తుంది. టెలిస్కోపు దూరదృష్టిని ప్రతిబింబిస్తుంది. అధికారుల ర్యాంకును బట్టి నక్షత్రాల సంఖ్య, బ్యాడ్జీ అంచు రంగు ఉంటాయి.

- ✓ గతేడాది సెప్టెంబరులో ప్రధాని మోదీ భారత నౌకాదళ సరికొత్త చిహ్నాన్ని (నిశాన్) ఆవిష్కరించిన విషయం తెలిసిందే. అంతకుముందున్న గుర్తు దేశ వలసవాద గతాన్ని గుర్తు చేసేలా ఉందని కేంద్రం భావించింది. ఈ క్రమంలోనే భారతదేశ చరిత్ర నుంచి స్ఫూర్తి పొందేలా కొత్త చిహ్నాన్ని తీసుకొచ్చింది. సముద్ర జలాలు, తీరాలపై ఆధిపత్యం చెలాయించిన భారత రాజుల్లో శివాజీ ఒకరు. ఆయన అత్యంత విశ్వసనీయమైన నౌకాదళాన్ని నిర్మించారు. ఇందులో 60 యుద్ధనౌకలు, దాదాపు 5 వేల మంది సైన్యం ఉండేవారని నేవీ గతంలో ఓ వీడియో ద్వారా తెలిపింది. భారత తీర రక్షణలో ఈ దళం అత్యంత కీలకంగా పనిచేసింది.

## నౌకాదళంలోకి నాల్గవ మిస్సైల్ కమ్ ఎమ్యునిషన్ బార్జ్

- ✓ భారతీయ నావికాదళం ఇటీవల తన నాల్గవ మిస్సైల్ కమ్ ఎమ్యునిషన్ బార్జ్, ఎల్ఎస్ఏఎం 10 (యార్డ్ 78) ప్రవేశపెట్టింది. డిసెంబర్ 28న ముంబైలోని నావల్ డాక్‌యార్డ్‌లో దీనిని నౌకాదళానికి అందజేశారు. వీటిని విశాఖపట్నానికి చెందిన సెకాన్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అభివృద్ధి చేసింది. ఈ బార్జ్ మోడల్ టెస్టింగ్ విశాఖపట్నంలోని నావల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లాబొరేటరీలో జరిగింది. ఈ బార్జ్‌లు భారత ప్రభుత్వ మేక్ ఇన్ ఇండియా చొరవలో భాగం.
- ✓ రక్షణ మంత్రిత్వ శాఖ 19 ఫిబ్రవరి 2021లో విశాఖపట్నానికి చెందిన సెకాన్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఒప్పందంపై సంతకం చేసింది. ఈ ఎంఓయూ ప్రకారం సదురు సంస్థ 08 మిస్సైల్ కమ్ ఎమ్యునిషన్ బార్జ్‌లు రూపొందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం నాలుగు బార్జ్‌లు డెలివరీ చేయబడ్డాయి. రాబోయే సంవత్సరాల్లో మిగిలిన నాలుగు అందించబడతాయి.
- ✓ మిస్సైల్ కమ్ ఎమ్యునిషన్ బార్జ్ అనేది క్షిపణులు, మందుగుండు సామాగ్రి మరియు ఇతర కీలకమైన సామాగ్రిని భారత నౌకాదళానికి రవాణా చేయడానికి మరియు నిల్వ చేయడానికి రూపొందించబడిన ఒక ప్రత్యేకమైన నౌక.

## ఐఎన్ఎస్ శివాజీకి దివంగత వైస్ అడ్మిరల్ వీర చక్ర

- ✓ దివంగత వైస్ అడ్మిరల్ బెనోయ్ రాయ్‌కి ప్రదానం చేసిన ఒరిజినల్ ' వీర్ చక్ర'ను భారత నావికాదళం యొక్క ప్రధాన శిక్షణా సంస్థ ఐఎన్ఎస్ శివాజీకి అందుకుంది. 1971 భారతదేశం-పాకిస్తాన్ యుద్ధ సమయంలో దివంగత వైస్ అడ్మిరల్ బెనోయ్ రాయ్ చౌదరి తన సాహసోపేతమైన చర్యలకు గాను వీర చక్రను అందుకున్నారు. ఈ వేడుక డిసెంబర్ 18న పూణేకు దాదాపు 60 కిలోమీటర్ల దూరంలోని లోనావాలాలో జరిగింది.
- ✓ వీర్ చక్ర అనేది యుద్ధభూమిలో త్రివిధ దళాల సైనికుల శౌర్య చర్యలకు అందించే భారతీయ యుద్ధకాల సైనిక శౌర్య పురస్కారం. భారత నావికాదళానికి చెందిన ఏకైక సాంకేతిక అధికారి బెనోయ్ రాయ్ చౌదరి, ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. 1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలో బెనోయ్ రాయ్ ఐఎన్ఎస్ విక్రాంత్‌లో ఇంజనీర్ ఆఫీసర్‌గా ఉన్నాడు. ఆ సమయంలో విక్రాంత్ బాయిలర్‌లలో వచ్చిన సమస్యలను పరిష్కరించి భారత్ యుద్ధంలో గెలిచేలా సహాయం అందించారు.

## 'సమార్'వాయు రక్షణ క్షిపణి ప్రయోగం విజయవంతం

- ✓ భారత వైమానిక దళం 'సమార్' వాయు రక్షణ క్షిపణి వ్యవస్థను ఎక్సర్‌సైజ్ అస్త్రశక్తి వద్ద విజయవంతంగా పరీక్షించింది. భారత వైమానికదళం దాని పాత రష్యన్-మూలం ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థలను ఉపయోగించడం ద్వారా ఈ కొత్త సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ ఫర్ అష్యూర్డ్ రిటాలియేషన్ (SAMAR) వైమానిక రక్షణ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేసింది. దీనికి సంబంధించిన ఫైరింగ్ ట్రయల్స్, ఆంధ్రప్రదేశ్ సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో నిర్వహించిన అస్త్రశక్తి వ్యాయామంలో ఇటీవలే నిర్వహించింది.



- ✓ ఈ క్షిపణి వ్యవస్థ పనితీరును ఇప్పటికే చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి, వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ వీక్షించారు. అయితే ఏరో ఇండియా సమర్-1 సిస్టమ్ ప్రారంభ ఉత్పత్తిలోకి ప్రవేశించడానికి ముందు 17 రౌండ్ల టెస్ట్ ఫైరింగ్‌ను ఇప్పటికే పూర్తి చేసినట్లు ధృవీకరించింది.

- ✓ సమార్ వ్యవస్థ 12-కిలోమీటర్ల పరిధిని కవర్ చేసే లక్ష్యంతో రూపొందించబడింది. ఇది యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు మరియు మానవరహిత వైమానిక వాహనాలు వంటి తక్కువ-ఎగిరే వైమానిక లక్ష్యాలను ఛేదించేందుకు సహాయపడుతుంది. స్క్రామ్ ఫ్లోటెక్ ఇండస్ట్రీస్ మరియు యమజాకి డెంకి అనే రెండు భారతీయ ప్రైవేట్ రంగ సంస్థల సహకారంతో ఈ సమర్ వ్యవస్థ రూపొందించబడింది.

## ఎక్సర్‌సైజ్ అస్త్రశక్తిలో ఆకాష్ క్షిపణి ప్రదర్శన

- ✓ 25 కిలోమీటర్ల పరిధిలో ఏకకాలంలో నాలుగు వైమానిక లక్ష్యాలను ఛేదించగల ఆకాశ్ క్షిపణి వ్యవస్థ సామర్థ్యాన్ని ప్రదర్శించినాట్లు రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ప్రకటించింది.



డిసెంబర్ 17న ఆంధ్రప్రదేశ్ సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో నిర్వహించిన అస్త్రశక్తి వ్యాయామంలో ఈ ప్రదర్శన నిర్వహించింది. దీనితో ఒకే ఫైరింగ్ యూనిట్‌ని ఉపయోగించి ఇంత సామర్థ్యాన్ని కలిగి ఉన్న మొదటి దేశంగా భారత్ అవతరించింది.
- ✓ ఆకాష్ అనేది డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ద్వారా అభివృద్ధి చేయబడిన మధ్యస్థ-శ్రేణి మొబైల్ ల్యాండ్-ఎయిర్ క్షిపణి వ్యవస్థ. దీనిని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. అలానే దీని యొక్క నిఘా మరియు అగ్ని నియంత్రణ రాడార్, టాక్టికల్ కంట్రోల్ మరియు కమాండ్ సెంటర్ మరియు క్షిపణి లాంచర్‌లను భారత్ ఎలక్ట్రానిక్స్, టాటా పవర్ స్ట్రాటజిక్ ఇంజనీరింగ్ డివిజన్ మరియు లార్సెన్ & టూబ్రో అభివృద్ధి చేశాయి.
- ✓ ఆకాష్ క్షిపణి వ్యవస్థ 45 కిమీ దూరంలో ఉన్న విమానాలను లక్ష్యంగా చేసుకోగలదు. ఇది యుద్ధ విమానాలు, క్రూయిజ్ క్షిపణులు మరియు గాలి నుండి ఉపరితల క్షిపణులు అలాగే బాలిస్టిక్ క్షిపణులు వంటి వైమానిక లక్ష్యాలను తటస్థీకరించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది ప్రస్తుతం భారత సైన్యం మరియు భారత వైమానిక దళం సేవలో ఉంది.

## నౌకాదళంలోకి ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్ ఐఎన్ఎస్ తార్ముగ్లీ

- ✓ తూర్పు నౌకాదళ కమాండ్ ఆధ్వర్యంలో విశాఖపట్నం నేవల్ డాక్ యార్డ్ నుండి ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్ అయిన ఐఎన్ఎస్ తార్ముగ్లీ భారత నావికాదళంకు అందించబడింది. డిసెంబర్ 14న జరిగిన ఈ వేడుకకు మెటీరియల్ చీఫ్ వైస్ అడ్మిరల్ సందీప్ నైతానీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
- ✓ ఐఎన్ఎస్ తార్ముగ్లీ ఇప్పటి వరకు మూడు పేర్లతో రెండు దేశాల నౌకాదళాలలో సేవలు అందించింది. ఇది మొదట ఇండియన్ నేవీలో ట్రింకాట్ క్లాస్ షిప్ అయిన ఐఎన్ఎస్ తిల్లాన్‌చాంగ్‌గా కమీషన్ చేయబడింది. దీనిని 2006 లో దౌత్యపరమైన విస్తరణలో భాగంగా మాల్దీవుల జాతీయ రక్షణ దళానికి బహుమతిగా అందించారు. వారు దీనిని ఎంసీజిఎస్ హురావీ పేరుతో 2023 వరకు ఉపయోగించారు. అయితే ఈ ఏడాది మొదటిలో ఇది తిరిగి ఇండియాకు బదిలీ చేయబడింది.

## ముంబై తీరంలో ద్వైవార్షిక 'ప్రస్థాన్' వ్యాయామం

- ✓ భారత నావికాదళం ముంబైలోని వెస్టన్ ఆఫ్‌షోర్ డెవలప్‌మెంట్ ఏరియాలో ప్రస్థాన్ అనే ద్వైవార్షిక వ్యాయామంను డిసెంబర్ 8న నిర్వహించింది. ఈ వ్యాయామం ఆఫ్‌షోర్ ఆయిల్ ప్లాట్‌ఫారమ్‌ల వద్ద తలెత్తే వివిధ ఆకస్మిక పరిస్థితులకు నేవీ ప్రతిస్పందనను పరీక్షించడం మరియు మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వ్యాయామంలో భారత నౌకాదళంతో పాటుగా భారత వైమానిక దళం, ఇండియన్ కోస్ట్ గార్డ్, ఓఎన్జీసీ, పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ మరియు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ నుండి అనేక నౌకలు మరియు హెలికాప్టర్లు పాల్గొన్నాయి.
- ✓ మహారాష్ట్ర పోలీస్, కస్టమ్స్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్, ముంబై పోర్ట్ అథారిటీలు, జెఎన్ పోర్ట్ అథారిటీలు, ఇండియా మెట్ డిపార్ట్ మెంట్ మరియు ఇతర సంబంధిత రాష్ట్ర మరియు సెంట్రల్ సివిల్ ఏజెన్సీలకు చెందిన సిబ్బంది కూడా ఈ వ్యాయామంలో పాల్గొన్నారు. హటాత్తు సముద్రప్రమాదాల సమయంలో ఆకస్మిక పరిస్థితులను పరిష్కరించడానికి సంబంధిత అన్ని ఏజెన్సీల సంసిద్ధతను అంచనా వేయడానికి ఈ వ్యాయామం నిర్వహించారు.

## విన్‌బాక్స్ సైనిక వ్యాయామం 2023

- ✓ భారత్-వియత్నాం సైన్యం మధ్య జరిగే వార్షిక సైనిక వ్యాయామం విన్‌బాక్స్, డిసెంబర్ 11 నుండి 21 వరకు వియత్నాంలోని హనోయిలో నిర్వహించబడింది
- ✓ ఈ వ్యాయామంలో **బెంగాల్ ఇంజనీర్ రెజిమెంట్** నుండి 39 మంది సిబ్బంది మరియు ఆర్మీ మెడికల్ కార్ప్స్ యొక్క ఆరుగురు సిబ్బంది భారత బృందంకు నాయకత్వం వహించారు. వియత్నాం పీపుల్స్ ఆర్మీ కంటెంజెంట్ నుండి 45 మంది సిబ్బంది ప్రాతినిధ్యం వహించారు.
- ✓ విన్‌బాక్స్ 2018 నుండి నిర్వహిస్తున్నారు. మొదటి ఎడిషన్ మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో నిర్వహించబడింది. ఇది భారతదేశం మరియు వియత్నాంలో ప్రత్యామ్నాయంగా నిర్వహించబడే వార్షిక శిక్షణ కార్యక్రమం. చివరి ఎడిషన్ ఆగస్టు 2022లో చండీమందిర్ మిలిటరీ స్టేషన్‌లో నిర్వహించబడింది.




## ప్రపంచ బ్లిట్జ్ ఛాంప్ మాగ్నస్ కార్ల్‌సన్

✓ డిఫెండింగ్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) ప్రపంచ బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌ను నిలబెట్టుకున్నాడు. 21 రౌండ్ల నుంచి 16 పాయింట్లతో అతడు విజేతగా నిలిచాడు. ఇప్పటికే ర్యాపిడ్ టైటిల్‌ను నిలబెట్టుకున్న కార్ల్‌సన్ ఇప్పుడు బ్లిట్జ్ టైటిల్‌తో ప్రపంచ చెస్‌లో తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకున్నాడు. మహిళల విభాగంలో రష్యాకు చెందిన వాలెంటినా గునినా టైటిల్ను గెలుచుకుంది. ఆమె 17 రౌండ్ల నుంచి 14 పాయింట్లు సాధించింది..



✓ మరోవైపు భారత క్రీడాకారులు నిరాశపరిచారు. అర్జున్ ఇరిగేశి (14 పాయింట్లు) ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అరవింద్ (13.5) 14వ స్థానంలో, ప్రజ్ఞానంద (12.5) 28వ స్థానంలో, గుకేశ్ (12.5) 38వ స్థానంలో నిలిచారు. 11 పాయింట్లు సాధించిన ద్రోణవల్లి హారిక ఏడో స్థానంతో ముగించింది. కోనేరు హంపి 10.5 పాయింట్లతో 17వ స్థానంలో నిలిచింది.

✓ ఒకే ఏడాదిలో చెస్ టోర్నీల్లో సాధించిన పాయింట్ల ఆధారంగా గుకేశ్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించాడు. ఎనిమిది మంది తలపడే ఈ టోర్నీ చరిత్రలో తొలిసారి ముగ్గురు భారతీయులు ఒకేసారి ఆడనున్నారు. ప్రజ్ఞానంద, విదిత్ ఇప్పటికే అర్హత పొందారు.

## 146 ఏళ్ల క్రికెట్ చరిత్రలో కోహ్లి అరుదైన రికార్డు

✓ దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లి (76) ఓ అరుదైన రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. 146 ఏళ్ల క్రికెట్ చరిత్రలో ఏడు భిన్నమైన క్యాలెండర్ ఇయర్స్‌లో 2000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేసుకున్న తొలి బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో మొదటి ఇన్నింగ్స్‌లో 32, రెండో ఇన్నింగ్స్‌లో 76 చేసిన విరాట్ ఈ క్రమంలో 2 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఈ ఏడాది టెస్టుల్లో 671, వన్డేల్లో 1377 పరుగులు స్కోరు చేసిన అతడు మొత్తం మీద 2048 పరుగులు సాధించాడు. ఈ సీజన్లో కోహ్లి అంతర్జాతీయ టీ20లు ఆడలేదు. ఇంతకుముందు 2019, 2018, 2017, 2016, 2014, 2012 సంవత్సరాల్లోనూ అతడు 2000పైన అంతర్జాతీయ పరుగులు సాధించాడు. 2017లో అత్యధికంగా 2818 పరుగులు చేశాడు.



## ప్రపంచ ర్యాపిడ్ చెస్‌లో కోనేరు హంపికి రజతం, టైటిల్ విజేత అనస్తాసియా బొద్నారుక్ (రష్యా)

✓ భారత చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి ప్రపంచ ర్యాపిడ్ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో రజతం సొంతం చేసుకుంది. ఆఖరిదైన 11వ రౌండ్లో కేథరీనా (రష్యా)పై హంపి విజయం సాధించింది. తెల్ల పావులతో ఆడిన ఆమె గొప్ప నైపుణ్యాలు ప్రదర్శించింది. ప్రత్యర్థికి మించి ఎత్తులు వేయడంతో దూకుడుతో సాగింది. 47 ఎత్తుల్లో గేమ్ ముగించింది. దీంతో తన స్కోరు 8.5కు చేరింది. మరోవైపు టింజీతో గేమ్‌ను డ్రా చేసుకున్న అనస్తాసియా బొద్నారుక్ (రష్యా) కూడా 8.5 పాయింట్లతో నిలిచింది. దీంతో హంపి, అనస్తాసియాలో విజేతను నిర్ణయించేందుకు టైబ్రేక్ నిర్వహించారు. ఇందులో తొలి గేమ్‌లో హంపి గెలిచింది. రెండో గేమ్‌లో అనస్తేషియా విజయం సాధించింది. చివరకు నాలుగో గేమ్‌లో హంపి నెగ్గలేకపోయింది. దీంతో టైబ్రేక్‌లో 1.5-2.5తో ఓడి, టైటిల్‌ను అనస్తాసియాకు కోల్పోవాల్సి వచ్చింది. మిగతా తెలుగమ్మాయిల్లో సాహితి వర్షిణి (7.5) 13వ, ప్రియాంక నూతక్కి (7) 22వ, ద్రోణవల్లి హారిక (6) 48వ స్థానాల్లో నిలిచారు.



✓ ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో హంపి సాధించిన పతకాలు (3): 2012లో కాంస్యం, 2019లో స్వర్ణం, 2023లో రజతం.

### కార్ల్‌సన్‌దే టైటిల్

✓ ప్రపంచ నంబర్ వన్, దిగ్గజ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్ ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. 13 రౌండ్ల నుంచి 10 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నాడు. చివరి రౌండ్లో ప్రజ్ఞానందతో గేమ్‌ను అతను డ్రాగా ముగించాడు. కార్ల్‌సన్‌కు ఇది అయిదో ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ కావడం విశేషం. అన్ని విభాగాల్లోనూ కలిపి ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడం అతనికిది పదహారో సారి. బ్లిట్జ్‌లో ఆరు సార్లు, క్లాసికల్‌లో అయిదు సార్లు టైటిల్ దక్కించుకున్నాడు. ఒక్కో టైటిల్‌ను కనీసం అయిదుసార్లు గెలిచిన తొలి ఆటగాడిగా కార్ల్‌సన్ రికార్డు సృష్టించాడు. భారత ఆటగాళ్లలో విదిత్ గుజరాతి (9) 4వ, ప్రజ్ఞానంద (9) 8వ, అర్జున్ ఇరిగేశి (8.5) 15వ స్థానాలు సాధించారు.

### హాకీ ప్రపంచకప్ కెప్టెన్‌గా ఆంధ్ర క్రీడాకారిణి రజని

✓ హాకీ ఫైవ్స్ ప్రపంచకప్‌లో పాల్గొనే భారత మహిళల జట్టుకు ఆంధ్రప్రదేశ్ అమ్మాయి, సీనియర్ గోల్‌కీపర్ ఎతిమరపు రజని సారథ్యం వహించనుంది. పురుషుల జట్టుకు సిమ్రన్‌జీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని హాకీ ఇండియా (హెచ్ఐ) ప్రకటించింది. మహిమా చౌదరి (వైస్ కెప్టెన్), బన్సారి సోలంకి, అక్షత అబాసో, జ్యోతి ఛెత్రి, మరియానా కుజుర్, ముంతాజ్‌ఖాన్, అజ్మినా కుజుర్, రుతుజ పిసల్, దీపిక సోరెంగ్‌లు మహిళల జట్టుకు ఎంపికయ్యారు. నమీబియా, పోలెండ్, అమెరికాతో కలిసి భారత జట్టు గ్రూపు–సిలో ఉంది. పురుషుల జట్టులో మన్‌దీప్ మోర్ (వైస్ కెప్టెన్), సూరజ్ కార్కేరా, ప్రశాంత్‌కుమార్ చౌహాన్, మన్‌జీత్, మహ్మద్ రహీల్ మౌసీన్, మణిందర్ సింగ్, పవన్ రాజ్‌భర్, గుర్‌జోత్ సింగ్, ఉత్తమ్ సింగ్ స్థానం సంపాదించారు. గ్రూపు–బిలో భారత్, ఈజిప్ట్, జమైకా, స్విట్జర్లాండ్ ఉన్నాయి. ఒమన్‌లోని మస్కట్‌లో జనవరి 24 నుంచి 27 వరకు మహిళలు, 28 నుంచి 31 వరకు పురుషుల టోర్నీలు జరుగుతాయి.

### ఆసియా యూత్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారిణి కీర్తికి కాంస్యం

✓ ఆసియా యూత్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారిణి గంటా కీర్తి కాంస్య పతకం నెగ్గింది. దుబాయ్‌లో జరిగిన టోర్నీలో వ్యక్తిగత విభాగంలో ఈ పతకం గెలిచిన కీర్తి టీమ్ కేటగిరీల్లోనూ రాణించింది. అండర్–16 బాలికల క్లాసిక్ టీమ్‌లో స్వర్ణం, బ్లిట్జ్ టీమ్‌లో రజతం, ర్యాపిడ్ టీమ్‌లో బంగారు పతకాలు సాధించింది.



### జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా చిరాగ్ సేన్

✓ సీనియర్ జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో చిరాగ్ సేన్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో చిరాగ్ 21–14, 13–21, 21–9తో తరుణ్‌పై విజయం సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్న లక్ష్యసేన్‌కు చిరాగ్ అన్న. 2017, 2019లలో రన్నరప్‌గా నిలిచిన లక్ష్య.. జాతీయ టైటిల్ గెలుచుకోలేకపోయాడు. చిరాగ్ మాత్రం జాతీయ టైటిల్‌తో సత్తాచాటాడు. "టైటిల్ ఆలస్యంగా వచ్చింది. కాని ఎట్టకేలకు గెలిచినందుకు ఆనందంగా ఉంది. గత 3–4 నెలల నుంచి బాగా ఆడుతున్నా. ఇప్పుడు పురోగతి లభించింది. అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలని భావిస్తున్నా" అని చిరాగ్ తెలిపాడు.



### ఉత్తమ ఆటగాడిగా హార్దిక్ సింగ్

✓ భారత హాకీ క్రీడాకారులు హార్దిక్ సింగ్, సవిత పునియా అత్యున్నత అవార్డులు అందుకున్నారు. 2023 సీజన్‌కు గాను ఉత్తమ ఆటగాడిగా హార్దిక్, ఉత్తమ మహిళా గోల్ కీపర్‌గా సవితను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ఎంపిక చేసింది. వరుసగా మూడో ఏడాది సవితను ఈ అవార్డు వరించడం విశేషం. నిపుణుల బృందం, జాతీయ సమాఖ్యలు, కెప్టెన్లు, కోచ్‌లు, అభిమానులు, మీడియా ప్రతినిధులు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. 114 మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన మిడ్ ఫీల్డర్ హార్దిక్ 9 గోల్స్ సాధించాడు. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత జట్టులో హార్దిక్ సభ్యుడు. 33 ఏళ్ల సవిత భారత్ తరఫున 266 మ్యాచ్‌ల్లో బరిలో దిగింది. సవిత నాయకత్వంలో భారత మహిళల జట్టు నిలకడగా రాణిస్తుంది. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ నాలుగో స్థానం సాధించింది. కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో కాంస్య పతకాలు నెగ్గింది.



### బంగ్లాదే అండర్-19 ఆసియాకప్

✓ అండర్–19 ఆసియాకప్‌ను బంగ్లాదేశ్ సొంతం చేసుకుంది. ఈ మేరకు జరిగిన ఫైనల్లో 195 పరుగుల భారీ తేడాతో యూఏఈని ఓడించింది. మొదట బంగ్లా 50 ఓవర్లలో 8 వికెట్లకు 282 పరుగులు చేసింది. – అషిఖర్ రెహ్మాన్ (129) సెంచరీ సాధించాడు. రిజ్వాన్ (60), అరిఫుల్ ఇస్లాం (50) కూడా

రాణించారు. ఛేదనలో బంగ్లా బౌలర్ల ధాటికి యూఏఈ 24.5 ఓవర్లలో 87 పరుగులకే ఆలౌటైంది. ధ్రువ్ పరాశర్ (25 నాటౌట్) టాప్ స్కోరర్. అండర్-19 ఆసియా కప్పును భారత్ అత్యధికంగా 8 సార్లు సొంతం చేసుకుంది.

## తొలిసారి 'విజయ్ హజారే ట్రోఫీ' కైవసం చేసుకున్న హరియాణా

✓ దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ-2023 టైటిల్‌ను తొలిసారి హరియాణా గెలుచుకుంది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్‌ను ఓడించి చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో హర్యానాకు చెందిన సుమిత్ కుమార్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.



✓ కాగా టోర్నీలో అత్యధిక పరుగులు చండీగఢ్ జట్టుకు చెందిన అర్సలాన్ ఖాన్ (508) చేయగా, తమిళనాడు జట్టుకు చెందిన వరుణ్ చక్రవర్తి (19) అత్యధిక వికెట్లు పడగొట్టాడు.

✓ **విజయ్ హజారే ట్రోఫీ:** విజయ్ హజారే ట్రోఫీని రంజీ వన్డే ట్రోఫీ అంటారు. ఈ టోర్నమెంట్ 2002-03 సంవత్సరంలో పరిమిత ఓవర్ల టోర్నమెంట్‌గా ప్రారంభమైంది. 2007లో, ప్రసిద్ధ భారతీయ క్రికెటర్ విజయ్ హజారే గౌరవార్థం దీని పేరు మార్చబడింది. ఈ పోటీని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (BCCI) నిర్వహిస్తుంది.

✓ అత్యంత విజయవంతమైన జట్టు –తమిళనాడు (5 టైటిల్స్),2022 విజేత – సౌరాష్ట్ర.

| ఇతర దేశీయ క్రికెట్ టోర్నమెంట్లు |
| --- |
| **రంజీ ట్రోఫీ:** ప్రారంభం -1934, 2022-23 విజేత – సౌరాష్ట్ర, అత్యంత విజయవంతమైన జట్టు - ముంబై (41 సార్లు). |
| **దులీప్ ట్రోఫీ:** నవనగర్‌కు చెందిన కుమార్ శ్రీ దిలీప్ సింగ్ జీ పేరు పెట్టబడిన దులీప్ ట్రోఫీ అనేది దేశీయ ఫస్ట్-క్లాస్ క్రికెట్ పోటీ, దీని మొదటి ఎడిషన్ 1961–62లో జరిగింది. 2023 విజేత - సౌత్ జోన్ |
| **దేవధర్ ట్రోఫీ:** దేవధర్ ట్రోఫీ అనేది ఏటా నిర్వహించబడే దేశీయ యాభై ఓవర్ల పోటీ, ఇది 1973-74లో ప్రారంభమైంది. 2023 విజేత - సౌత్ జోన్ |
| **ఇరానియన్ కప్:** రంజీ ట్రోఫీ ఛాంపియన్‌షిప్ 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 1959–60లో ఇరానీ కప్‌ను ప్రవేశపెట్టారు. ఈ పోటీ రెస్ట్ ఆఫ్ ఇండియా మరియు రంజీ ట్రోఫీ విజేతల మధ్య జరుగుతుంది. 2023 విజేత – రెస్ట్ ఆఫ్ ఇండియా |
| **సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ:** ప్రారంభం - 2006-07. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ అనేది దేశీయ ట్వంటీ20 క్రికెట్ టోర్నమెంట్. 2023 విజేత - పంజాబ్ |

## పారా బ్యాడ్మింటన్ అంతర్జాతీయ టోర్నీలో మాన్సి జోడీకి స్వర్ణం

✓ దుబాయ్ పారా బ్యాడ్మింటన్ అంతర్జాతీయ టోర్నీలో భారత జోడీ మాన్సి జోషి - తులసిమతి మురుగేశన్ స్వర్ణ పతకం సాధించారు. మహిళల డబుల్స్ ఎస్‌ఎల్3 - ఎస్‌యూ5 విభాగం ఫైనల్లో మాన్సి - తులసిమతి జోడీ 15-21, 21-14, 21-6తో లీని ఓక్టిలా - ఖలిమతస్ సాదియా (ఇండోనేసియా) జంటపై విజయం సాధించింది. టోక్యో పారాలింపిక్ ఛాంపియన్ ప్రమోద్ భగత్ రెండు రజత పతకాలు నెగ్గాడు. మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌ఎల్3 - ఎస్‌యూ5 ఫైనల్లో నితేష్‌కుమార్ - తులసిమతి జోడీ కాంస్య పతకం సాధించింది. పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్4లో సుహాస్ యతిరాజ్ రజతం గెలవగా సుకాంత్ కదమ్, తరుణ్ కాంస్యాలు నెగ్గారు. మహిళల సింగిల్స్ ఎస్‌ఎల్4లో పలక్ కోహ్లి కాంస్యం గెలుపొందింది.



## ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా స్టార్క్

✓ ఐపీఎల్ మినీ వేలంలో రూ.24.75 కోట్లు దక్కించుకున్న ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. అతని కోసం మొదట ఢిల్లీ క్యాపిటల్స్, ముంబయి ఇండియన్స్ హోరాహోరీగా తలపడ్డాయి. రూ.9.8 కోట్ల దగ్గర కోల్‌కతా నైట్‌రైడర్స్ రేసులోకి వచ్చింది. ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో కమిన్స్ రికార్డును స్టార్క్ దాటేశాడు. ఈ మేరకు కోల్‌కతా చివరకు పంతం నెగ్గించుకుంది. అంతకుముందు ఆస్ట్రేలియా కెప్టెన్ కమిన్స్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏకంగా రూ.20.50 కోట్లు చెల్లించింది. బెంగళూరు, సన్‌రైజర్స్ కమిన్స్ కోసం పట్టుబట్టడంతో సామ్ కరన్ (2023లో పంజాబ్ కింగ్స్ రూ.18.50 కోట్లు) రికార్డు బద్దలైంది. చివరకు సన్ రైజర్స్ పైచేయి సాధించింది. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డరిల్ మిచెల్ ్ (కనీస ధర రూ.కోటి) కోసం చెన్నై రూ.14 కోట్లు ఖర్చు పెట్టింది. నిరుడు రాజస్థాన్ తరఫున మిచెల్ రెండు మ్యాచ్‌లాడాడు. మొత్తం 72 మంది ఆటగాళ్లను జట్లు కొనుగోలు చేశాయి. ఇందులో 30 మంది విదేశీ ఆటగాళ్లు. 10 ఫ్రాంఛైజీలు కలిపి రూ.230.45 కోట్లు ఖర్చు చేశాయి. ప్రపంచకప్ ఫైనల్లో శతకంతో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన హెడ్‌ను సన్‌రైజర్స్ రూ.6.8 కోట్లకు సొంతం చేసుకుంది.



- ✓ ఐపీఎల్‌లో అత్యధిక ధర పలికిన టాప్–5 ప్లేయర్స్: ‣ స్టార్క్ – రూ.24.75 కోట్లు ‣ కమిన్స్ – రూ.20.50 కోట్లు ‣ సామ్ కరన్ – రూ.18.50 కోట్లు ‣ కామెరూన్ గ్రీన్ – రూ.17.50 కోట్లు ‣ బెన్ స్టోక్స్ – రూ.16.25 కోట్లు.

## జకో, సబలెంకలకు ఐటీఎఫ్ అవార్డులు

- ✓ ఐటీఎఫ్ ప్రపంచ ఛాంపియన్ – 2023 అవార్డులను సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్, బెలారస్ అమ్మాయి అర్యానా సబలెంక గెలుచుకున్నారు. రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ఈ సీజన్‌ను నంబర్‌వన్‌గా ముగించిన జకోవిచ్ ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, యుఎస్ ఓపెన్‌లను గెలుచుకున్నాడు. వింబుల్డన్‌లోనూ ఫైనల్ చేరినా అల్కరాస్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచాడు. ఈ సంవత్సరం జయాపజయాల రికార్డు 56–7గా ఉన్న జకో.. మొత్తం ఏడు టైటిళ్లు ఖాతాలో వేసుకున్నాడు. ఐటీఎఫ్ ప్రపంచ ఛాంపియన్ అవార్డు సాధించడం నొవాక్‌కు రికార్డు స్థాయిలో ఇది ఎనిమిదోసారి. మహిళల విభాగంలో సబలెంక తొలిసారి ఈ పురస్కారాన్ని అందుకుంది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచి గ్రాండ్‌స్లామ్ బోణీ కొట్టిన ఈ బెలారస్ అమ్మాయి యుఎస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది. ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో సెమీఫైనల్ చేరింది. సెప్టెంబర్‌లో మొదటిసారి డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ అయిన సబలెంక ఇటీవలే ఇగా స్వైటెక్‌కు ఆ ర్యాంకు కోల్పోయింది.



- ✓ ఇతర ఐటీఎఫ్ ప్రపంచ ఛాంపియన్ అవార్డులలో మహిళల డబుల్స్ నుండి స్టార్మ్ హంటర్ మరియు ఎలిస్ మెర్టెన్స్, పురుషుల డబుల్స్ నుండి రాజీవ్ రామ్ మరియు జో సాలిస్‌బరీ, మహిళల వీల్ చైర్ విభాగంలో డైడ్ డి గ్రూట్, పురుషుల వీల్ చైర్ విభాగంలో ఆల్ఫీ హెవెట్, క్వాడ్ వీల్ చైర్ విభాగంలో నీల్స్ వింక్ మరియు అలీనాలు విజేతలుగా నిలిచారు.

## టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో లియాండర్ పేస్,విజయ్ అమృత్‌రాజ్

- ✓ భారత టెన్నిస్ దిగ్గజం, డబుల్స్ మాజీ నంబర్‌వన్ లియాండర్ పేస్ అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నాడు. మరోవైపు ప్రసారదారు, ప్రమోటర్ విజయ్ అమృత్‌రాజ్ కూడా ఈ జాబితాలో చేరాడు. ఆసియా నుంచి ఈ ఘనత సాధించిన తొలి ఇద్దరు పురుషులు వీళ్లే కావడం విశేషం. టెన్నిస్‌లోనే అత్యున్నతమైందిగా భావించే ఈ హాల్ ఆఫ్ ఫేమ్‌లో ప్రముఖ పాత్రికేయుడు, రచయిత రిచర్డ్ ఎవాన్స్ (యూకే)కు కూడా స్థానం దక్కింది. ఆటగాళ్ల జాబితాలో పేస్‌కు, ఆటపై ప్రభావం చూపినందుకు గాను సహాయక విభాగంలో విజయ్, ఎవాన్స్‌కు అవకాశం వచ్చింది. 2024 హాల్ ఆఫ్ ఫేమ్ వర్గంగా పరిగణించే ఈ ముగ్గురిని అధికారికంగా జరిగే కార్యక్రమంలో ఈ జాబితాలో చేరుస్తారు. ఇప్పటివరకూ 27 దేశాల నుంచి 264 మంది ఇందులో ఉన్నారు. ఇందులో చోటు దక్కించుకున్న 28వ దేశంగా భారత్ నిలిచింది. మూడు దశాబ్దాల కెరీర్‌లో పేస్ పురుషుల డబుల్స్‌లో 8, మిక్స్‌డ్ డబుల్స్‌లో 10 టైటిళ్లు సాధించాడు. వరుసగా ఏడు ఒలింపిక్స్ ఆడాడు. టెన్నిస్‌లో ఒలింపిక్ పతకం (1996లో సింగిల్స్ కాంస్యం) సాధించిన ఏకైక భారత ఆటగాడు అతనే.



## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో సూర్యకు అగ్రస్థానం

- ✓ భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పొట్టి ఫార్మాట్‌లో నంబర్‌వన్ ర్యాంకును మరింత సుస్థిరం చేసుకున్నాడు. సొంతగడ్డపై ఆస్ట్రేలియా, తాజాగా దక్షిణాఫ్రికాపై నిలకడగా రాణిస్తున్న సూర్య ఐసీసీ ప్రకటించిన బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 865 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. మహ్మద్ రిజ్వాన్ (787 – పాకిస్థాన్) రెండు, మార్‌క్రమ్ (758 – దక్షిణాఫ్రికా) మూడు స్థానాల్లో కొనసాగుతున్నారు. రుతురాజ్ గైక్వాడ్ (681) ఏడో ర్యాంకులో ఉన్నాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు. అక్షర్ పటేల్ 13, అర్ష్‌దీప్ సింగ్ 23వ స్థానాల్లో ఉన్నారు.



### నంబర్‌వన్ బౌలర్‌గా బిష్ణోయ్

- ✓ భారత యువ లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్ టీ20 క్రికెట్లో నంబర్‌వన్ బౌలర్‌గా అవతరించాడు. ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డును అందుకున్న 23 ఏళ్ల బిష్ణోయ్ అయిదు స్థానాలు ఎగబాకాడు. ఆసీస్‌పై అయిదు మ్యాచ్‌ల్లో 9 వికెట్లు పడగొట్టిన అతడు ప్రస్తుతం 699 పాయింట్లతో ఉన్నాడు. అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (692)ను రెండో స్థానానికి నెట్టాడు. శ్రీలంక స్పిన్నర్ వహిందు హసరంగ, ఇంగ్లాండ్‌కు చెందిన అదిల్ రషీద్ 679 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. భారత్ నుంచి బిష్ణోయ్ మాత్రమే టాప్–10 బౌలర్ల జాబితాలో ఉన్నాడు. అక్షర్ పటేల్ 18వ స్థానంలో నిలిచాడు .



## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో శుభ్‌మన్‌కు రెండో స్థానం

✓ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ రెండో స్థానానికి పడిపోయాడు. పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ అజామ్ అగ్రస్థానానికి ఎగబాకాడు. వన్డే ప్రపంచకప్ సమయంలో శుభ్‌మన్ తొలిసారి ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానానికి చేరిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ వన్డే ఆడని అతడు తాజా ర్యాంకింగ్స్‌లో 810 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. బాబర్ (824) తిరిగి నంబర్‌వన్ ర్యాంకును దక్కించుకున్నాడు. కోహ్లి మూడు, రోహిత్ నాలుగో స్థానాల్లో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో కేశవ్ మహరాజ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సిరాజ్ మూడు, బుమ్రా అయిదో స్థానాల్లో ఉన్నారు.

## శ్రీలంక సీనియర్ క్రికెట్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా ఉపుల్ తరంగ

✓ శ్రీలంక సీనియర్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా మాజీ ఆటగాడు ఉపుల్ తరంగ ఎంపికయ్యాడు. శ్రీలంక క్రికెట్ సిఫార్సులను ఆమోదించిన క్రీడల మంత్రి హరిన్ ఫెర్నాండో జాతీయ సెలెక్షన్ కమిటీకి తరంగను ఛైర్మన్‌గా నియమించారు. అజంత మెండిస్, ఇండిక డి శరమ్, తరంగ పరణవితన, దిల్రువాన్ పెరీర సెలెక్టర్లుగా ఎంపికయ్యారు.

## ఐపీఎల్ బ్రాండ్ విలువ రూ.83 వేల కోట్లు

✓ ఐపీఎల్ మరో ఘనత సొంతం చేసుకుంది. 10 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువను దాటి డెకాకార్న్ హోదాను దక్కించుకుంది. ప్రస్తుతం ఐపీఎల్ బ్రాండ్ విలువ 10.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.83,353 కోట్లు)గా ఉంది. 2022 (8.4 బిలియన్ డాలర్లు)తో పోలిస్తే ఆ విలువ 28 శాతం పెరిగింది. ఇక ఐపీఎల్ ఆరంభమైన 2008తో పోలిస్తే ఏకంగా 433 శాతం వృద్ధి ఉంది. బ్రాండ్ విలువను లెక్కగట్టే సంస్థ బ్రాండ్ ఫినాన్స్ రిపోర్ట్ ఈ నివేదికను వెల్లడించింది. మీడియా హక్కుల కింద 6.2 బిలియన్ డాలర్లు (రూ.48,390 కోట్లు) రావడం, రెండు ఫ్రాంఛైజీలు కొత్తగా చేరడం, కొవిడ్ తర్వాత స్టేడియాలు పూర్తిగా నిండటం తదితర కారణాలతో బ్రాండ్ విలువ పెరిగిందని నివేదిక పేర్కొంది. ఇక ఫ్రాంఛైజీల విషయానికి వస్తే ముంబయి ఇండియన్స్ 87 మిలియన్ డాలర్లు (సుమారు రూ.725 కోట్లు), చెన్నై సూపర్ కింగ్స్ 81 మిలియన్ డాలర్లు (రూ.675 కోట్లు), కోల్‌కతా నైట్‌రైడర్స్ 78.6 మిలియన్ డాలర్లు (రూ.655 కోట్లు), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 69.8 మిలియన్ డాలర్లు (రూ.581 కోట్లు) వరుసగా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి.




## బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి జోడీకి రెండో స్థానం

✓ బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి రెండో స్థానాన్ని నిలబెట్టుకుంది. ఈ మేరకు ప్రకటించిన జాబితాలో పురుషుల డబుల్స్‌లో సాత్విక్ – చిరాగ్ జోడీ రెండో ర్యాంకు సాధించింది. పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్ 8, లక్ష్యసేన్ 16, కిదాంబి శ్రీకాంత్ 24వ స్థానాల్లో కొనసాగుతున్నారు. మహిళల సింగిల్స్‌లో పి.వి.సింధు 11వ ర్యాంకు సాధించింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్ – ట్రీసా జాలీ 19, అశ్విని పొన్నప్ప – తనీషా క్రాస్టో 24వ స్థానాల్లో నిలిచారు.



## డబ్ల్యూటీఏ ఉత్తమ క్రీడాకారిణిగా స్వైటెక్

✓ పోలెండ్ స్టార్ ఇగా స్వైటెక్ వరుసగా రెండో ఏడాది డబ్ల్యూటీఏ ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచింది. సెరెనా విలియమ్స్ తర్వాత ఇలా వరుసగా రెండేళ్లు ఈ అవార్డు అందుకున్న ఘనత ఆమెదే. 2012 – 15 మధ్య కాలంలో సెరెనా వరుసగా ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచింది. ఈ ఏడాది జయాపజయాల రికార్డు 68–11గా ఉన్న స్వైటెక్ ఆరు టైటిళ్లు ఖాతాలో వేసుకుంది. ఇందులో ఫ్రెంచ్ ఓపెన్ కూడా ఉంది. నవంబర్‌లో డబ్ల్యూటీఏ ఫైనల్స్ ట్రోఫీ గెలిచిన స్వైటెక్ సబలెంకను వెనక్కి నెట్టి నంబర్‌వన్ ర్యాంకును కూడా చేజిక్కించుకుంది. 2022 ఏప్రిల్ నుంచి అగ్రస్థానంలో ఉన్న ఈ పోలెండ్ అమ్మాయి ఈ ఏడాది సెప్టెంబర్‌లో సబలెంకకు ఈ ర్యాంకు కోల్పోయింది. కానీ నెల వ్యవధిలోనే మళ్లీ అగ్రస్థానాన్ని తిరిగి సొంతం చేసుకుంది.



## క్రికెట్‌కు అసద్ షఫీక్ వీడ్కోలు

✓ పాకిస్థాన్ టెస్టు బ్యాటర్ అసద్ షఫీక్ అన్ని రకాల క్రికెట్‌కు వీడ్కోలు చెప్పాడు. జాతీయ సెలక్టర్‌గా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)తో ఒప్పందం నేపథ్యంలో 37 ఏళ్ల అసద్ ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2010 నుంచి 2020 వరకు పాక్ టెస్టు జట్టు బ్యాటింగ్‌కు వెన్నెముకగా ఉన్న షఫీక్ 77 మ్యాచ్‌ల్లో 4660 పరుగులు చేశాడు. అతను 60 వన్డేలు, 10 టీ20లు కూడా ఆడాడు.

## డబ్ల్యూపీఎల్ కమిటీ అధ్యక్షుడిగా రోజర్ బిన్నీ

- ✓ మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) అభివృద్ధి కోసం బీసీసీఐ ఎనిమిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్నీ ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తాడు. బీసీసీఐ కార్యదర్శి జైషా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తాడు. అరుణ్ ధూమల్ (ఐపీఎల్ ఛైర్మన్), రాజీవ్ శుక్లా (బీసీసీఐ ఉపాధ్యక్షుడు), అశిష్ శేలర్ (బీసీసీఐ కోశాధికారి), దేవ్‌జిత్ సైకియా (బీసీసీఐ సంయుక్త కార్యదర్శి), మధుమతి లెలె, ప్రభ్‌తేజ్ భాటియా ఈ కమిటీలో సభ్యులు.

## ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో 17 పతకాలతో రెండవ స్థానంలో నిలిచిన భారత్

- ✓ అర్మేనియాలో జరిగిన ప్రపంచ జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో పాయల్, నిషా, ఆకాన్ష పసిడి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో మహిళల 52 కేజీల ఫైనల్లో నిషా 5–0తో ఫరినాజ్ (తజికిస్థాన్)ను చిత్తుచేయగా 70 కేజీల తుదిపోరులో ఆకాన్ష అంతే తేడాతో తైమజోవా (రష్యా)ను ఓడించింది. 48 కేజీల పసిడి సమరంలో హెజిన్ (అర్మేనియా)పై పాయల్ విజయం సాధించింది. సాహిల్ (75 కేజీ), హేమంత్ (80 కేజీల పైన), జతిన్ (54 కేజీ) విని (57 కేజీ), సృష్టి (63 కేజీ), మేఘ (80 కేజీ) తుది పోరులో ఓడి రజతాలు నెగ్గారు. 17 పతకాలతో (3 స్వర్ణ, 9 రజత, 5 కాంస్యాలు) భారత్ రెండో స్థానంతో టోర్నీని ముగించింది. రష్యా (7 స్వర్ణ, 3 రజత, 7 కాంస్యాలు) అగ్రస్థానాన్ని దక్కించుకుంది.

## బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రణయ్‌కి 8వ ర్యాంకు

- ✓ బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ షట్లర్ హెచ్.ఎస్ .ప్రణయ్ ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఈ మేరకు ప్రకటించిన జాబితాలో పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ 8, లక్ష్యసేన్ 17, కిదాంబి శ్రీకాంత్ 24, ప్రియాన్షు రజావత్ 30వ ర్యాంకులు సాధించారు. మహిళల సింగిల్స్ పి.వి.సింధు 12వ స్థానంలో నిలిచింది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి జోడీ రెండో ర్యాంకులో కొనసాగుతోంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్ – ట్రీసా జాలీ జంట 19వ స్థానంలో నిలిచింది.

## ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ 2024

- ✓ బీసీసీఐ 2024లో ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ (ఐఎస్పీఎల్) టెన్నిస్ బాల్ టీ10 టోర్నమెంట్ నిర్వహించేందుకు సన్నద్ధమవుతుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఆరు జట్లు మార్చి 2, 2024 నుండి మార్చి 9, 2024 వరకు మొత్తం 19 మ్యాచ్‌లు ముంబైలో ఆడనున్నాయి. ఈ టెన్నిస్–బాల్ క్రికెట్ పోటీ ప్రధానంగా వీధి క్రికెట్ ఆటగాళ్ల క్రీడా ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్నారు. ఈ ఈవెంట్ జాతీయ సరిహద్దులను దాటి, భవిష్యత్ క్రికెట్ సూపర్‌స్టార్‌ల అభివృద్ధికి మద్దతు ఇచ్చే ప్రపంచ వేదికగా మారనుంది.
- ✓ ఈ టోర్నమెంట్ రౌండ్ రాబిన్ ఫార్మెట్లో ప్రతి జట్టు ఒకదానికొకటి ఒకసారి ఆడతాయి. పాయింట్ టేబుల్ యందు మొదటి నాలుగు జట్లు ప్లేఆఫ్‌లకు అర్హత సాధిస్తాయి. ఇక్కడ మొదటి రెండు జట్లు ఒకదానితో ఒకటి క్వాలిఫయర్‌లో ఆడతాయి. రెండవ పోటీ మూడు మరియు నాల్గవ స్థానంలో ఉన్న జట్లు మధ్య జరుగుతుంది. వర్చువల్ క్వార్టర్–ఫైనల్‌లో మొదటి క్వాలిఫైయర్‌లో విజేత ఫైనల్ కు చేరుకుంటాడు, క్వాలిఫైయర్‌లో ఓడిన వారు ఎలిమినేటర్ మ్యాచులో గెలిచిన వారితో ఆడుతారు. ఇందులో విజయం పొందిన వారు తుదిపోరులో పోటీ పడతారు.
- ✓ ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఆరు జట్లు ఉంటాయి, ఒక్కొక్కటి ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా మరియు శ్రీనగర్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ ఫ్రాంఛైజీల యాజమాన్య హక్కులను సంబంధిత రాష్ట్రాలకు చెందిన సినిమా ప్రముఖులు సొంతం చేసుకున్నారు.

  ►ముంబై టైగర్స్: అమితాబ్ బచ్చన్ ►శ్రీనగర్ లయన్స్: అక్షయ్ కుమార్ ►హైదరాబాద్ స్ట్రైకర్స్: రామ్ చరణ్ ►చెన్నై సూపర్ కింగ్స్: సూర్య ►బెంగళూరు బ్లాస్టర్స్: హృతిక్ రోషన్ ►కోల్‌కతా వారియర్స్: సైఫ్ అలీ ఖాన్.

## ఎంఎస్ ధోనీ జెర్సీ నంబర్ 7 రిటైర్డ్

- ✓ టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీకి అరుదైన గౌరవం దక్కనుంది. అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో అతడు వాడిన జెర్సీని ఎవరికీ కేటాయించకూడదని బీసీసీఐ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 'ధోనీ జెర్సీ నంబర్ 7ను ఎవరూ వినియోగించవద్దని ప్రస్తుత క్రికెటర్లతోపాటు యువ ఆటగాళ్లకు బీసీసీఐ సూచించింది. క్రికెట్‌కు అతడు అందించిన సేవలకుగాను జెర్సీ నంబర్ 7కు రిటైర్ మెంట్ ఇవ్వాలని బీసీసీఐ నిర్ణయించింది. కొత్త ప్లేయర్‌కూ నంబర్ 7, నంబర్ 10 జెర్సీలను కేటాయించం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నంబర్లను మాత్రమే తీసుకోవడానికి అవకాశం ఉంది. మొత్తం 60 నంబర్లను క్రికెటర్ల కోసం కేటాయించడం జరిగింది. ఎవరైనా ఆటగాడు ఏడాదిపాటు దూరమైనా అతడి జెర్సీ నంబర్‌ను కొత్త ప్లేయర్‌కు ఇవ్వం. అరంగేట్రం చేసే ఆటగాడికి వేరే నంబర్ ఇస్తాం అని బీసీసీఐ అధికారిక వర్గాలు వెల్లడించాయి.
- ✓ భారత్‌లో ఇప్పటివరకు కేవలం క్రికెట్ దిగ్గజం సచిన్ తెండూల్కర్‌కు మాత్రమే ఇది సాధ్యమైంది. ఇప్పుడు ఆ జాబితాలోకి ఎంఎస్ ధోనీ సైతం చేరిపోయాడు. గతంలో క్రికెట్ గాడ్ సచిన్ తెండూల్కర్ 10వ నంబర్ జెర్సీని కూడా ఎవరికీ కేటాయించలేదు.




## పాలస్తీనా శాంతిదూతలకు ఇందిరాగాంధీ పురస్కారం 2023

- ✓ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి కోసం కృషి చేసే వారికి ప్రతి ఏడాది ప్రదానం చేసే ఇందిరాగాంధీ శాంతి బహుమతికి ఈ దఫా అర్జెంటీనా, పాలస్తీనాకు చెందిన ఇద్దరు అహింసావాదులు ఎంపికయ్యారు. పాలస్తీనా – ఇజ్రాయెల్ ఘర్షణను శాంతియుతంగా, చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించేందుకు అవిశ్రాంతంగా శ్రమిస్తున్న డేనియల్ బారెన్‌బోయమ్, అలీ అబూ అవాద్ సంయుక్తంగా ఈ పురస్కారం అందుకోనున్నారు. మాజీ సీజేఐ జస్టిస్ టి.ఎస్.ఠాకుర్ నేతృత్వంలోని ఎంపిక కమిటీ ఈ విషయాన్ని దిల్లీలో వెల్లడించింది. జన్మతహా అర్జెంటీనా జాతీయుడైన డేనియల్ బారెన్‌బోయమ్ సుప్రసిద్ధ పియానో సంగీత వాయిద్యకారుడు. పశ్చిమాసియాలో ఘర్షణల నివారణకు కృషి చేస్తున్నారు. అలీ అబూ అవాద్ పాలస్తీనా శాంతి కార్యకర్త. 1972లో జన్మించిన అలీ అవాద్ గాంధేయవాదిగా గుర్తింపు పొందారు. రూట్స్ అనే కార్యక్రమం ద్వారా 2014 నుంచి పాలస్తీనియన్లు, ఇజ్రాయెలీలకు అహింస, పరస్పర అవగాహన, పరివర్తనలపై అవగాహన కల్పిస్తున్నారు.



## ఐదుగురు ఎంపీలకు సంసద్ రత్న అవార్డులు2024

- ✓ పార్లమెంటులో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికిచ్చే సంసద్ రత్న అవార్డులను 2024కి గాను ఐదుగురికి ప్రకటించారు. భాజపాకు చెందిన సుకాంత మజుందార్, సుధీర్ గుప్తా, శివసేనకు చెందిన శ్రీకాంత్ ఏక్‌నాథ్ శిందే, కాంగ్రెస్‌కు చెందిన కుల్దీప్ రాయ్ శర్మ, ఎన్సీపీకి చెందిన అమోల్ రాంసింగ్ కొల్హే ఈ అవార్డులకు ఎంపికయ్యారు.
- ✓ ఫిబ్రవరి 17వ తేదీన దిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులను వారికి అందజేస్తారు. పార్లమెంటులో బాగా పని చేసిన పార్లమెంటేరియన్లకు ఏటా ఈ అవార్డులను ఇస్తారు. ఐదేళ్లకు ఒకసారి మహా సంసద్ రత్న అవార్డును ఇస్తారు.
- ✓ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సహకారంతో చెన్నైకి చెందిన స్వచ్ఛంద సంస్థ ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ ఈ అవార్డులను 2010లో ప్రారంభించింది.

## ఇస్రోకు ఐస్‌లాండ్ అవార్డు

- ✓ చంద్రయాన్–3 ప్రయోగాన్ని విజయవంతం చేసినందుకుగాను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు ఐస్‌లాండ్‌లోని హుసావిక్‌లో గల ఎక్స్‌ప్లొరేషన్ మ్యూజియం '2023 లీఫ్ ఎరిక్సన్ లూనార్ ప్రైజ్'ను అందజేసింది. ఇస్రో పంపిన అంతరిక్ష నౌక ఈ ఏడాది ఆగస్టు నెలలో మొదటిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువం మీద సాఫ్ట్ ల్యాండింగు జరిపిన విషయం తెలిసిందే. చంద్రుడి గురించి అన్వేషణను ముందుకు తీసుకువెళ్లడంలో, ఖగోళ రహస్యాల ఛేదనలో ఇస్రో తిరుగులేని స్ఫూర్తిని ప్రదర్శించిందని ఐస్ లాండ్ రాజధాని రెయ్‌కావిక్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ఇస్రో తరఫున భారత రాయబారి బి.శ్యాం ఈ వార్షిక అవార్డును అందుకొన్నారు.



## 'ఆస్కార్ చల్లగరిగ'కు కేన్స్ పురస్కారం

- ✓ కేన్స్ వరల్డ్ ఫిలిం ఫెస్టివల్‌లో 'ఆస్కార్ చల్లగరిగ' కు భారతీయ ఉత్తమ డాక్యుమెంటరీగా పురస్కారం లభించింది. ఆస్కార్ విజేత, ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ సొంత ఊరు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చల్లగరిగ నేపథ్యంలో చిల్కూరి సుశీల్‌రావు తెరకెక్కించిన డాక్యుమెంటరీ ఇది. ఆస్కార్ విజేతగా తన సొంత గ్రామానికి చంద్రబోస్ వెళ్లినప్పుడు అక్కడ కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు జరుపుకున్న సంబరాలు, వాళ్ల భావోద్వేగాలు, విజేత జ్ఞాపకాల్ని డాక్యుమెంటరీగా తెరకెక్కించారు సుశీల్‌రావు.



## అమృత్‌పాల్ సింగ్‌కు నైట్‌హుడ్ పురస్కారం

✓ భారత సంతతికి చెందిన బ్రిటిష్ సిక్కు వర్గీయుడు డాక్టర్ అమృత్ పాల్ సింగ్ హంగిన్ ప్రతిష్ఠాత్మక నైట్‌హుడ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 2024 కొత్త సంవత్సరంలో కింగ్ ఛార్లెస్-3 ఈ పురస్కార గ్రహీతలను సత్కరిస్తారు. జనరల్ ప్రాక్టీసులో 30 ఏళ్ల అనుభవం ఉన్న డాక్టర్ అమృత్‌పాల్ న్యూకాజిల్ యూనివర్సిటీ గౌరవ ఆచార్యుడిగా వ్యవహరిస్తున్నారు. బ్రిటిష్ మెడికల్ అసోసియేషన్ (బీఎంఏ)కు పూర్వ అధ్యక్షుడిగానూ పనిచేశారు. అవార్డు గ్రహీతల జాబితాను లండన్‌లో ప్రకటించారు. మరికొందరు ప్రవాస భారతీయులు కూడా ఈ జాబితాలో చోటు సాధించారు.



## డా.చంద్రమోహన్‌కు బ్రిటిష్ సీబీఈ పురస్కారం

✓ నిజామాబాద్ జిల్లాలో జన్మించి లండన్‌లో స్థిరపడిన భారతీయ వైద్యుడు కన్నెగంటి చంద్రమోహన్ ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ పురస్కారానికి ఎంపికయ్యారు. బ్రిటన్‌లో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ఏటా 'కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (సీబీఈ)' పురస్కారాన్ని అందిస్తారు. 2023 ఏడాదికి గానూ వైద్యరంగంలో చంద్రమోహన్ చేసిన సేవలకు ఈ పురస్కారం ఇవ్వనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో పుట్టి ఆ దేశంలో స్థిరపడి ఈ పురస్కారం పొందిన తొలి వ్యక్తి చంద్రమోహన్ కావడం విశేషం. నిజామాబాద్ జిల్లా కోటగిరికి చెందిన దామోదర్‌రావు - సరోజిని దంపతుల కుమారుడైన ఈయన జిల్లా కేంద్రానికి సమీపంలోని ధర్మారం గ్రామంలో జన్మించారు. స్థానిక నిర్మల్‌లో రెండో తరగతి, ఆ తర్వాత ఇంటర్ వరకు హైదరాబాద్‌లో విద్యనభ్యసించారు. అనంతరం గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చేశారు. 2002లో లండన్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. జనరల్ ప్రాక్టిషనర్‌గా సేవలందిస్తూ ఆ అసోసియేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం బ్రిటన్‌లో వైద్యుల సంఘానికి అధ్యక్షుడి ఉన్నారు. చంద్రమోహన్ బ్రిటన్‌లో స్టోక్ ఆన్ ట్రెంట్ నగరంలో రెండుసార్లు కౌన్సిలర్‌గా, ఒకసారి మేయర్‌గా పనిచేశారు.



## దక్షిణ మధ్య రైల్వేకు ఏడు అవార్డులు

✓ తెలుగు రాష్ట్రాల నుంచి ద.మ.రైల్వే ఏడు ఇంధన పరిరక్షణ అవార్డులను సాధించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఈ అవార్డులు ప్రదానం చేశారు. తెలంగాణ నుంచి అయిదు, ఏపీ నుంచి రెండు అవార్డులను కైవసం చేసుకున్నట్లు ద.మ.రైల్వే ఓ ప్రకటనలో వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వ ఇంధన శాఖ, టీఎస్ రెడ్కో సంయుక్తంగా ఇచ్చిన ఇంధన పరిరక్షణ అవార్డుల కార్యక్రమం హైదరాబాద్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, విశ్వేశ్వరయ్య భవన్' లో జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, ఇంధన మంత్రిత్వ శాఖ సంయుక్తంగా విజయవాడలోని వివంత హోటల్‌లో అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించింది.

తెలంగాణకు వచ్చినవి

✓ రైల్వేస్టేషన్ భవనాల విభాగంలో నల్గొండ రైల్వే స్టేషన్‌కు గోల్డ్ అవార్డు, కాచిగూడ రైల్వేస్టేషన్‌కు సిల్వర్ అవార్డు. ప్రభుత్వ భవనాల విభాగంలో లేఖ భవన్‌కు (దక్షిణ మధ్య రైల్వే అకౌంట్స్ ఆఫీస్ బిల్డింగ్) గోల్డ్ అవార్డు, హైదరాబాద్‌లోని ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పి.ఆర్.ఎస్.) భవనానికి సిల్వర్ అవార్డు. మీడియం స్కేల్ ఇండస్ట్రీస్ విభాగంలో లాలాగూడలోని క్యారేజ్ వర్క్‌షాప్‌నకు సిల్వర్ అవార్డు.

ఆంధ్రప్రదేశ్ కు వచ్చినవి

✓ భవనాల విభాగంలో గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయ భవనానికి గోల్డ్ అవార్డు, గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయ భవనానికి సిల్వర్ అవార్డు. ఈ అవార్డులను సంబంధిత డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్లు, డివిజనల్ ఎలక్ట్రికల్ అధికారులు అందుకున్నారు.

## చంద్రయాన్ 3 బృందానికి ఇండియా బిజినెస్ లీడర్ అవార్డు

✓ ముంబై నగరంలో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఇండియా బిజినెస్ లీడర్ అవార్డుల వేడుకలో చంద్రయాన్ 3 బృందం ప్రతిష్ఠాత్మకమైన ఐబిఎల్ఏ అవార్డును అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు వివిధ రంగాలలో అత్యుత్తమ విజయాలను గుర్తిస్తుంది. భారతదేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ పురోగతికి ఇస్రో మరియు చంద్రయాన్-3 సహకారానికి గాను ఈ అవార్డు అందించబడింది.

✓ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-3 మిషన్ 14 జూలై 2023న విజయవంతంగా ప్రయోగించబడింది. చంద్రుని ఉపరితలంపై రోబోటిక్ ల్యాండర్ మరియు రోవర్‌ను ల్యాండ్ చేయడం ద్వారా ఈ ప్రయోగం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది

## 8 మంది భారతీయ బ్యాంకర్లకు 'ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్'పురస్కారాలు

✓ భారత్, యూకేల ఆర్థిక సేవల రంగాల మధ్య ఉన్న ముఖ్యమైన వాణిజ్య సంబంధాలకు గుర్తింపుగా లండన్‌లోని ఆర్థిక కేంద్రంగా ఉన్న ప్రముఖ భారతీయ బ్యాంకుల నుంచి 8 మంది సీనియర్

బ్యాంకర్లకు 'ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్' పురస్కారాలు లభించాయి. ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్ 13వ శతాబ్దానికి చెందినది. అప్పటి నుంచి సిటీ లేదా స్క్వేర్ మైల్ అని పిలిచే లండన్ ఆర్థిక కేంద్రంపై ప్రభావం చూపే వ్యక్తులకు ఇచ్చే గౌరవ పురస్కారంగా దీన్ని అభివృద్ధి చేశారు. ఈ చరిత్రాత్మక పురస్కారం అందుకున్న వారిలో బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన మధుర్ కుమార్, బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన మనీశ్ గుప్తా, ఎగ్జిమ్ (ఎక్స్‌పోర్ట్ – ఇంపోర్ట్) బ్యాంక్‌కు చెందిన అశోక్ కుమార్, ఇండస్ ఇండ్ బ్యాంక్‌కు చెందిన షారుఖ్ టి వాడియా, ఐఐఎఫ్‌సీ (ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ)కి చెందిన రాకేశ్ కుమార్, ఐసీఐసీఐ బ్యాంక్‌కు చెందిన లోక్‌నాథ్ మిశ్రా, ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)కు చెందిన సుధీర్ కుమార్ శర్మ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన అరవింద్ కుమార్ చౌదరి ఉన్నారు.

## ఐరాస మాజీ సెక్రటరీ జనరల్ బాన్ కీ మూన్‌కు'దివాలీ పవర్ ఆఫ్ వన్'పురస్కారం

✓ ఐరాస మాజీ సెక్రటరీ జనరల్ బాన్‌కీమూన్‌తో పాటు మరో ముగ్గురు దౌత్యవేత్తలు 'దివాలీ పవర్ ఆఫ్ వన్' పురస్కారాలకు ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన దివాలీ ఫౌండేషన్ ఇచ్చే ఈ అవార్డులను దౌత్యరంగంలో ఆస్కార్‌లుగా భావిస్తారు. బాన్‌కీమూన్‌తో పాటు ఐరాసలో బోస్నియా, హెర్జ్‌గోవినా మాజీ శాశ్వత ప్రతినిధి మిర్సాదా కొలాకవిచ్, దక్షిణ కొరియా మాజీ శాశ్వత ప్రతినిధి కిమ్ సూక్, ఈయూ ప్రత్యేక ప్రతినిధి మిరోస్లవ్ లజ్‌కాక్‌లు ఐరాస ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రపంచం గతంలో కంటే ఎక్కువగా దెబ్బతిన్నట్లు తనకు అనిపిస్తోందని బాన్ ఈ సందర్భంగా అన్నారు.



## నోబెల్ పురస్కారాన్ని అందుకున్న నర్గీస్ మొహమ్మదీ సంతానం

✓ ఇరాన్ మానవ హక్కుల కార్యకర్త నర్గీస్ మొహమ్మదీ తరఫున ఆమె పిల్లలు ఈ సంవత్సరం నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నారు. ప్రస్తుతం నర్గీస్ జైలు జీవితం గడుపుతున్నారు. దీంతో పారిస్‌లో ప్రవాసంలో ఉన్న ఆమె 17 ఏళ్ల కవల పిల్లలు అలీ, కియానా రహ్మానీలు తండ్రితో కలిసి నార్వే రాజధాని చేరుకుని పురస్కారాన్ని స్వీకరించారు. ఇరాన్‌లో మరణశిక్షలకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల కోసం పోరాడినందుకు గాను నర్గీస్‌కు అక్టోబరులో నోబెల్ శాంతి బహుమతి లభించిన సంగతి తెలిసిందే. ఓస్లోలో జరిగిన సమావేశంలో మొహమ్మదీ పంపిన సందేశాన్ని ఆమె కుమార్తె కియానా చదివి వినిపించారు. నిరసనకారులు, మానవహక్కుల పరిరక్షకుల స్వరాన్ని ప్రపంచానికి అంతటికీ తెలియజేస్తున్న అంతర్జాతీయ మీడియా పాత్రను నర్గీస్ తన సందేశంలో కొనియాడారు. నోబెల్ శాంతి పురస్కారాన్ని అందుకున్న 19వ మహిళగా, రెండో ఇరాన్ మానవహక్కుల కార్యకర్తగా మొహమ్మదీ రికార్డులకు ఎక్కారు.

## ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తకు ఐజీయూ పురస్కారం

✓ జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) సీనియర్ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ లబానీ రేను ప్రతిష్ఠాత్మక ఇండియన్ జియోఫిజికల్ యూనిట్ (ఐజీయూ) అన్ని తల్వానీ స్మారక పురస్కారం వరించింది. భూమి లోపల జియోథర్మల్‌పై ఆమె చేసిన విశేష కృషికి గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. రాళ్ల ఉష్ణ వాహకతను కొలవడానికి ఎన్‌జీఆర్ఐలో ప్రత్యేకంగా పరిశోధనశాల ఏర్పాటు చేశారు.



## కరణ్‌జోహార్‌కి దర్శక పురస్కారం

✓ సౌదీ అరేబియాలోని జెద్దాలో జరుగుతున్న 'రెడ్ సీ ఫిల్మ్ ఫెస్టివల్ 2023' చిత్రోత్సవాల్లో ప్రముఖ దర్శక నిర్మాత కరణ్‌జోహార్‌ని 'వెరైటీ ఇంటర్నేషనల్ వ్యాన్‌గార్డ్ డైరెక్టర్' గా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోవడం గొప్ప గౌరవంగా, గర్వంగా భావిస్తున్నా. ఎందుకంటే నేను ఈ అవార్డు ద్వారా నా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా. ఈ ఏడాది చివర్లో ఇలాంటి పురస్కారం అందుకోవడం నా సంతోషాన్ని రెట్టింపు చేసిందన్నారు.



## కవయిత్రి సుకృతా పాల్ కుమార్‌కు ఠాగూర్ సాహిత్య బహుమతి

✓ ప్రముఖ కవయిత్రి మరియు విమర్శకురాలు సుకృతా పాల్ కుమార్ తన "సాల్ట్ & పెప్పర్: సెలెక్టెడ్ పోయెమ్స్" పుస్తకానికి గాను ప్రతిష్ఠాత్మకమైన 6వ రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్య బహుమతిని గెలుచుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు ప్రపంచ శాంతి, సాహిత్యం, కళ, విద్య మరియు మానవ హక్కులను ప్రోత్సహిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ సాహిత్య కృషిని గుర్తిస్తుంది. అలానే ఈ ఏడాది రవీంద్రనాథ్ ఠాగూర్ సాంఘిక సాఫల్యానికి సంబంధించిన సాహిత్య బహుమతిని నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ అందుకున్నారు.



సామాజిక సంక్షేమానికి ఆయన చేసిన కృషికి గాను ఇది అందించబడింది.

- ✓ 2018లో అమెరికాకు చెందిన ప్రచురణకర్త పీటర్ బుందాలో స్థాపించిన ఈ అవార్డు ప్రపంచ శాంతి, సాహిత్యం, కళ, విద్య మరియు మానవ హక్కుల కోసం ఒక వేదిక. ఇది సామాజిక సాధన బహుమతితో మానవ హక్కులు మరియు ప్రపంచ శాంతికి సంబంధించిన కార్యాలను కూడా గుర్తిస్తుంది. ఈ అవార్డు గ్రహీతకు 5వేల డాలర్ల నగదు బహుమతి మరియు రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం అందిస్తారు.

## యునెస్కో ఆసియా-పసిఫిక్ అవార్డులు 2023

- ✓ యునెస్కో ఆసియా-పసిఫిక్ ప్రైజ్ ఫర్ కల్చరల్ హెరిటేజ్ కన్జర్వేషన్ 2023 ప్రకటించబడింది, ఇందులో భారతదేశం నుండి మూడు ప్రాజెక్టులకు ప్రతిష్టాత్మక యునెస్కో అవార్డు లభించింది.
- ✓ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ కోసం UNESCO ఆసియా-పసిఫిక్ ప్రైజ్ 2023లో చైనా, భారతదేశం,నేపాల్ నుండి 12 ప్రాజెక్ట్‌లను అవార్డు జ్యూరీ ఆమోదించింది.
- ✓ చైనాలోని లియోయాంగ్‌లోని జియా క్యాపిటల్‌లోని ఎర్లిటౌ సైట్ మ్యూజియంకు వారసత్వ సందర్భాలలో కొత్త డిజైన్‌కు అవార్డు లభించింది .
- ✓ **యునెస్కో ఆసియా-పసిఫిక్ అవార్డు లో భారతదేశం ప్రదర్శన:**
  **అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్**: అమృత్‌సర్‌లోని రాంబాగ్ గేట్
  **విశిష్ట పురస్కారం**: కేరళలోని కున్నమంగళం భగవతీ ఆలయంలో కర్ణికార మండపం
  **అవార్డ్ ఆఫ్ మెరిట్**: హర్యానాలోని గురుగ్రామ్‌లోని చర్చ్ ఆఫ్ ది ఎపిఫనీ, ముంబైలోని డేవిడ్ సాసూన్ లైబ్రరీ మరియు రీడింగ్ రూమ్, న్యూఢిల్లీలోని బికనీర్ హౌస్.
- ✓ పంజాబ్‌లోని పీపాల్ హవేలీ మరియు ఖాట్మండులోని సికామి చెన్ లు తమ పరివర్తన వారసత్వ పద్ధతులకు 'సుస్థిర అభివృద్ధి కోసం ప్రత్యేక గుర్తింపు' పొందాయి .
- ✓ కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం, బెంగళూరు (KIA) టెర్మినల్ 2 యునెస్కో ప్రిక్స్ వెర్సైల్లెస్ 'ఇంటీరియర్స్ 2023' ప్రత్యేక బహుమతిని పొందింది. ఇలాంటి గౌరవం పొందిన ఏకైక భారతీయ విమానాశ్రయం ఇదే .
- ✓ **పంజాబ్ మరియు హర్యానాలో గెలుపొందిన ప్రాజెక్ట్‌లు:**
- ✓ రాంబాగ్ గేట్ మరియు రాంపార్ట్స్, అమృత్సర్: రామ్ బాగ్ భారతదేశంలోని పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో మహారాజా రంజిత్ సింగ్ పాలనలో నిర్మించిన ఉద్యానవనం . ఇది 1831లో పూర్తయింది మరియు అమృత్‌సర్ నగరాన్ని స్థాపించిన సిక్కుల నాల్గవ గురువు గురు రామ్ దాస్ పేరు పెట్టారు.
- ✓ **చర్చ్ ఆఫ్ ఎపిఫనీ, గుర్గావ్**:1856 నుండి 1866 వరకు, సైనిక అధికారులు మరియు బ్రిటిష్ నివాసితులు సివిల్ లైన్స్ మిలిటరీ కంటోన్మెంట్‌లోని ఈ స్థలాన్ని ప్రార్థనల కోసం ఉపయోగించారు. కోల్‌కతా బిషప్ 1866లో హిసార్ చర్చికి వచ్చినప్పుడు ఈ చర్చిని నిర్మించారు.
- ✓ **పీపాల్ హవేలీ, గురుదాస్‌పూర్:** పీపాల్ హవేలీ, పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలోని నవాన్ పిండ్ సర్దారన్ గ్రామంలోని వారసత్వ గ్రామీణ నివాసం. పీపాల్ హవేలీ సంఘ కుటుంబానికి చెందినది . 'ది పీపుల్ హవేలీ' నిర్మాణాన్ని 125 సంవత్సరాల క్రితం సర్దార్ నారాయణ్ సింగ్ నేతృత్వంలోని కుటుంబం ప్రారంభించింది . ఈ గ్రామం సెప్టెంబర్ 2023లో పంజాబ్ టూరిజం మంత్రిత్వ శాఖ నుండి "ఉత్తమ పర్యాటక గ్రామం" అవార్డును అందుకుంది.
- ✓ **సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు యునెస్కో ఆసియా-పసిఫిక్ అవార్డు:** ఆసియా -పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక లక్ష్యాలను నెరవేర్చడానికి 2000 నుండి యునెస్కో 'ఆసియా-పసిఫిక్ హెరిటేజ్ అవార్డు'ని అందజేస్తోంది .
- ✓ ఒక వ్యక్తి లేదా సంస్థ ద్వారా పరిరక్షణ ప్రయత్నాలను ప్రారంభించిన సాంస్కృతిక వారసత్వ ప్రాంతాల పరిరక్షణను ప్రోత్సహించడం ఈ అవార్డు యొక్క ఉద్దేశ్యం.

## ముంబై ప్రొఫెసర్‌కు రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ప్రైజ్

- ✓ రసాయన శాస్త్ర విద్యకు చేసిన కృషికి గుర్తింపుగా ముంబైకి చెందిన ప్రొఫెసర్ సవిత లాడేజ్, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ యొక్క నైహోల్మ్ ప్రైజ్ ఫర్ ఎడ్యుకేషన్ విజేతగా ఎంపికయ్యారు. సవిత లాడేజ్ హోమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్, టాటా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో రసాయన శాస్త్ర అధ్యాపకురాలుగా సేవలు అందిస్తున్నారు

## డాక్టర్ అతుల్ షాకు గేమ్ ఛేంజింగ్ ఇన్నోవేటర్ అవార్డు

- ✓ ప్రముఖ భారతీయ ప్లాస్టిక్ సర్జన్ అయిన డాక్టర్ అతుల్ షా, కాప్ 28 సమావేశంలో ప్రతిష్టాత్మక గేమ్-ఛేంజింగ్ ఇన్నోవేటర్ అవార్డును అందుకున్నారు. రీచ్ (రికగ్నైజింగ్ ఎక్సలెన్స్ ఎరౌండ్ ఛాంపియన్స్ ఆఫ్ హెల్త్) అందించిన ఈ అవార్డు ప్రపంచ ఆరోగ్య రంగంలో అత్యుత్తమ సేవలు అందించే వ్యక్తులకు సత్కరిస్తుంది.
- ✓ కుష్టు వ్యాధిగ్రస్తుల సంరక్షణలో అతుల్ షా యొక్క అద్భుతమైన సహకారం కోసం ఈ అవార్డు అందించబడింది. అతుల్ షా కుష్టు రోగుల పండ్ల డ్రెస్సింగ్ కోసం కాంప్రహెన్సివ్ సెల్ఫ్-కేర్ కిట్ అభివృద్ధి చేశారు. ఈ వినూత్న పరిష్కారం దేశం యొక్క జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో (2007 నుండి) విలీనం చేయబడింది. ఇది భారతదేశం అంతటా 80,000 మందికి ప్రయోజనం చేకూర్చింది.




## ఈజిప్టు అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి అబ్దుల్ ఫతా ఎల్ సిసి ఎన్నిక



✓ ఈజిప్టు అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు అబ్దుల్ ఫతా ఎల్ సిసి వరుసగా మూడోసారి విజయం సాధించారు. తొమ్మిదేళ్ల నుంచి దేశాన్ని పాలిస్తున్న ఈ మాజీ సైన్యాధికారి మరో ఆరేళ్ల పాటు పదవిలో ఉంటారు. ఈ మేరకు వెలువడిన ఎన్నికల ఫలితాల్లో ఎల్ సిసికి 89.6% ఓట్లు రాగా, ఆయనపై పోటీ చేసిన ముగ్గురు అభ్యర్థుల్లో ఏ ఒక్కరికీ కనీసం 5 శాతం ఓట్లు రాలేదు. ప్రస్తుతం ఈజిప్టు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉంది. నెలవారీ ద్రవ్యోల్బణ రేటు 30 శాతంపైనే. గడచిన 22 నెలల్లో ఈజిప్టు కరెన్సీ 50 శాతం విలువను కోల్పోయింది. 10.5 కోట్ల ఈజిప్టు జనాభాలో మూడో వంతు మంది పేదరికంలో మగ్గిపోతున్నారు. గతంలో సైన్యాధికారిగా పనిచేసిన ఎల్ సిసి 2013లో సైనిక తిరుగుబాటు చేసి నాటి దేశాధ్యక్షుడిని కూలదోశారు. 2014 మధ్యలో తొలిసారి, 2018లో రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2019లో రాజ్యాంగ సవరణ ద్వారా పదవీ కాలాన్ని రెండేళ్లు పొడిగించుకున్న ఎల్ సిసి ఇప్పుడు మూడోసారి ఆరేళ్ల పదవీ కాలానికి ఎన్నికయ్యారు. ఈజిప్టు ఆర్థిక వ్యవస్థ దశాబ్దాలుగా అస్తవ్యస్తంగా ఉంది. రెండుసార్లు ఐఎంఎఫ్ నుంచి రుణాలు తీసుకున్నా ధరలు పెరగడమే తప్ప ఒరిగిందేమీ లేదు. ఈసారి ఎన్నికైతే ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతానని ఎల్ సిసి హామీ ఇచ్చారు. అయితే అదెలా సాధిస్తారో వివరించలేదు.

## చైనా నూతన రక్షణ మంత్రిగా డాంగ్ జున్

✓ చైనా నూతన రక్షణ శాఖ మంత్రిగా నౌకాదళ మాజీ కమాండర్ జనరల్ డాంగ్ జున్ నియమితులయ్యారు. జాతీయ పీపుల్స్ కాంగ్రెస్ స్టాండింగ్ కమిటీ ఇందుకు ఆమోదం తెలిపినట్లు చైనా తెలిపింది. ఈ పదవిలో ఉన్న జనరల్ లీ షాంగ్‌ఫూను అక్టోబరులో ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రెండు నెలల తర్వాత డాంగ్ జున్‌కు రక్షణ శాఖ బాధ్యతలు అప్పగించింది. జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న డాంగ్ గతేడాది అక్టోబరులో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనాకు ఎన్నికయ్యారు. గతంలో చైనా నౌకాదళానికి కమాండర్‌గా ఉన్న ఆయన సెప్టెంబరు 2021లో జనరల్ హోదాకు పదోన్నతి పొందారు.



## సీఐఎస్ఎఫ్‌కు తొలి మహిళా డీజీగా నైనా సింగ్



✓ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) తొలి మహిళా డైరెక్టర్ జనరల్ (డీజీ)గా సీనియర్ ఐపీఎస్ అధికారిణి నైనా సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 1989 బ్యాచ్, రాజస్థాన్ కేడర్‌కు చెందిన ఆమె ప్రస్తుతం సీఐఎస్ఎఫ్‌కు ప్రత్యేక డీజీగా వ్యవహరిస్తున్నారు. ఐటీబీపీ అధిపతిగా వ్యవహరిస్తున్న అనీశ్ దయాళ్ సింగ్‌ను సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా కేంద్రం నియమించింది. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ప్రత్యేక డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న రాహుల్ రసగోత్ర ఇకపై ఐటీబీపీ అధిపతిగా వ్యవహరించనున్నారు.

## భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారిగా రువెన్

✓ మాజీ దౌత్యవేత్త రువెన్ అజర్‌ను భారత్‌లో తమ రాయబారిగా ఇజ్రాయెల్ నియమించింది. శ్రీలంక, భూటాన్‌లకూ 56 ఏళ్ల రువెన్ నాన్ రెసిడెంట్ రాయబారిగా వ్యవహరిస్తారు. ఆయనతో పాటు మొత్తం 21 దేశాల రాయబారుల నియామకాలకు ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ప్రస్తుతం రువెన్ రొమేనియాలో ఇజ్రాయెల్ రాయబారిగా ఉన్నారు. ప్రస్తుతం భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారిగా నౌర్ గిలన్ పని చేస్తున్నారు.



## బీబీసీ ఛైర్మన్‌గా సమీర్ షా

✓ బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) ఛైర్మన్ పదవికి భారత్‌లో జన్మించిన డాక్టర్ సమీర్ షా (71)ను ప్రభుత్వం ఎంపిక చేసింది. జర్నలిజం, టీవీ కార్యక్రమాల నిర్మాణంలో 40 ఏళ్ల అనుభవం ఉన్న డాక్టర్ షా స్వతంత్ర టీవీ, రేడియో కార్యక్రమాల సంస్థ జూనిపర్ సీఈవో కూడా. ఇంతకుముందు బీబీసీలో వివిధ హోదాల్లో ఈయన పనిచేశారు. బీబీసీ రాజకీయంగా స్వతంత్ర సంస్థ అయినా, దాని ఛైర్మన్‌ను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. సమీర్ షా వంటి పాత్రికేయుడిని ఈ పదవిలో నియమించడం ఇదే ప్రథమం. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ (ఔరంగాబాద్)లో 1952లో సమీర్ షా జన్మించారు. తల్లి ఉమ ఆయన్ను తీసుకొని 1960లో లండన్ వెళ్లి స్థిరపడ్డారు. షా కుటుంబం బాలీవుడ్ సినిమాలు నిర్మించేది.



## మధ్యప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా తోమర్

✓ మధ్యప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా మద్దతు ఇవ్వడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. తోమర్ గ్వాలియర్ కార్పొరేటర్‌గా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఆపై ఎమ్మెల్యేగా, మంత్రిగా వ్యవహరించారు. ఎంపీగా రెండుసార్లు ఎన్నికయ్యారు. కేంద్ర మంత్రిగా ప్రధాని మోదీ ప్రభుత్వంలో బాధ్యతలు నిర్వహించారు.



## ఛత్తీస్‌గఢ్ స్పీకర్‌గా రమణ్ సింగ్

✓ ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, భాజపా సీనియర్ నేత రమణ్‌సింగ్ (71) రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రాజ్ నందగావ్ నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న రమణ్ సింగ్ ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999లో లోక్‌సభకు ఎన్నికైన ఆయన వాజ్‌పేయీ మంత్రివర్గంలో సహాయ మంత్రిగానూ పనిచేశారు. 2003 నుంచి 2018 దాకా పదిహేనేళ్లు ఛత్తీస్‌గఢ్ సీఎంగా బాధ్యతలు నిర్వహించారు. మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా చేసిన రమణ్‌సింగ్ స్పీకరుగా బాధ్యతలు చేపట్టడం విశేషం.



## ఐటీబీపీ నూతన డైరెక్టర్ జనరల్‌గా రాహుల్ రస్గోత్రా

✓ ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) కొత్త డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి రాహుల్ రస్గోత్రా నియమితులయ్యారు. రాహుల్ రస్గోత్ర మణిపూర్ కేడర్‌కు చెందిన 1989-బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారి. రాహుల్ రస్గోత్రా ప్రస్తుతం ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ)లో ప్రత్యేక డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు.



✓ ఇండో -టిబెటన్ బోర్డర్ పోలీస్ అనేది టిబెట్ అటానమస్ రీజియన్‌తో సరిహద్దుల వెంబడి మోహరించిన ఒక ప్రత్యేక సరిహద్దు రక్షణ దళం. ఇది ఐదు కేంద్ర సాయుధ పోలీసు బలగాలలో ఒకటి. దీనిని 1962లో ఏర్పాటు చేసారు. ఇది జమ్మూ & కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం మరియు అరుణాచల్ ప్రదేశ్‌ల వెంబడి భారతదేశం-చైనా సరిహద్దును కాపాడుతోంది. వీరు జమ్మూ & కాశ్మీర్‌లోని కారకోరం పాస్ నుండి అరుణాచల్ ప్రదేశ్‌లోని జాచెప్ లా వరకు మోహరించి ఉంటారు.

## సిఆర్‌పిఎఫ్ నూతన డైరెక్టర్ జనరల్‌గా అనీష్ దయాళ్ సింగ్

✓ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) నూతన డైరెక్టర్ జనరల్‌గా అనిష్ దయాల్ సింగ్ నియమితులయ్యారు. అనిష్ దయాల్ ఇదివరకు ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)కి నేతృత్వం వహించారు. అనిష్ దయాల్ మణిపూర్ కేడర్‌కు చెందిన 1988-బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారి.



✓ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ అనేది భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారం క్రింద భారతదేశంలోని రిజర్వ్ జెండర్‌మేరీ మరియు అంతర్గత పోరాట దళం. ఇది ఐదు కేంద్ర సాయుధ పోలీసు బలగాలలో ఒకటి. దీనిని 1939లో ఏర్పాటు చేశారు. ఇది దేశంలో శాంతిభద్రతలను మరియు తిరుగుబాటు వ్యవహారాలను ఎదుర్కోవడానికి రాష్ట్ర/కేంద్రపాలిత ప్రాంతాల పోలీసులకు సహాయం అందిస్తుంది.

## సెంట్రల్ ఫైర్ సర్వీస్, సివిల్ డిజిగా వివేక్ శ్రీవాస్తవ

✓ కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫైర్ సర్వీస్, సివిల్ డిఫెన్స్ మరియు హోంగార్డుల డైరెక్టర్ జనరల్‌గా వివేక్ శ్రీవాస్తవ నియమితులయ్యారు. వివేక్ శ్రీవాస్తవ గుజరాత్ కేడర్‌కు చెందిన 1989-బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారి. ఈయన జూన్ 30, 2025 వరకు అంటే అతని పదవీ విరమణ తేదీ వరకు

ఈ బాధ్యతలు నిర్వర్తిస్తారు. వీరు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ తరపున పౌర రక్షణ, హోంగార్డులు మరియు అగ్నిమాపక సేవలను పెంచడం, శిక్షణ & సన్నద్ధం చేయడం వంటి విధులు నిర్వర్తిస్తారు.

## బిఎస్ఇ ఛైర్మన్‌గా ప్రమోద్ అగర్వాల్

- ✓ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ఛైర్మన్‌గా ప్రమోద్ అగర్వాల్ నియామకాన్ని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఆమోదం తెలిపింది. అయితే ప్రమోద్ అగర్వాల్ జనవరి 17 నుండి ఈ బాధ్యతలను అధికారికంగా చేపట్టనున్నారు. ప్రస్తుతం ఈ పదవిలో 2022 మే నుండి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అవుట్ గోయింగ్ ఛైర్మన్ మరియు మాజీ డిప్యూటీ గవర్నర్ అయిన ఎస్ఎస్ ముంద్రా ఉన్నారు.



- ✓ ముంబైలోని దలాల్ స్ట్రీట్‌లో ఉన్న బీఎస్ఈ దేశంలోని ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఒకటి. బీఎస్ఈ 1875లో "నేటివ్ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ అసోసియేషన్"గా స్థాపించబడింది. ఇది ఆసియాలోని పురాతన స్టాక్ ఎక్స్ఛేంజీలలో ఒకటి. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అనేది భారతదేశంలోని సెక్యూరిటీలు మరియు కమోడిటీ మార్కెట్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థ. ఇది 1988లో ముంబై కేంద్రంగా ఏర్పాటు చేయబడింది. ఇది కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తుంది.

## యూనిడ్రాయిట్‌కు ఎన్నికైన మొదటి భారత మహిళగా ఉమా శేఖర్

- ✓ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ యూనిఫికేషన్ ఆఫ్ ప్రైవేట్ లా (యూనిడ్రాయిట్) యొక్క గవర్నింగ్ కౌన్సిల్‌కు ఎన్నికైన భారతదేశపు మొదటి మహిళాగా ఉమా శేఖర్ నిలిచారు. దీనికి సంబంధించి ఇటలీలోని రోమ్‌లో జరిగిన ఎన్నికలలో, ఉమా శేఖర్ మొదటి రౌండ్‌లో 59 ఓట్లకు గాను 45 ఓట్లు దక్కించుకున్నారు. ఈ గవర్నింగ్ కౌన్సిల్‌కు ఎన్నిక కావడానికి 21 ఓట్లు అవసరం. దీనితో ఉమా శేఖర్ తన గవర్నింగ్ కౌన్సిల్ సీటును కైవసం చేసుకున్నారు. భారతదేశం 2024-28 కాలానికి ఈ గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యదేశంగా ఉంటుంది.
- ✓ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది యూనిఫికేషన్ ఆఫ్ ప్రైవేట్ లా అనేది ఇటలీలోని రోమ్‌లో ఉన్న ఒక స్వతంత్ర అంతర్ ప్రభుత్వ సంస్థ. ఇది 1926లో స్థాపించబడింది. దీనిలో ప్రస్తుతం 65 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఇది సభ్య దేశాల మధ్య ప్రైవేట్ మరియు ప్రత్యేక వాణిజ్య చట్టాలను ఆధునికీకరించడం లేదా సమన్వయం చేస్తుంది.

## ఇంటర్నేషనల్ యాంటీ కరప్షన్ ఛాంపియన్‌గా నిఖిల్ డే

- ✓ భారతీయ సామాజిక కార్యకర్త నిఖిల్ దేను అమెరికా విదేశాంగ శాఖ అంతర్జాతీయ అవినీతి నిరోధక ఛాంపియన్‌గా ఎంపిక చేసింది. భారతదేశంలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో అవినీతిని వ్యతిరేకించే సామాజిక ఉద్యమాలకు ఆయన చేసిన తెగువకు గాను ఈ గౌరవం కల్పించారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత మరియు జవాబుదారీతనం, పబ్లిక్ ఆడిట్‌లు మరియు భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆయన గుర్తింపు పొందారు.



- ✓ మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ సహ-వ్యవస్థాపకుడిగా నిఖిల్ డే యొక్క ప్రయత్నాలు భారతదేశంలో అవినీతి నిరోధక మరియు పారదర్శకత సంస్కరణలకు దోహదపడ్డాయి. రాజస్థాన్ ప్రభుత్వం మరింత జవాబుదారీతనం మరియు పారదర్శకతతో పనిచేసేందుకు ఈయన ఉద్యమాలు సహాయపడ్డాయి.

## సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా జస్టిస్ గవాయి

- ✓ సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి నియమితులయ్యారు. న్యాయమూర్తుల్లో సీనియారిటీపరంగా మూడో స్థానంలో ఉన్న ఆయన్ను ఈ పదవిలో నియమిస్తున్నట్లు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. సమాజంలో అట్టడుగున ఉన్న వారికి ఉచిత న్యాయ సేవలు అందించడం ఈ కమిటీ ప్రధాన విధి. న్యాయం కోసం అంతిమ గమ్యస్థానమైన సుప్రీంకోర్టుకు వచ్చే వారికి న్యాయవాదులను నియమించుకొని తమ కేసులను వాదించుకొనే స్థోమత లేనప్పుడు ఈ కమిటీ వారికి ఉచిత న్యాయ సేవలు అందిస్తుంది. దేశంలో చాలా మంది ప్రజలు సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి సంశయిస్తుంటారు. దాన్ని ఆశ్రయించే అవకాశం తమకు లేకపోయిందన్న భావనను బాధితుల నుంచి తొలగించేందుకు ఈ కమిటీ పనిచేస్తుంది. ఇప్పుడున్న న్యాయమూర్తుల సీనియారిటీ ప్రకారం జస్టిస్ గవాయి 2025 మే 14వ తేదీన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి ఆ ఏడాది నవంబరు 23 వరకు ఆ పదవిలో కొనసాగుతారు.






## దేశంలో అత్యంత సంపన్నుల జాబితాలో సావిత్రి జిందాల్‌కు అగ్రస్థానం

- దేశంలో అత్యంత సంపన్నుల్లో ఈ ఏడాది అత్యధిక సంపద ఆర్జించిన జాబితాలో సావిత్రి జిందాల్ అగ్రస్థానంలో నిలిచినట్లు 'బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్' వెల్లడించింది. ఆమె మొత్తం సంపద 25.3 బి.డాలర్లు. ఈ ఒక్క ఏడాదిలోనే ఆమె సంపద 9.6 బి.డాలర్లు పెరిగిందని, ఈ జాబితాలో ఆమె అందరి కంటే ముందు నిలిచారని వెల్లడించింది..



- దేశీయ మహిళల్లో అగ్రస్థానం: జిందాల్ గ్రూప్‌ను స్థాపించిన ఓం ప్రకాశ్ జిందాల్ సతీమణే సావిత్రి జిందాల్. ఆయన మరణానంతరం ఓపీ జిందాల్ గ్రూప్ ఛైర్‌పర్సన్‌గా ఆమె వ్యవహరిస్తున్నారు. ఈ గ్రూప్‌లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అండ్ పవర్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, జిందాల్ స్టెయిన్‌లెస్ వంటి కంపెనీలు ఉన్నాయి. ఇందులో చాలా వరకు కంపెనీల షేర్లు దేశీయ మార్కెట్లో పరుగులు పెట్టడం వల్లే సావిత్రి జిందాల్ సంపద భారీగా పెరిగింది. దేశీయ కుబేరుల జాబితాలో అయిదో స్థానంలో నిలిచినా ఉప ఖండంలోని మహిళా సంపన్నుల జాబితాలో ఆమెదే అగ్రస్థానం. మొత్తం సంపద విషయంలో అజీమ్ ప్రేమ్‌జీ (దాదాపు 24 బి.డాలర్లు)ని సావిత్రి అధిగమించారు.
- ఈ ఏడాది ఎక్కువ సంపదను ఆర్జించిన వారి జాబితాలో హెచ్‌సీఎల్ టెక్ అధినేత శివ్‌నాడార్ 8 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిలిచారు. స్థిరాస్తి సంస్థ డీఎల్ఎఫ్ లిమిటెడ్ ఛైర్మన్ కేపీ సింగ్ సంపద 7.15 బిలియన్ డాలర్లు పెరగడంతో, మూడో స్థానంలో ఉన్నారు. ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార్ బిర్లా, షాపూర్ మిస్త్రీ 6.3 బిలియన్ డాలర్ల చొప్పున సంపదను పెంచుకున్నారు. ముకేశ్ అంబానీ సంపద ఈ ఏడాది 5.2 బిలియన్ డాలర్లే పెరిగింది. సన్‌ఫార్మా ఎండీ దిలీప్ సంఘ్వీ, రవి జైపురియా, ఎంపీ లోధా, సునీల్ మిత్తల్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక అనంతరం గౌతమ్ అదానీ సంపద విలువ ఈ ఏడాదిలో 35.4 బిలియన్ డాలర్లు తగ్గింది. అయినా 85.1 బి.డాలర్ల నికర సంపదతో దేశంలోని కుబేరుల్లో రెండో స్థానంలో నిలిచారు. ప్రపంచ కుబేరుల్లో 13వ స్థానంలో ఉన్న ముకేశ్ అంబానీ, దేశీయంగా తొలి స్థానంలో ఉన్నారు.

## మోదీకే అత్యధిక ప్రజామోదం

- ప్రపంచంలోకెల్లా అత్యధిక ప్రజామోదం గల నేతగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి నిలిచారు. దేశంలో ఆయన నాయకత్వాన్ని 76% ప్రజలు హర్షిస్తుండగా 18% మంది మాత్రమే వ్యతిరేకిస్తున్నారు. 'మార్నింగ్ కన్సల్ట్' సంస్థ నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయం వెల్లడైంది. మోదీ తర్వాతి స్థానంలో మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెస్ మాన్యుయెల్ లోపెజ్ ఒబ్రేడర్ ఉన్నారు. ఆయన నాయకత్వాన్ని మెక్సికోలో 66% మంది ఆమోదిస్తుండగా 29% మంది వ్యతిరేకిస్తున్నారు. మార్నింగ్ కన్సల్ట్ సంస్థ దాదాపుగా ప్రతివారం ఈ తరహా సర్వే నిర్వహిస్తుంటుంది.



### మోదీ యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబర్లు 2 కోట్లు

- ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తిగత యూట్యూబ్ ఛానల్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ఛానల్ సబ్‌స్క్రైబర్ల (వీక్షకుల) సంఖ్య రెండు కోట్లు దాటింది. ప్రపంచంలో మరే ఇతర నేతకూ ఇలాంటి ఘనత లభించలేదని అధికార వర్గాలు తెలిపాయి. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2007లో ఈ ఛానల్‌ను మోదీ ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకుంటూ వస్తున్నారు. ఛానల్‌లో మోదీ పోస్ట్ చేసిన వీడియోలకు వీక్షణలు (వ్యూస్) 450 కోట్ల పైమాటే. ఛానల్ సబ్‌స్క్రైబర్ల సంఖ్యలో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో రెండో స్థానంలో ఉన్నారు. ఆయనకు 64 లక్షల మంది వీక్షకులు ఉన్నారు. మోదీతో పోలిస్తే ఇది మూడో వంతు కంటే తక్కువే. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ పోస్ట్ చేసిన వీడియోలకు వ్యూస్ 22.4 కోట్లు. ఆ విషయంలో మోదీ తర్వాత

స్థానం ఆయనదే. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు 7.89 లక్షల మంది, తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్‌కు 3.16 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ప్రధాని మోదీతో ముడిపడిన యూట్యూబ్ ఛానల్ 'యోగా విత్ మోదీ' కి 73,000 మంది, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఛానల్‌కు 35 లక్షల మంది చందాదారులు ఉన్నారు.

## కువైట్ పాలకుడు షేక్ నవాఫ్ మరణం

✓ కువైట్ పాలకుడు షేక్ నవాఫ్ అల్ అహ్మద్ అల్ సబా (86) మరణించారు. మునుపటి పాలకుడు షేక్ సబా అల్ అహ్మద్ అల్ సబా, షేక్ నవాఫ్‌ను 2006లో యువరాజుగా ప్రకటించారు. 2020లో 91 ఏళ్ల వయసులో షేక్ సబా మరణించడంతో కువైట్ ఎమిర్‌గా నవాఫ్ బాధ్యతలు స్వీకరించారు. కరోనా సమయంలో చమురు ధరల పతనంతో సంక్షోభంలో చిక్కుకుపోయిన దేశ ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించే దిశగా పలు చర్యలు తీసుకున్నారు. 1937లో జన్మించిన షేక్ నవాఫ్ 2020 సెప్టెంబరులో కువైట్ పాలనాపగ్గాలు చేపట్టి మూడేళ్లుగా అధికారంలో ఉన్నారు. ప్రస్తుత యువరాజు, నవాఫ్ సవతి సోదరుడు షేక్ మిషల్ అల్ అహ్మద్ అల్ జబేర్ (83) తదుపరి వారసుడిగా అధికారాన్ని చేపట్టనున్నారు.



## ఆస్కార్ విజేత లీ మరణం

✓ 'పారాసైట్' చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకున్న దక్షిణ కొరియా నటుడు, ఆస్కార్ విజేత లీ సన్-క్యున్ దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో మరణించారు. 2020లో ఆయన నటించిన 'పారాసైట్' సినిమా ఉత్తమ చిత్రంతో పాటు మూడు విభాగాల్లో ఆస్కార్ అవార్డులను గెలుచుకుంది. అంతే కాకుండా ఆస్కార్ గెలిచిన తొలి దక్షిణ కొరియన్ చిత్రంగా నిలిచింది. ఆ సినిమాలో తాను చేసిన పాత్రకు లీ 'స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' అవార్డును గెలుచుకున్నారు. లీ చివరిగా 'స్లీప్' చిత్రంలో నటించారు.



## కెప్టెన్ విజయకాంత్ మరణం

✓ డీఎండీకే అధ్యక్షుడు, సినీ నటుడు 'కెప్టెన్' విజయకాంత్ (71) చెన్నైలో మరణించారు. విజయకాంత్ 1952 ఆగస్టు 25న మదురైలోని తిరుమంగళంలో అళగర్‌స్వామి, ఆండాళ్ దంపతులకు విజయకాంత్ జన్మించారు. ఇంటర్ వరకు మదురైలో చదివారు. తమ రైస్ మిల్లులో ఎక్కువ సమయం గడిపి, తర్వాత వరుసగా రెండు సినిమా షోలు చూసేవారు. ఎంజీఆర్ స్ఫూర్తితో సినిమాల్లో నటించాలని చెన్నైకి వచ్చేశారు. తమిళ చిత్రసీమలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. 150కి పైగా చిత్రాల్లో నటించారు.



✓ రాజకీయాల్లోకి రావాలన్న అభిమానుల కోరిక మేరకు ఆ రంగంలో అడుగుపెట్టారు. 'సింహాద్రి' చిత్రాన్ని 'గజేంద్ర'గా రీమేక్ చేసి దాన్ని తన రాజకీయ అరంగేట్రంగా మార్చుకున్నారు. 2005 సెప్టెంబరు 14న 'దేశీయ ముర్పోక్కు ద్రావిడ కళగం' (డీఎండీకే)ను స్థాపించారు. ఆ తర్వాత ఎన్నికల్లో విరుదాచలం నుంచి ఆయనొక్కరే గెలిచారు. 7% ఓటు బ్యాంకును సొంతం చేసుకున్నారు. 2011 ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకున్న డీఎండీకే 29 స్థానాల్లో విజయం సాధించింది. రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది.

## గ్లాక్ పిస్టల్ రూపకర్త గాస్టన్ మరణం

✓ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన గ్లాక్ పిస్టల్ రూపకర్త, ఆస్ట్రియా ఇంజినీర్ గాస్టన్ గ్లాక్ (94) మరణించారు. ఈ హ్యాండ్ గన్‌ను పలు దేశాల సైన్యాలు, భద్రతా దళాలతో పాటు నేరగాళ్లూ వాడుతున్నారు. 1929లో ఆస్ట్రియా రాజధాని వియన్నాలో జన్మించిన గాస్టన్ గ్లాక్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 1980లో సైన్యానికి వస్తువులు సరఫరా చేసే వ్యాపారం చేపట్టారు. అప్పుడు ఆస్ట్రియా దళాలు సరికొత్త పిస్టల్ కోసం చూస్తున్నట్లు తెలుసుకొన్నారు. తన 52వ ఏట గ్లాక్ తుపాకీని డిజైన్ చేశారు. ఇది 18 రౌండ్లు కాల్చగలదు. అమెరికాలో దీనికి విపరీతమైన క్రేజ్ ఉంది. ఇరాక్ మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ అమెరికా సైన్యం నుంచి తప్పించుకొని దాక్కొన్న సమయంలో కూడా ఆయన వద్ద గ్లాక్ గన్ ఉంది. ఈ విషయాన్ని అమెరికా సైన్యం వెల్లడించింది. చిన్న ఆయుధాల తయారీలో గ్లాక్ తిరుగులేని సంస్థగా నిలిచింది. 2021 నాటికి ఫోర్బ్స్ లెక్కల ప్రకారం ఆయన సంపద 1.1 బిలియన్ డాలర్లు.



## ఐటీటీఎఫ్ ఫౌండేషన్‌లో చేరిన తొలి భారతీయురాలుగా వీటా దాని

✓ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ గవర్నింగ్ బోర్డ్ మెంబర్‌గా నియమితులైన తొలి భారతీయురాలుగా వీట దాని చరిత్ర సృష్టించారు. వీటా మరియు ఆమె సంస్థ (దాని ఫౌండేషన్) భారతీయ టేబుల్ టెన్నిస్ యొక్క ఉన్నత పథాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించాయి. ఇండియన్ సూపర్ లీగ్‌లో పాల్గొనే చెన్నైయిన్ ఫుట్‌బాల్ క్లబ్‌కు ఆమె సహ యజమానిగా కూడా ఉన్నారు. ఐటీటీఎఫ్ ఫౌండేషన్ అనేది

అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ యొక్క అనుబంధ ప్రభుత్వేతర సంస్థ. ఇది 2018లో స్థాపించబడింది.

## కబీర్ బేడీకి ఇటలీ అత్యున్నత పౌర పురస్కారం

- ✓ ప్రముఖ నటుడు కబీర్ బేడీకి, ఇటలీ ప్రభుత్వం తమ పౌరులకు అందించే అత్యున్నత పురస్కారం "ఆర్డర్ ఆఫ్ మెరిట్ ఆఫ్ ది ఇటాలియన్ రిపబ్లిక్" (మెరిటో డెల్లా రిపబ్లికా ఇటాలియానా) లభించింది. కబీర్ బేడీ గత 30 సంవత్సరాలుగా ఇటలీతో అనుబంధం కలిగి ఉన్నారు. పాపులర్ ఇటాలియన్ టీవీ మినిసిరీస్‌లో ఆయన పోషించిన పైరేట్ సాండోకన్ పాత్ర, 1983 జేమ్స్ బాండ్ చిత్రం ఆక్టోపస్సీలో విలన్ గోబిందా పాత్రలలో నటనకు ఇటలీ మరియు ఐరోపాలో బాగా పేరు పొందారు.



- ✓ కబీర్ బేడీ బ్రిటీష్ ఇండియాలోని పంజాబ్ ప్రావిన్స్‌లోని లాహోర్‌లో 1946 జనవరి 16న పంజాబీ ఖత్రీ సిక్కు కుటుంబంలో జన్మించాడు. కబీర్ బేడీ 60కి పైగా భారతీయ చిత్రాలలో నటించారు. చారిత్రక ఇతిహాసం తాజ్ మహల్: యాన్ ఎటర్నల్ లవ్ స్టోరీలో అతను షాజహాన్ చక్రవర్తిగా నటించాడు. బేడీ ప్రస్తుతం భారతదేశంలోని ముంబైలో నివసిస్తున్నారు.

## ప్రఖ్యాత హిందీ రచయిత్రి పుష్ప భారతికి వ్యాస సమ్మాన్ అవార్డు

- ✓ ప్రఖ్యాత హిందీ రచయిత్రి పుష్పా భారతి తన 2016 మెమోయిర్ "యాదీన్, యాదీన్ ఔర్ యాదీన్" కోసం 33వ వ్యాస్ సమ్మాన్ అవార్డు 2023 అందుకున్నారు. 2016లో ప్రచురించబడిన ఈ పుస్తకం భారతి జీవితం మరియు అనుభవాలతో ఉత్తేజపరిచే అన్వేషణను అందిస్తుంది. ఈ అవార్డు ఎంపిక భారతి జ్ఞాపకాల యొక్క సాహిత్య యోగ్యతను మరియు హిందీ సాహిత్యానికి చేసిన కృషిని గుర్తించినట్లు అయ్యింది. ఇది పాఠకులకు మానవ అనుభవాలు మరియు భావోద్వేగాలపై లోతైన అవగాహనను అందించడంలో వ్యక్తిగత కథనాల యొక్క ప్రాముఖ్యతను కూడా హైలైట్ చేస్తుంది.
- ✓ వ్యాస్ సమ్మాన్ అవార్డు కేకే బిర్లా ఫౌండేషన్ ద్వారా 1991లో స్థాపించబడింది. ఈ అవార్డు గత 10 సంవత్సరాలలో హిందీ సాహిత్యంలో ప్రచురించబడిన అత్యుత్తమ రచనలకు ప్రతి సంవత్సరం అందజేస్తారు. విజేతకు నాలుగు లక్షల నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తారు. ఇది దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సాహిత్య పురస్కారాలలో ఒకటిగా పరిగణించబడుతుంది.

## టైమ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా టేలర్ స్విఫ్ట్

- ✓ ప్రముఖ అమెరికన్ సింగర్ టైలర్ స్విఫ్ట్ 2023 ఏడాదికి సంబంధించి టైమ్ మ్యాగజైన్ పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచారు. బార్బీ, కింగ్ చార్లెస్ III మరియు ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్‌తో సహా తొమ్మిది మంది ఫైనలిస్టుల బృందం నుండి స్విఫ్ట్ దీని కోసం ఎంపిక చేయబడింది. ఆమె ఈ ప్రతిష్ఠాత్మకమైన గౌరవాన్ని అందుకోవడం రెండవసారి. గతంలో ఆమె 2017లో టైమ్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికయ్యింది.




- ✓ టైమ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అనేది అమెరికన్ న్యూస్ మ్యాగజైన్ మరియు వెబ్‌సైట్ టైమ్ యొక్క వార్షిక సంచిక. ఇది ఆ ఏడాదిలో ప్రభావితం చేసిన వ్యక్తులకు, సంస్థలకు లేదా ఉత్పత్తులకు అంకితం చేయబడుతుంది. ఇది 1927 నుండి ప్రచురించబడుతుంది. 1999 వరకు దీనిని మ్యాన్ ఆఫ్ ది ఇయర్ లేదా ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అని పిలిచేవారు.

## అభయ్‌కుమార్ గిన్నిస్ రికార్డు

- ✓ సాధారణంగా గత వారం ఫలానా తేదీ ఏ రోజు వచ్చిందో చెప్పమంటే మనం వెంటనే ఫోన్లలో క్యాలెండరును తెరుస్తాం. అలాంటిది ఎటువంటి ఆధారం లేకుండా పది వేల ఏళ్లకు సంబంధించి 19 వేర్వేరు క్యాలెండరు తేదీలు ఏ రోజు వచ్చాయో కేవలం ఒక్క నిమిషంలోనే చెబుతున్నాడు బిహార్‌కు చెందిన అభయ్‌కుమార్ (30). అలాగే 91 దేశాలకు చెందిన పాస్‌పోర్టులను వాటిపై ఉన్న చిహ్నాల ఆధారంగా ఒక్క నిమిషంలోనే గుర్తిస్తున్నాడు. వైశాలి జిల్లా హాజీపుర్‌కు చెందిన ఈ యువకుడు తన జ్ఞాపకశక్తితో ఇప్పటివరకు మూడు గిన్నిస్ రికార్డులను నెలకొల్పాడు. తండ్రి సహేంద్ర పాసవాన్ ప్రొఫెసరు కాగా, తల్లి ప్రేమ్ శీలాకుమారి గృహిణి. 2016లో మెకానికల్ ఇంజినీరింగు పూర్తిచేసిన అభయ్ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా చేరి 2020 వరకు పనిచేశాడు. ఆ తర్వాత వచ్చిన కొవిడ్ సమయాన్ని సద్వినియోగం చేసుకొని తన జ్ఞాపకశక్తికి పదును పెట్టాడు. పలు రకాల పుస్తకాలు చదివాడు. ఇపుడు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు జ్ఞాపకశక్తిని పెంపొందించుకొనే ప్రత్యేక తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నాడు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ వెబ్‌సైట్‌ను కూడా రూపొందించాడు.






## 'హురున్ ఇండియా టాప్ 100 అండర్ 30 ఎంటర్ ప్రెన్యూర్స్ వాచ్ లిస్ట్ 2023'

✓ పాతిక, ముప్పై ఏళ్ల లోపు ఏదైనా మంచి ఉద్యోగం సంపాదించి, జీవితంలో స్థిరపడటం అనేదే ఎంతో కష్టం. అటువంటిది ఆ వయసులోనే సొంతంగా ఒక సంస్థను స్థాపించి, విజయవంతంగా నిర్వహిస్తూ రూ.వందల కోట్లకు అధిపతి కావడం అనేది అనూహ్యమైన విషయం. అటువంటి ఘనత సాధించిన వారి జాబితాను హురున్ ఇండియా రూపొందించింది. తమకున్న సాంకేతిక నైపుణ్యానికి, సరికొత్త వ్యాపార వ్యూహాలను జోడించి తక్కువ సమయంలోనే విజయ శిఖరాలు అధిరోహించిన వారికి ఇందులో చోటు దొరికింది. ఇంకా ఎన్నో ఆసక్తికర విషయాలు ఈ జాబితా ద్వారా వెలుగులోకి వచ్చాయి.



✓ ▸ 'హురున్ ఇండియా టాప్ 100 అండర్ 30 ఎంటర్‌ప్రెన్యూర్స్ వాచ్ లిస్ట్ 2023' పేరుతో విడుదల చేసిన ఈ జాబితాలో ముంబయికి చెందిన జెప్టో అనే క్విక్ కామర్స్ సంస్థ వ్యవస్థాపకులైన కైవల్య వోహ్రా (21 ఏళ్లు), ఆదిత్ పలిఛ (22 ఏళ్లు) లకు అగ్రస్థానం దక్కింది. హైదరాబాద్‌కు చెందిన ఎడ్‌టెక్ సంస్థ, భాంజు వ్యవస్థాపకుడు నీలకంఠ భాను ప్రకాష్ (24 ఏళ్లు) ఈ జాబితాలో చోటు సంపాదించుకున్నారు.

✓ ఈ జాబితాలో మొత్తం అయిదుగురు మహిళలు ఉండగా 'స్కిల్ మ్యాటిక్స్' కు చెందిన దేవాన్షి కేజ్రీవాల్ (27 ఏళ్లు) అందరి కంటే చిన్నవారు. మరొక ప్రత్యేకత ఏమిటంటే 8 మంది యువ వ్యాపారవేత్తలు స్పేస్‌టెక్ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించడం. ఈ జాబితాలో అధికంగా సాస్ (సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్) కంపెనీల వ్యవస్థాపకులు 19 మంది ఉన్నారు.

✓ ఫిన్‌టెక్, ఎడ్‌టెక్ రంగాలకు చెందిన 11 కంపెనీల ప్రతినిధులకు ఇందులో చోటు దొరికింది. బెంగళూరుకు చెందిన కంపెనీలు/వ్యవస్థాపకుల సంఖ్య ఈ జాబితాలో అధికంగా ఉంది. తదుపరి స్థానాల్లో ముంబయి, దిల్లీకి చెందిన వారు ఉన్నారు. బెంగళూరు నుంచి 10 మంది, ముంబయి నుంచి 9 మంది, దిల్లీ నుంచి 8 మంది ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఉన్నారు.

✓ ఈ జాబితాలో స్థానం సంపాదించిన యువ వ్యాపారవేత్తల్లో ఐఐటీ – రూర్కీ పట్టభద్రులైన 8 మంది ఉండటం గమనార్హం. ఐఐటీ – కాన్పూర్ నుంచి ఏడుగురు, ఐఐటీ – దిల్లీ నుంచి ఆరుగురు, ఐఐటీ – బాంబే, మద్రాస్ నుంచి అయిదుగురు చొప్పున ఉన్నారు.

**ఏపీ, తెలంగాణ నుంచి అయిదుగురు**

✓ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అయిదుగురు ఔత్సాహిక వ్యాపారవేత్తలు పిన్న వయసు లోనే మంచి విజయాలు నమోదు చేసి హురున్ జాబితాలో స్థానం సంపాదించారు.

✓ హైదరాబాద్ నుంచి నీలకంఠ భాను ప్రకాష్ (24 ఏళ్లు, భాంజు, ఎడ్యుటెక్ కంపెనీ)తో పాటు, శశాంక్ రెడ్డి గుజ్జుల (27 సంవత్సరాలు, నెక్ట్స్‌వేవ్, ఎడ్యుటెక్ కంపెనీ), రాకేష్ మున్ననూరు (29 ఏళ్లు, విజిల్‌డ్రైవ్, సాస్ కంపెనీ), అనురాగ్ మాలెంపాటి (30 ఏళ్లు, లీవ్ ఇండియా ఫుడ్, లాజిస్టిక్స్ సేవల కంపెనీ) ఉన్నారు.

✓ ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి మండలానికి చెందిన అనుపమ్ పెదర్ల (29 ఏళ్లు, నెక్ట్స్‌వేవ్, ఎడ్‌టెక్ కంపెనీ)కు సైతం ఈ జాబితాలో స్థానం దక్కింది.

## లాజిస్టిక్స్ పర్ఫార్మెన్స్ సూచీలో 'అచీవర్స్' గా 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు

✓ ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, చండీగఢ్, గుజరాత్ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి మొత్తం 13 లాజిస్టిక్స్ పర్ఫార్మెన్స్ సూచీ జాబితా 2023లో 'అచీవర్స్' విభాగంలో చోటు సంపాదించాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధీనంలోని డీపీఐఐటీ నివేదిక వెల్లడించింది. ఎగుమతులు, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించేందుకు అవసరమైన లాజిస్టిక్స్ సేవల సామర్థ్యానికి ఈ సూచీ ఒక సూచిక లాంటిది. గత ఏడాది (2022) మొత్తం 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు 'అచీవర్స్' జాబితాలో ఉండగా, ఈ ఏడాది హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లు 'ఆస్పైరర్స్' , 'ఫాస్ట్ మూవర్స్' జాబితాలోకి దిగడంతో 13 రాష్ట్రాలు, కేంద్ర

పాలిత ప్రాంతాలు మాత్రమే జాబితాలో నిలిచాయి. సిక్కిం, త్రిపుర రాష్ట్రాలు చేపట్టిన చర్యలతో 'ఫాస్ట్ మూవర్స్' జాబితా నుంచి 'అచీవర్స్' జాబితాలోకి వచ్చాయి. ఢిల్లీ, అస్సాం, హరియాణా, పంజాబ్, తెలంగాణ, ఉత్తర్ ప్రదేశ్‌లు ఈ జాబితాలోని మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు.కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, అండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరిలు 'ఫాస్ట్ మూవర్స్' జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. గోవా, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, మణిపుర్, మేఘాలయ, మిజోరం, దామన్ అండ్ డయ్యు, దాద్రా అండ్ నగర్ హవేలీ, జమ్ము అండ్ కశ్మీర్, లద్దాఖ్‌లు 'ఆస్పైరర్స్' జాబితాలో నిలిచాయి.

## 95 శాతం మందికి బీమా లేదు: జాతీయ బీమా అకాడమీ నివేదిక

- ✓ దేశ జనాభా సుమారు 144 కోట్లు ఉండగా, ఇందులో 95 శాతం మందికి బీమా లేదని జాతీయ బీమా అకాడమీ తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. బీమా కవరేజీని ఎక్కువ మందికి విస్తరింపజేసేందుకు ప్రభుత్వం, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ ప్రయత్నాలు చేస్తున్నా అధిక శాతం జనాభా ఇంకా బీమా పరిధిలోకి రాకపోవడం గమనార్హం. జాతీయ బీమా అకాడమీ రూపొందించిన నివేదికను భారతీయ బీమా నియంత్రణ, ప్రాధికారిక సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఛైర్మన్ దేబాసిష్ పాండా విడుదల చేశారు. మొబైల్ ద్వారా సులభంగా, సురక్షితంగా చేయగలగడంతో దేశంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు బాగా పెరిగాయని, బ్యాంక్ ఖాతాలు తెరవడం కూడా సులభతరమైందని గుర్తు చేస్తూ, ఈ పద్ధతులను అనుసరించి బీమా వ్యాప్తికి కృషి చేయాలని పరిశ్రమ వర్గాలకు పాండా సూచించారు.

## ప్రపంచ సగటులో భారత్ ఉద్గారాలు సగమే

- ✓ కార్బన్ డయాక్సైడ్ (సీఓ2) వెలువరించడంలో 2022లో భారతదేశ సగటు 5% మేర పెరిగినా అది ప్రపంచ సరాసరిలో సగం కంటే తక్కువేనని అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందంతో కూడిన 'గ్లోబల్ కార్బన్ ప్రాజెక్టు' తేల్చింది. వాతావరణ మార్పులపై దుబాయ్‌లో జరుగుతున్న కాప్28 సదస్సు నేపథ్యంలో తాజా నివేదిక విడుదలైంది. దీని ప్రకారం అమెరికాలో ప్రతి పౌరుడి వల్ల సగటు సీఓ2 ఉద్గారాలు 14.9 టన్నులుగా తేలింది. ఇది ప్రపంచంలోనే అత్యధికం. తర్వాతి స్థానాల్లో రష్యా (11.4), జపాన్ (8.5), చైనా (8), ఐరోపా సమాఖ్య (6.2 టన్నులు) ఉన్నాయి.
- ✓ ప్రపంచవ్యాప్త సగటు 4.7 టన్నులు. భారత్‌లో ఇది 2 టన్నులు. పారిశ్రామిక విప్లవం మొదలైనప్పటి నుంచి సీఓ2 వెలువరించడంలో అమెరికాయే ప్రథమ స్థానంలో ఉంది. 1850 – 2022 మధ్య అమెరికా నుంచి వెలువడిన సీఓ2 115 గిగా టన్నులు. ఇది మొత్తం ప్రపంచ ఉద్గారాల్లో 24%. భారత్ నుంచి వెలువడినవి 15 గిగా టన్నులు.
- ✓ ‣ ప్రపంచంలో ఇది కేవలం మూడు శాతమే. 2022 వరకు విడిగా చూస్తే ప్రపంచంలో చైనా (31%), అమెరికా (14%)ల తర్వాతి స్థానంలో భారత్ (8%) నిలుస్తుంది. భారత్‌లో కర్బన ఉద్గారాల్లో బొగ్గుది 9.5% వాటా కాగా సిమెంటుది 8.8%. ఈ ఏడాది చివరికి ప్రపంచం మొత్తం నుంచి 3,680 కోట్ల టన్నుల సీఓ2 వెలువడుతుందని అంచనా. 2030 నాటికి ఉద్గారాలను 43% మేర తగ్గించడంపై కాప్ సదస్సులో ప్రధానంగా చర్చలు జరుగుతున్నాయి.

### భారత్‌లో పెరిగిన వేడి

- ✓ 2011 – 2020 దశాబ్దంలో భారత్‌లో వేడిమి పెరిగిందని ఐరాసకు చెందిన 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంఓ) కాప్ సదస్సులో విడుదల చేసిన నివేదిక తెలిపింది. పసిఫిక్ మహా సముద్రంలో జలాలు వేడెక్కడం, చల్లబడడం కూడా అసాధారణ స్థాయిలో ఉన్నట్లు ఈ నివేదిక గుర్తించింది.
- ✓ 2023 అత్యంత వేడి సంవత్సరంగా పేర్కొంది. బాగా చల్లగా ఉండే రోజులు 1961 – 90 మధ్య కాలంతో పోలిస్తే 2011 – 20 మధ్య 40% తక్కువ అని తెలిపింది. వాతావరణ మార్పుల వల్ల పంట దిగుబడులపై, నీటి లభ్యతపై ప్రభావం పడుతోందని వివరించింది. ధ్రువ ప్రాంతాల్లో మంచు కరుగుదల వేగం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

## ఆసియాలో దీర్ఘకాలిక సమస్యగా ఆకలి: ఎఫ్ఏఓ తాజా నివేదిక

- ✓ ఆసియాలో ఆకలి దీర్ఘకాలిక సమస్యగా మారిపోయింది. 2022 నాటికి దక్షిణాసియాలో 5.5 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఐక్యరాజ్యసమితి అనుబంధ ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) తాజా నివేదికలో పేర్కొంది. కొవిడ్ కాలంలో ఈ ప్రాంతంలో 7.3 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడగా 2022లో ఆ సంఖ్య 8.4 శాతానికి పెరిగినట్లు ఎఫ్ఏఓ పేర్కొంది.

FOOD AND AGRICULTURE ORGANIZATION OF THE UNITED NATIONS

ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న ప్రజలు ఇక్కడ అధికంగా ఉన్నారని, వారి ఆర్థిక పరిస్థితి కారణంగా నాణ్యత లేని ఆహారాన్నే వారు తినాల్సి వస్తోందని తెలిపింది. తూర్పు ఆసియా మినహా ఆసియాలో ప్రతి ఐదుగురు మహిళల్లో ఇద్దరు తీవ్ర ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నట్లు ఎఫ్ఏఓ పేర్కొంది. దక్షిణాసియాలో

ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న వారిలో పురుషులు 37 శాతం ఉంటే మహిళల సంఖ్య 42 శాతం ఉందని తెలిపింది. ఆహార సంక్షోభం కారణంగా ఆఫ్రికాలో ప్రతి నలుగురిలో ముగ్గురు ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేకపోతున్నారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. నివేదిక ప్రకారం ప్రపంచ సగటు పోషకాహార లోపం 9.2 శాతం కాగా దక్షిణాసియాలో దాదాపు 16 శాతం మంది ప్రజలు పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు ఎఫ్ఏఓ తమ నివేదికలో పేర్కొంది.

## ప్రపంచ రెండవ అతిపెద్ద ఉక్కు ఉత్పత్తిదారునిగా భారతదేశం

- ✓ భారతదేశం ప్రపంచంలో 2వ అతిపెద్ద ముడి ఉక్కు ఉత్పత్తిదారునిగా అవతరించినట్లు కేంద్ర ఉక్కు & పౌర విమానయాన మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా వెల్లడించారు. ఉక్కు రంగంపై దృష్టి సారించిన "సేవ, సుశాసన్ మరియు గరీబ్ కళ్యాణ్" యొక్క 9-సంవత్సరాల థీమ్‌పై ఆయన మాట్లాడారు. గత 9 సంవత్సరాలలో 6.02 మెట్రిక్ టన్నుల దిగుమతికి బదులుగా 6.72 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను ఎగుమతి చేయడం ద్వారా భారతదేశం ఉక్కు యొక్క నికర ఎగుమతిదారునిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.
- ✓ 2023లో 90.8 మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తితో చైనా అగ్రస్థానంలో ఉండగా, 14.3% వృద్ధితో 11.5 మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేసి భారత్ రెండవ స్థానంలో ఉంది. జపాన్ 0.9% వృద్ధితో 7.4 మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో మూడవ స్థానంలో, యునైటెడ్ స్టేట్స్ 0.5% వృద్ధితో 6.9 మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో నాల్గొవ స్థానంలో ఉన్నాయి.

## సోలార్ రూఫ్‌టాప్ ఇన్‌స్టాలేషన్‌లో గుజరాత్ అగ్రస్థానం

- ✓ దేశంలో సోలార్ రూఫ్‌టాప్ ఇన్‌స్టాలేషన్‌లో గుజరాత్ అగ్రస్థానంలో నిలిచింది. రూఫ్‌టాప్ సోలార్ ప్రోగ్రామ్ ఫేజ్ II కింద నివాస భవనాల కోసం దేశంలోని మొత్తం రూఫ్‌టాప్ ఇన్‌స్టాలేషన్‌లో ఈ రాష్ట్రం 84 శాతం వాటాను కలిగి ఉందని తాజా డేటా తెలియజేస్తుంది. అలానే భారతదేశంలో సౌర విద్యుత్ వినియోగంలో కూడా గుజరాత్ అగ్రగామిగా ఉంది.
- ✓ మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ 2019లో రూఫ్‌టాప్ సోలార్ ప్రోగ్రామ్ ఫేజ్-IIని ప్రారంభించింది. ఈ ప్రోగ్రామ్ కింద గ్రామీణ ప్రాంతాల్లోని గృహాలలో వ్యక్తిగత నివాస వినియోగదారుల కోసం సబ్సిడీ విధానం అమలు చేస్తుంది. 3 కిలో వాట్స్ నుండి 10 కిలో వాట్స్ సోలార్ ప్లాంట్ కోసం 17వేల నుండి లక్ష రూపాయల సబ్సిడీ అందిస్తుంది. దీని కోసం 11,814 కోట్ల బడ్జెట్ కేటాయించింది. ప్రస్తుతం ఈ ప్రోగ్రామ్ 2026 వరకు పొడిగించింది. ఈ ప్రోగ్రామ్ కింద దేశ వ్యాప్తంగా 4000 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్స్ నెలకొల్పే లక్ష్యం పెట్టుకుంది.

## ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2024

- ✓ 11వ ఎడిషన్ ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2024, ఇంపాక్ట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆన్ స్కిల్స్, వర్క్, మోన్‌బిలిటీ' అనే శీర్షికతో డిసెంబర్ 20న విడుదల చేయబడింది. ఈ నివేదిక ఉపాధి రేటు, రాష్ట్రాల వారీగా ఉపాధి పోకడలు, అభివృద్ధి చెందుతున్న నైపుణ్య ధోరణులు, లింగ వైవిధ్యం వంటి అంశాలకు సమ్మందించిన తాజా డేటాను అందిస్తుంది. దేశంలో నైపుణ్యం అంతరాన్ని తగ్గించడానికి మరియు భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు యువతను సిద్ధం చేయడానికి భారతీయ విద్య మరియు శిక్షణా వ్యవస్థ మెరుగుపరచాల్సిన అంశాలను కూడా ఈ నివేదిక హైలైట్ చేసింది.
- ✓ ఈ నివేదిక వీబాక్స్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ మరియు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీలతో సహా వివిధ ఏజెన్సీలతో కలిసి ప్రచురించబడింది. భారతదేశం అంతటా వీబాక్స్ నేషనల్ ఎంప్లాయబిలిటీ టెస్టులలో పాల్గొన్న 3.88 లక్షల మంది అభ్యర్థుల అభిప్రాయం ఆధారంగా ఇది రూపొందించబడింది. అదనంగా ఈ నివేదిక 15 విభిన్న పరిశ్రమలకు చెందిన 152 కార్పొరేషన్ల నుండి అభిప్రాయలను తీసుకుంది.
- ✓ ఈ నివేదిక కృత్రిమ మేధస్సు అభివృద్ధిలో భారత్ అగ్రదేశాలతో పోటీపడుతున్నట్లు నివేదించింది. ఆగస్టు 2023 నాటికి దేశంలో 4.16 లక్షల మంది ఏఐ నిపుణులు ఉన్నట్లు తెలిపింది. ఈ సంఖ్య పెరుగుతున్న డిమాండ్ ప్రకారం 2026 నాటికి 1 మిలియన్‌కు చేరుకుంటుందని పేర్కొంది.
- ✓ కృత్రిమ మేధస్సు నైపుణ్యం వ్యాప్తి మరియు ప్రతిభ ఏకాగ్రతలో భారతదేశం మొదటి స్థానంలో ఉందని నివేదించింది.
- ✓ భారతదేశంలో మొత్తం యువ ఉపాధి అవకాశాలు 51.25%కి మెరుగుపడినట్లు నివేదించింది. ఈ అంశంలో హర్యానా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి.
- ✓ కేరళ, మరియు తెలంగాణలలో అధిక యువ ఉద్యోగావకాశాలు ఉన్నట్లు వెల్లడించింది.
- ✓ ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2024 ప్రకారం కేరళ పని చేయడానికి అత్యంత ప్రాధాన్య రాష్ట్రంగా నిలిచింది.
- ✓ వయస్సు వారీగా చూస్తే 18-21 సంవత్సరాల వయస్సు గలవారిలో అత్యధికంగా 85.45% మంది తెలంగాణాలో ఉపాధి పొందగా 74.93% తో కేరళ రెండవ స్థానంలో ఉంది.

- ✓ 22 నుండి 25 ఏళ్ళ యువ ప్రతిభావంతుల్లో ఉత్తర ప్రదేశ్ మరియు మహారాష్ట్రలు అగ్రస్థానంలో ఉన్నాయి. 26-29 సంవత్సరాల వయస్సు గలవారిలో గుజరాత్ అగ్రస్థానంలో ఉంది.
- ✓ అత్యధిక ఉపాధి యోగ్యమైన వనరుల సేకరణలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. ఐటి, ఫైనాన్స్, హెల్త్‌కేర్, ఆటోమోటివ్ మరియు తయారీ రంగాల్లో విజృంభిస్తున్న డిమాండ్‌ను తక్షణమే తీర్చగల అద్భుతమైన టాలెంట్ పూల్ ఆంధ్రప్రదేశ్‌లో ఉందని నివేదిక పేర్కొంది.
- ✓ కంప్యూటర్ నైపుణ్యాలను పెంపొందించడంలో నగరాలలో జాబితాలో తిరువనంతపురంమొదటి స్థానాన్ని పొందగా, రాష్ట్రాలలో కేరళ మూడవ స్థానంలో నిలిచింది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ఈ కేటగిరిలో టాప్ 2లో ఉన్నాయి.
- ✓ పురుషులు మరియు మహిళలు ఇద్దరూ పని చేయడానికి ఇష్టపడే నగరాల్లో కొచ్చి మరియు తిరువనంతపురం వరుసగా రెండవ మరియు నాల్గవ స్థానంలో నిలిచాయి.

## వ్యవసాయ మార్కెటింగ్ సంస్కరణల్లో ఆంధ్ర ప్రదేశ్ అగ్రస్థానం

- ✓ నీతి ఆయోగ్ వ్యవసాయ మార్కెటింగ్ మరియు రైతు స్నేహపూర్వక సంస్కరణల సూచిక (ఏఎంఎఫ్ఎఫ్ఆర్ఐ) లో 94 స్కోరుతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం దక్కించుకుంది. ఆ తర్వాత స్థానాలలో ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ మరియు అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. ఈ ర్యాంకింగ్ అగ్రి-మార్కెటింగ్, ఇ-ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్, సింగిల్ యూనిఫైడ్ లైసెన్స్, మార్కెట్ ఫీజుల హేతుబద్ధీకరణ, వ్యవసాయ రాతీయలు, ఇ-నామ్ మాడ్యూల్స్ వంటి కీలక అంశాల ఆధారంగా నిర్ణయిస్తుంది.
- ✓ వ్యవసాయ మార్కెటింగ్ మరియు రైతు స్నేహపూర్వక సంస్కరణల సూచిక అనేది వ్యవసాయ రంగంలో మార్కెట్ ఆధారిత సంస్కరణల అమలుపై భారతీయ రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలను అంచనా వేయడానికి 2016లో నీతి ఆయోగ్ ప్రారంభించింది. భారతదేశంలోని వ్యవసాయ రంగాన్ని అతలాకుతలం చేస్తున్న ఉత్పాదకత, వృద్ధి మరియు తక్కువ వ్యవసాయ రాబడి వంటి సంక్షోభాలను నివారించేందుకు సమూల సంస్కరణలు చేపట్టే దిశగా దీనిని ప్రారంభించింది.

## భారతదేశ అగ్రగామి హాస్పిటల్‌గా ఆస్టర్ మెడ్‌సిటీ

- ✓ ది వీక్-హన్సా రీసెర్చ్ 2023 ద్వారా కేరళలోని కొచ్చిలో ఉన్న ఆస్టర్ మెడ్‌సిటీ ఇటీవల 'ఉత్తమ మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్ ఎమర్జింగ్' విభాగంలో అగ్ర స్థానాన్నిదక్కించుకుంది. నాణ్యతతో కూడిన ఆరోగ్య సంరక్షణను అందించడంలో ఈ ఆసుపత్రి నిబద్ధతకు ఈ ప్రతిష్ఠాత్మక ర్యాంకింగ్ అందించబడింది. ఈ ఏడాది ఆల్ ఇండియా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ర్యాంకింగ్ సర్వే కూడా ఈ హాస్పిటల్ దేశవ్యాప్తంగా 4వ స్థానంలో నిలిచింది.
- ✓ ఆస్టర్ మెడ్‌సిటీ 2015లో ప్రారంభించబడింది. ఇది ప్రారంభమైనప్పటి నుండి భారతీయ ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలో రికార్డులు సృష్టిస్తోంది. ఇది క్లినికల్ ఎక్సలెన్స్ మరియు అత్యాధునిక సాంకేతికతకు ప్రసిద్ధి చెందింది. ఆస్టర్ మెడ్‌సిటీ ఈ ఏడాది దక్షిణ భారతదేశంలో 2వ స్థానంలో మరియు జాతీయ స్థాయిలో 4వ స్థానంలో నిలిచింది.

## ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ రుణ నివేదిక 2023

- ✓ ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ రుణ నివేదిక 2023 (ఐడీఆర్ 2023), డిసెంబర్ 13న విడుదల చేయబడింది. ఈ నివేదిక 122 తక్కువ మరియు మధ్య-ఆదాయ దేశాల రుణ పోకడలు మరియు బాహ్య రుణ గణాంకాలపై సమగ్ర విశ్లేషణను అందిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు 2022లో రికార్డు స్థాయిలో \$443.5 బిలియన్ల ప్రభుత్వ రుణాలు చెల్లించినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా వడ్డీ రేట్లు పెరగడంతో ఇది మునుపటి సంవత్సరం కంటే 5% పెరుగుదలకు దారితీసినట్లు వెల్లడించింది.
- ✓ 2023 మరియు 2024లో ప్రపంచంలోని 24 పేద దేశాల యొక్క రుణ భారం 39% వరకు పెరగవచ్చని ఈ తాజా అంతర్జాతీయ రుణ నివేదిక తెలిపింది. రికార్డు స్థాయిలో రుణాలు అభివృద్ధి చెందుతున్న దేశాలను సంక్షోభంలో పడేస్తాయని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. పెరుగుతున్న వడ్డీ రేట్లతో ఆరోగ్యం, విద్య మరియు వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవడం వంటి ప్రాథమిక అంశాలపై ఖర్చు చేసేందుకు ప్రభుత్వాలు ద్రవ్య లోటును ఎదుర్కొంటాయని నివేదించింది.
- ✓ ఈ నివేదిక గత మూడేళ్లలో 10 అభివృద్ధి చెందుతున్న దేశాలలో 18 సావరిన్ డిఫాల్ట్‌లు జరిగాయని పేర్కొంది. ఇది గత రెండు దశాబ్దాలలో కలిపిన మొత్తం కంటే ఎక్కువని తెలిపింది. ఈ జాబితాలో ఘనా, శ్రీలంక మరియు జాంబియా వంటి దేశాలు ఉన్నట్లు వెల్లడించింది. పేద దేశాలకు సహాయం చేయడానికి రూపొందించబడిన ప్రపంచ బ్యాంక్ యొక్క ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ నుండి రుణం తీసుకోవడానికి 75 దేశాలు ప్రస్తుతం అర్హత కలిగి ఉన్నట్లు తెలిపింది. అయితే వీటిలో 11 దేశాలు ఇప్పటికే తీవ్రమైన రుణాల ఊబిలో చిక్కుకుపోయి ఉన్నట్లు కూడా పేర్కొంది.
- ✓ గత కొద్దికాలంగా ప్రైవేట్ రుణదాతల నుండి ఫైనాన్సింగ్ తగ్గిపోవడంతో, ప్రపంచ బ్యాంక్ మరియు ఇతర బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకులు అంతరాన్ని పూడ్చడంలో సహాయం చేసినట్లు పేర్కొంది. 2022లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు కొత్తగా

$115 బిలియన్లు వీరు అందించినట్లు పేర్కొంది. వీటిలో దాదాపు సగం ప్రపంచ బ్యాంకు అందించింది. ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ద్వారా, ప్రపంచ బ్యాంక్ ఈ దేశాలకు కొత్త ఫైనాన్సింగ్‌లో $16.9 బిలియన్లు అందించింది. దీనికి అదనంగా ఈ దేశాలకు $6.1 బిలియన్ల గ్రాంట్లను కూడా పంపిణీ చేసింది.

- ✓ తాజా అంతర్జాతీయ రుణ నివేదిక ప్రచురణ, ప్రపంచ బ్యాంకు యొక్క 50వ వార్షికోత్సవ నివేదిక. ఇది ప్రపంచ బ్యాంక్ యొక్క అంతర్జాతీయ రుణ గణాంకాల డేటాబేస్ నుండి కీలక అంతర్దృష్టులను హైలైట్ చేస్తుంది. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాల బాహ్య రుణ డేటా యొక్క అత్యంత సమగ్రమైన మరియు పారదర్శక మూలం. భారతీయ రిజర్వ్ బ్యాంక్ నివేదిక ప్రకారం భారతదేశం యొక్క బాహ్య రుణ భారం డిసెంబర్ 2023 చివరి నాటికి 629.1 బిలియన్ డాలర్లగా ఉంది.

## గ్లోబల్ స్టేటస్ రిపోర్ట్ ఆన్ రోడ్డు సేఫ్టీ 2023

- ✓ ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన తాజా రహదారి భద్రత మూల్యాంకనం (గ్లోబల్ స్టేటస్ రిపోర్ట్ ఆన్ రోడ్డు సేఫ్టీ 2023) ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల సంఖ్య 5 శాతం తగ్గినట్లు నివేదించింది. అయితే భారతదేశంలో వీటి సంఖ్య పెరుగుతున్నట్లు పేర్కొంది. రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతి సంవత్సరం సుమారు 1.19 మిలియన్ల మంది మరణిస్తున్నట్లు తెలిపింది. ప్రతి నిముషానికి ఇద్దరు చెప్పున, రోజుకు 3,200 మంది ప్రపంచ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నట్లు నివేదించింది.
- ✓ రోడ్డు ట్రాఫిక్ క్రాష్ ఫలితంగా ప్రతి సంవత్సరం సుమారు 1.19 మిలియన్ల మంది మరణిస్తున్నారు. 20 మరియు 50 మిలియన్ల మంది గాయాల పాలవుతున్నారు.
- ✓ రోడ్డు ప్రమాదాల మరణాలు మరియు కారణమయ్యే వారిలో అత్యధికంగా 5-29 సంవత్సరాల వయస్సు గల పిల్లలు మరియు యువకులు ఉన్నట్లు ఈ నివేదిక పేర్కొంది.
- ✓ ప్రపంచ వ్యాప్తంగా 60% వాహనాలు కలిగిన మధ్య-ఆదాయ దేశాలలోనే 92 శాతం రోడ్డు ప్రమాదాలు సంభవించినట్లు పేర్కొంది.
- ✓ రోడ్డు ట్రాఫిక్ మరణాలు ఆఫ్రికన్ రీజియన్‌లో అత్యధికంగా, యూరోపియన్ ప్రాంతంలో అత్యల్పంగా ఉన్నాయి.
- ✓ 2022లో భారతదేశం అత్యధిక సంఖ్యలో 1.68 లక్షల మరణాలు నమోదు అయ్యాయి. అనగా సగటున రోజుకు 462 మరణాలు లేదా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు.
- ✓ రోడ్డు ట్రాఫిక్ మరణాలలో సగానికి పైగా పాదచారులు, సైక్లిస్టులు మరియు మోటార్‌సైకిల్‌దారులు ఉన్నారు.
- ✓ రోడ్డు ప్రమాద బాధితులకు వైద్యం, సహాయం అందించేందుకు దేశాలు వాటి స్థూల దేశీయోత్పత్తిలో 3% నష్టపోతున్నాట్లు నివేదించింది.
- ✓ రోడ్డు ప్రమాదాలలో ఆడవారి కంటే, 3 రెట్ల మంది పురుషులు చనిపోతున్నారు.
- ✓ అత్యధిక రోడ్డు ప్రమాదాలకు అతివేగం, మద్యపానం కారణమౌతున్నట్లు పేర్కొంది.
- ✓ సరైన హెల్మెట్ వాడకం వల్ల రోడ్డు ప్రమాదంలో మరణించే ప్రమాదాన్ని 6 రెట్ల కంటే ఎక్కువ తగ్గించవచ్చని మరియు మెదడుకు గాయం ప్రమాదాన్ని 74% వరకు తగ్గించవచ్చని ఈ నివేదిక పేర్కొంది. సీటు బెల్ట్ ధరించడం వలన వాహనంలో ప్రయాణించేవారిలో మరణ ప్రమాదాన్ని 50% వరకు తగ్గించవచ్చని తెలిపింది. పిల్లలకు వాహనాలు దూరం పెట్టడం ద్వారా వారి మరణాలు 71% తగ్గుతాయని వెల్లడించింది.
- ✓ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2030 నాటికి రోడ్డు ట్రాఫిక్ ప్రమాదాల వల్ల ప్రపంచవ్యాప్తంగా మరణాలు మరియు గాయాల సంఖ్యను సగానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం సభ్య దేశాలు మరియు సంబంధిత రంగాలలో భాగస్వాములతో కలిసి పనిచేసేందుకు సిద్ధమవుతుంది. దీని కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థతో కలిసి పని చేయడంతో పాటుగా జాతీయ రహదారి భద్రతా సంస్థల అధిపతుల ప్రపంచ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతుంది.
- ✓ ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థలు ఉమ్మడిగా ఈ రోడ్ సేఫ్టీ కోలాబరేషన్ మెకానిజంకు అధ్యక్షత వహించనున్నాయి. ఇందులో భాగంగా కీలక భాగస్వాములతో కలిసి, యూఎన్ రహదారి భద్రతా వారాలు, రోడ్డు ట్రాఫిక్ బాధితుల కోసం వార్షిక ప్రపంచ దినోత్సవం వంటి హై ప్రొఫైల్ అడ్వకేసీ ఈవెంట్‌లను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

## రెండవ అతిపెద్ద సోలార్ ఫోటో పివి డెవలపర్‌గా అదానీ గ్రీన్ ఎనర్జీ

- ✓ మెర్కామ్ క్యాపిటల్ గ్రూప్ తాజా వార్షిక నివేదిక ప్రకారం ప్రపంచంలోని అతిపెద్ద సోలార్ ఫోటో వోల్టాయిక్ సెల్ డెవలపర్ లలో అదానీ గ్రీన్ ఎనర్జీ రెండవ స్థానంలో నిలిచింది. పునరుత్పాదక ఇంధన రంగంలో దాని సహకారం మరియు పనితీరు ఆధారంగా అదానీ గ్రీన్ ఎనర్జీ ఈ స్థానానికి ర్యాంక్ చేయబడింది.41.3 గిగా వాట్స్ సామర్థ్యంతో ఫ్రాన్స్‌కు చెందిన టోటల్‌ఎనర్జీస్ అగ్రస్థానంలో నిలవగా, 18 గిగా వాట్స్ సామర్థ్యంతో కెనడాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్ రెన్యూవబుల్ పార్ట్నర్స్ మూడవ స్థానంలో నిలిచింది.
- ✓ టాప్ 10 గ్లోబల్ లార్జ్-స్కేల్ సోలార్ ఫోటో వోల్టాయిక్ సెల్ డెవలపర్‌లలో ఆరుగురు ఐరోపాలో మరియు ముగ్గురు ఉత్తర

అమెరికాలో ఉండగా, ప్రపంచ జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక దక్షిణాసియా ఆధారిత కంపెనీగా అదానీ గ్రీన్ ఎనర్జీ నిలిచింది. అదానీ గ్రీన్ ఎనర్జీ అనేది క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్ని ఎనేబుల్ చేసే భారతదేశపు అతిపెద్ద పునరుత్పాదక ఇంధన పరిష్కారాల భాగస్వామి. అదానీ కంపెనీ ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో 8.4 గిగా వాట్స్ ఆపరేటింగ్ పునరుత్పాదక పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది.

## క్యూఎస్ భారతీయ ర్యాంకింగులో ఢిల్లీ యూనివర్సిటీ టాప్

- ✓ 2024 క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ సస్టైనబిలిటీ ర్యాంకింగ్స్‌లో 56 భారతీయ విశ్వవిద్యాలయాలలో ఢిల్లీ విశ్వవిద్యాలయం అగ్రస్థానంలో నిలిచింది. గ్లోబల్ టాప్ 300లో ఉన్న ఏకైక భారతీయ విద్యా సంస్థగా కూడా నిలిచింది. ఈ జాబితాలో ఢిల్లీ యూనివర్సిటీ 220వ స్థానంలో నిలిచింది. కాగా భారతదేశం నుండి బాంబే ఐఐటీ (303), మద్రాస్ ఐఐటీ (344), ఖరగ్‌పూర్ ఐఐటీ (349) మరియు రూర్కీ (387) ఐఐటీలు టాప్ 400లో చోటు దక్కించుకున్నాయి.
- ✓ ఎన్విరాన్‌మెంటల్ సస్టైనబిలిటీ ఇండికేటర్‌లో నాలుగు భారతీయ విశ్వవిద్యాలయాలు ప్రపంచంలోని టాప్ 100లో చోటు సంపాదించాయి. వీటిలో వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విఐటి) ప్రపంచవ్యాప్తంగా 49వ స్థానంలో నిలిచింది. అలానే క్యూఎస్ యూనివర్సిటీ సమానత్వ సూచికలో మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ గ్లోబల్ ర్యాంకింగులో 463వ స్థానంలో ఉంది. ప్రపంచంలోని టాప్ 500లో ఉన్న ఏకైక భారతీయ సంస్థ ఇది మాత్రమే.
- ✓ 2024 క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ సస్టైనబిలిటీ ర్యాంకింగ్స్ 95 దేశాల్లోని 1,397 సంస్థలకు సంభందించి విడుదల చేసింది. టొరంటో విశ్వవిద్యాలయం ప్రపంచంలోనే అత్యంత స్థిరమైన విశ్వవిద్యాలయంగా పేరుపొందింది. రెండవ స్థానంలో కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, మూడవ స్థానంలో మాంచెస్టర్ విశ్వవిద్యాలయం ఉన్నాయి.

**టాప్ 10 క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీలు**

టొరంటో విశ్వవిద్యాలయం (కెనడా),యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా (యూఎస్),మాంచెస్టర్ విశ్వవిద్యాలయం (యూకే),బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం (కెనడా),ఆక్లాండ్ విశ్వవిద్యాలయం (న్యూజిలాండ్),ఇంపీరియల్ కాలేజ్ లండన్ (యూకే),సిడ్నీ విశ్వవిద్యాలయం (ఆస్ట్రేలియా),లండ్ విశ్వవిద్యాలయం (స్వీడన్),మెల్బోర్న్ విశ్వవిద్యాలయం (ఆస్ట్రేలియా),వెస్ట్రన్ యూనివర్సిటీ (కెనడా).

## క్లైమేట్ చేంజ్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ 2024లో ఇండియాకు 7వ ర్యాంక్

- ✓ 2023 క్లైమేట్ చేంజ్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ (సీసీపిఐ)లో భారతదేశం 7వ స్థానంలో ఉంది, ఇది 2014లో దాని మునుపటి 31వ ర్యాంక్ నుండి గణనీయమైన మెరుగుదలని సూచిస్తుంది. దుబాయ్‌లో జరిగిన గ్లోబల్ క్లైమేట్ కాన్ఫరెన్స్ (కాప్-28) సందర్భంగా విడుదల చేసిన నివేదిక ప్రకారం, భారతదేశం వరుసగా ఐదవ సంవత్సరం కూడా టాప్ 10 స్థానాలలో నిలిచింది. ఈ ఇండెక్స్‌లో మొదటి మూడు స్థానాలను ఏ దేశానికి కేటాయించబడనప్పటికీ డెన్మార్క్ ఈ ఇండెక్స్‌లో ముందుంది, తర్వాత స్వీడన్ మరియు చిలీ దేశాలు ఉన్నాయి. అలానే చివరి మూడు స్థానాలలో ఇరాన్, సౌదీ అరేబియా మరియు కజకిస్తాన్ దేశాలు ఉన్నాయి.
- ✓ గ్లోబల్ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలలో 90 శాతానికి పైగా కవర్ చేస్తూ 63 దేశాలు మరియు యూరోపియన్ యూనియన్ వాతావరణ ఉపశమన ప్రయత్నాలను ఈ ఇండెక్స్ అంచనా వేసింది. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు, ఇంధన వినియోగం, వాతావరణ విధానం మరియు పునరుత్పాదక శక్తి వంటి అంశాలలో సీసీపిఐ దేశాలను అంచనా వేసింది. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు మరియు ఇంధన వినియోగ విభాగాల్లో భారతదేశం అధిక మార్కులను సంపాదించింది. ఈ ర్యాంకింగులో అతిపెద్ద కాలుష్యకారకమైన చైనా 51వ స్థానంలో ఉండగా, రెండవ అతిపెద్ద ఉద్గారిణి అయిన యూఎస్ 57వ స్థానంలో నిలిచింది.
- ✓ ఈ క్లైమేట్ చేంజ్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ మొదటిసారిగా 2005లో ప్రచురించబడింది. నాటి నుండి ఏటా యూఎన్ వాతావరణ మార్పు సదస్సులో తాజా డేటాను ప్రదర్శిస్తుంది. ఈ ఇండెక్స్ జర్మన్ పర్యావరణ మరియు అభివృద్ధి సంస్థ జర్మన్‌వాచ్ న్యూ క్లైమేట్ ఇన్‌స్టిట్యూట్ రూపొందిస్తుంది. దీనికి క్లైమేట్ యాక్షన్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ సహకారం అందిస్తుంది. అలానే బార్తెల్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందిస్తుంది.

## ఆగ్నేయాసియా ప్రాంతంలో ఇండియాలోనే 66% మలేరియా కేసులు

- ✓ ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదిక ప్రకారం 2022లో సౌత్ - ఈస్ట్ ఆసియా ప్రాంతంలో మొత్తం మలేరియా కేసుల్లో 66 % భారత్‌లోనే నమోదయినట్లు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 249 మిలియన్ మలేరియా కేసులు నమోదవ్వగా ఆగ్నేయాసియా ప్రాంతంలో 66 శాతం ఘటనలు భారత్‌లోనే ఉన్నట్లు నివేదించింది. అలానే ఈ ఏడాది ఈ ప్రాంతంలో జరిగిన మొత్తం మలేరియా మరణాలలో 94% భారతదేశం మరియు ఇండోనేషియాలో సంభవించాయని ఈ నివేదిక పేర్కొంది.

# BEST COACHING CENTRE FOR

## BANK — POs / Clerks

## SSC — CGL / CHSL

## RRB — TECH / NON-TECH

## S.I / కానిస్టేబుల్

- 24/7 Study Hall & Computer Lab
- Topic Wise Daily Tests
- 500+Hours Class Room Training
- Daily Home Assignments

# IACE

Indian Academy of Competitive Exams Pvt. Ltd.

(An ISO 9001 : 2015 Certified Institute)

9533 200 400 www.iace.co.in Toll Free No: 1800-270-9975

BRANCHES

| AMEERPET | DILSUKHNAGAR | KPHB | NELLORE | VIZAG | TIRUPATI | RAJAHMUNDRY |
|---|---|---|---|---|---|---|
| 97000 77411 | 97000 77422 | 89789 48855 | 97000 77433 | 91000 61891 | 9160 905 905 | 97049 55833 |